గురువారం
14-8-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 324
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్ర లో
మ్యాగ్జైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్ మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

దంచికొట్టింది

భారీ వర్షాలతో విలవిల | లోతట్టు ప్రాంతాలు జలమయం

- ప్రజాజీవనం అస్తవ్యస్తం
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- నీటమునిగిన పంట పొలాలు
- రోడ్లపైకి వరద నీరు... ట్రాఫిక్‌కు అంతరాయం

విశాలాంధ్ర - హైదరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మూడు రోజులపాటు హైదరాబాద్ వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, మేడ్చల్, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు హెచ్చరికలు జారీ చేసినట్లు వాతావరణ శాఖ డైరెక్టర్ నాగరత్న తెలిపారు. హైదరాబాద్, హనుమకొండ, ఆదిలాబాద్, జనగామ, కామారెడ్డి, కుమురంభీం, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, నల్గొండ, రంగారెడ్డి, సిద్దిపేట, వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసినట్లు చెప్పారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. పశ్చిమ- మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో బుధవారం ఏర్పడిన అల్పపీడనం శుక్రవారం నాటికి

- మిగతా 2 లో

భారత్ వెనక్కి తగ్గట్లేదు!

వాషింగ్టన్: సుంకాలు విధించినప్పటికీ వాణిజ్య చర్చలపై భారత్ వెనక్కి తగ్గకపోవడంతో పురోగతి లేదని అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ అన్నారు. అక్టోబర్ చివరికి న్యూఢిల్లీ సహా అన్ని ముఖ్యమైన దేశాలతో చర్చలు ముగిసే అవ కాశం ఉన్నట్లు తెలిపారు. సుంకాలు అమ ల్లోకి రాకముందే వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి భారత్ చర్యలు తీసుకుంటోంది. ఐరాస జనరల్ అసెంబ్లీ సమావేశాల నిమిత్తం మోదీ త్వరలో అమెరికా పర్యటనకు వెళ్లనున్న క్రమంలో వాణిజ్య సమస్యల పరిష్కారానికి ట్రంప్‌తో సమావేశమ య్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఎఫ్-16పై పాక్‌ను అడగండి

వాషింగ్టన్: ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్ ఎఫ్ 16 యుద్ధ విమానాలకు నష్టంపై నిర్దిష్ట ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి అమెరికా నిరాకరించింది. దీని గురించి పాకిస్థాన్ ప్రభుత్వాన్ని సంప్రదించాలని సూచించింది. ఎఫ్ -16 యుద్ధ విమానాలపై అమెరికాకు సమాచారం ఉంటుంది. ఈ క్రమం లోనే ఎఫ్-16 జెట్లపై ప్రశ్నించగా, అమెరికా విదేశాంగ శాఖ సమాధానాన్ని దాటవేసింది. భారత్‌తో ఘర్షణ సమయంలో పాకిస్థాన్‌కు అమెరికా మద్దతిచ్చింది. ఇటీవల ఆదేశ సైన్యాధికారి అసీం మునీర్ అమెరికాలో పర్యటించడం, అక్కడ నుంచి అణు దాడులు చేస్తామని హెచ్చరికలు చేయడం విదితమే.

ఐసీఐసీఐ యూటర్న్

ముంబై: ప్రైవేటురంగ బ్యాంక్ ఐసీఐసీఐ రూ.50వేల కనీసం బ్యాలెన్స్ నిబంధనపై వెనక్కి తగ్గింది. మెట్రో/ అర్బన్ ఖాతాదారులు రూ.15,000 నెలవారీ సగటు బ్యాలెన్స్ కలిగి ఉండాలని పేర్కొంది. సెమీ అర్బన్ ప్రాంతాల్లో రూ.7,500 ఉండాలన్న నిబంధన విధించింది. గ్రామాల్లో రూ.2,500 మినిమం బ్యాలెన్స్ ఉంచితే సరిపోతుందని పేర్కొంది. పొదుపు ఖాతాల్లో కనీస నిల్వ లేనిపక్షంలో విధిస్తున్న అపరాధ రుసుమును ప్రభుత్వ రంగ బ్యాంకులు పూర్తిగా ఎత్తి వేయగా.. ఐసీఐసీఐ బ్యాంక్ మాత్రం అందుకు భిన్నంగా ఖాతా దార్లకు షాకిచ్చిన విషయం తెలిసిందే.

ఇదీ లోకం!

కోదండరాం, అలీఖాన్
ఎమ్మెల్సీ పదవి రద్దు

- సుప్రీంకోర్టు సంచలన తీర్పు

విశాలాంధ్ర- హైదరాబాద్: సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. గవర్నర్ కోటాలో ఎన్నికైన ఎమ్మెల్సీ కోదండరాం, అలీఖాన్ నియామకం రద్దు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరి నియామకం అక్రమమంటూ బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, సత్యనారాయణ దాఖలు చేసిన పిటిషన్‌లపై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం... కోదండరాం, అలీఖాన్ నియామకం రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. కోదండరాం, అలీఖాన్ నియామకం అక్రమంగా జరిగిందని వీరు గవర్నర్‌కు తెలిపారు. గవర్నర్ వీరి వాదనను తిరస్కరించడంతో... సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపి వీరి నియామకాన్ని రద్దు చేయాలని సుప్రీంను కోరారు. విచారణ జరిపిన సుప్రీం ఆగస్టు 14, 2024 తీర్పులో మార్పులు చేస్తూ... వారి నియామకం చెల్లదని తాజాగా తీర్పును వెలువరించింది. తదుపరి విచారణను సెప్టెంబరు 17వ తేదీకి వాయిదా వేసింది.

బీజేపీ, కాంగ్రెస్‌కు
చెంపపెట్టు

సుప్రీం కోర్టు తీర్పుపై కేటీఆర్

విశాలాంధ్ర-హైదరాబాద్: గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలు కోదండరాం, అమీర్ అలీ నియామకం చెల్లదని సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చిందని, ఇది బీజేపీకి, కాంగ్రెస్‌కు చెంపపెట్టు అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. ఢిల్లీ పార్టీలు రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగిస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశాయన్నారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన దాసోజు శ్రవణ్, సత్యనారాయణను ఎమ్మెల్సీలుగా సిఫార్సు చేస్తే పట్టించుకోకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నాటి గవర్నర్ చులకన చేశారని కేటీఆర్ మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం గవర్నర్

- మిగతా 2 లో

నా ప్రాణానికి ముప్పు

పూనే కోర్టుకు రాహుల్ అభ్యర్థన

న్యూఢిల్లీ: తన ప్రాణానికి ముప్పు ఉందని, రక్షణ కల్పించాలని కోరుతూ లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం పూనే కోర్టును ఆశ్రయించారు. ఇటీవలి రాజకీయ పోరాటాలు, సావర్కర్ పరువు నష్టం కేసు నేపథ్యంలో తనకు ప్రాణా పాయం ఉన్నట్లు రాహుల్ తరపున న్యాయవాది మిలింద్ దత్తాత్రేయ పవార్ బుధవారం ప్రత్యేక ఎంపీ/ఎమ్మెల్యే కోర్టుకు విన్నవించారు. ముందస్తు రక్షణ కోరడంతో పాటు ప్రస్తుత కేసు విచారణలో న్యాయం, సమగ్రత, పారదర్శకతకు హామీ ఉండేలా

- మిగతా 2 లో

ఓటు హక్కు పరిరక్షణే ధ్యేయం

- ప్రశ్నించాలి... సమాధానాలు కోరాలి
- ఓటు పోతే హక్కులు, గుర్తింపు ఉండవు
- దేశ ప్రజలకు ఖర్గే, రాహుల్ పిలుపు
- ఓట్ల చోరీపై కాంగ్రెస్ పోరు ఉధృతం
- కొత్తగా 55 సెకన్ల వీడియో అస్త్రం

2 లో

యూరియా సరఫరాలో
కేంద్రం నిర్లక్ష్యం

- రాష్ట్రంపై సవతితల్లి ప్రేమ
- కేంద్ర మంత్రులున్నా ఒరిగింది శూన్యం
- రైతు ప్రయోజనాల కోసం పోరాడుతాం: మంత్రి తుమ్మల

విశాలాంధ్ర- హైదరాబాద్: రాష్ట్రానికి అవసరమైన యూరియా సరఫరాలో కేంద్రం చూపుతున్న నిర్లక్ష్యం, ద్వంద్వ వైఖరిపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం తరఫున ఎన్ని లేఖలు రాసినా... మేం చూసుకుంటామని తిరుగు సమాచారం ఇవ్వడం తప్ప, రాష్ట్రానికి చేసింది ఏమీ లేదని మండిపడ్డారు. రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమ చూపుతుందన్నారు. రైతుల ప్రయోజనం కోసం రాజకీయాలను పక్కన పెట్టి, ఎన్నోసార్లు కేంద్రం తలపు తట్టామని, ముఖ్యమంత్రి స్వయంగా కలిసినా కేంద్రం శీతకన్ను వేసిందని దుయ్యబట్టారు. నెలకు ఒకసారి కేంద్ర అధికారులను కలిసి విన్నవించిన ఎలాంటి కదలిక లేదని అన్నారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులను కోరినా... వారు రాజకీయ ప్రకటనలు చేయడం తప్ప, కేంద్రంతో మాట్లాడింది లేదన్నారు. దేశానికి అన్నంపెట్టే రైతన్నలపై ఇలాంటి కఠిన ధోరణి మంచిది కాదన్నారు. సీజన్‌లో పొలాల్లో ఉండాల్సిన రైతన్నలు ఇలా

- మిగతా 2 లో

భూధార్ నంబర్ల
కేటాయింపునకు ప్రణాళికలు

- నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా భూములకు భూధార్ నెంబర్ల కేటాయింపునకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై ముఖ్యమంత్రి బుధవారం సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో వారసత్వ, ఇతర మ్యుటేషన్లకు సంబంధించి స్వీకరించిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. లైసెన్స్డ్ సర్వేయర్లు సర్వే చేసిన అనంతరం రెగ్యులర్ సర్వేయర్లు వాటిని పరిశీలించేలా చూడాలన్నారు. కోర్ అర్బన్ ఏరియాలో నూతన 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నమూనాలను సీఎం పరిశీలించారు. ప్రతి కార్యాలయంలో పార్కింగ్, క్యాంటీన్, ఇతర మౌలిక వసతులు ఉండాలని, కార్యాలయాలు ప్రజలకు స్నేహపూర్వక వాతావరణంలో సేవలు అందించాలని, సౌకర్యవంతంగా ఉండాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నెలాఖరులోగా ఇళ్ల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. హైదరాబాద్‌లోని హౌసింగ్ బోర్డుతో జాయింట్ వెంచర్‌గా ఉన్న ప్రాజెక్టుల్లోని సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులకు రేవంత్ స్పష్టంచేశారు. సమీక్షలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం ముఖ్య కార్యదర్శులు వి.శేషాద్రి, కేఎస్ శ్రీనివాసరాజు, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, సీసీఎల్ఏ కార్యదర్శి డీఎస్ లోకేశ్ కుమార్, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వీపీ గౌతమ్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఆరోగ్య శాఖ అధికారులతో మంత్రి దామోదర

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్రానికి మూడు రోజుల పాటు భారీ వర్ష సూచన ఉన్నందున ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, ఆర్ఎంవోలు, మెడికల్ ఆఫీసర్లు, డాక్టర్లు, సిబ్బంది ఈ మూడు రోజులు కచ్చితంగా ఆసుపత్రుల్లోనే ఉండాలన్నారు. సెలవులు రద్దు చేయాలని ఆదేశించారు. రోగులు, గర్భిణులకు తక్షణమే వైద్య సేవలు అందించాలని సూచించారు. గర్భిణులను బర్త్ వెయిటింగ్ రూమ్స్‌కు తరలించి సేవలందించాలన్నారు. అంబులెన్స్‌లు, 102 వాహనాలు అన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, ఎక్కడ ఎమర్జెన్సీ ఉన్నా తక్షణమే వెళ్లి పేషెంట్‌ను తరలించేలా డ్రైవర్లు, ఈఎంటీలను 24 గంటలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, జనరేటర్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎలక్ట్రీషియన్లను 24 గంటలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆసుపత్రుల్లోకి వర్షం నీరు చేరకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ, పరిస్థితిని సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఏపీ హైకోర్టు జడ్జిలుగా నలుగురి ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా ఉన్న నలుగురు బుధవారం న్యాయమూర్తులుగా ప్రమాణ స్వీకారం చేశారు. జస్టిస్ హరినాథ్ నూనెపల్లి, జస్టిస్ కిరణ్మయి మండవ (కిరణ్మయి కనపర్తి), జస్టిస్ సుమతి జగడం, జస్టిస్ న్యాపతి విజయ్‌తో ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు. కోర్టు మొదటి హాల్‌లో జరిగిన ఈ కార్యక్ర మంలో న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, బార్

- మిగతా 2 లో

శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం

'ఇండియాస్ 100 మోస్ట్ ఇన్‌ఫ్లుయెన్షియల్ పీపుల్ ఇన్ ఏఐ' జాబితాలో చోటు

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం దక్కింది. అనలిటిక్స్ ఇండియా మ్యాగజైన్ తాజాగా ప్రకటించిన 'ఇండియాస్ 100 మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ పీపుల్ ఇన్ ఏఐ-2025' జాబితాలో ఆయనకు చోటు లభించింది. తమ సమర్థవంతమైన నాయకత్వం, నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహమిస్తూ భారత్ ను ఏఐ రంగంలో అగ్రగామిగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్న వ్యక్తులకు ఇందులో చోటు కల్పించారు. విధాన రూపకర్తల విభాగంలో శ్రీధర్ బాబుతో పాటు కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, పీయూష్ గోయల్, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, ఇండియా ఏఐ మిషన్ సలహాదారు ఆకృత్ వైష్, ఇండియా ఏఐ మిషన్ సీఈవో, ఎన్ఐసీ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, ఎన్‌పీసీఐ సీఈవో దిలీప్ అస్బే, నీతి ఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్, నాస్కామ్ మాజీ అధ్యక్షుడు దేబజాని ఘోష్ తదితర ప్రముఖులను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు.

'ఏఐ' రోల్ మోడల్‌గా తెలంగాణ

మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో ఏఐ రంగంలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ మారిందని, అందుకే ఆయనను ఈ జాబితాలో చేర్చినట్లు అనలిటిక్స్ ఇండియా మ్యాగజైన్ నిర్వాహకులు ప్రకటించారు. 'బాధ్యతాయుతమైన ఏఐ అమలు కోసం సమగ్ర ఏఐ ఆధారిత తెలంగాణ స్ట్రాటజీ అండ్ రోడ్ మ్యాప్ ను రూపొందించడంలో కీలకంగా వ్యవహరించారన్నారు. గుడ్

- మిగతా 2 లో

సాహసిస్తే... గుణపాఠం తప్పదు

సింధూ జలాల నిలుపుదలపై భారత్‌కు పాక్ హెచ్చరిక

ఇస్లామాబాద్: ఆపరేషన్ సిందూర్ సమయంలో సింధూ జల సంధిని భారత్ రద్దు చేయడంతో పాకిస్థాన్ నాయకులు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. తమ దేశాన్ని కరువు ప్రాంతంగా మార్చే చర్యను ఎంత మాత్రం సహించేది లేదని వరుస పెట్టి హెచ్చరికలు చేస్తున్నారు. ఇదే అంశంపై ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తాజాగా భారత్‌కు ఓ హెచ్చరిక చేశారు. సింధూ జలాల్లో ఒక చుక్క కూడా వదులుకోమని, వాటిని గుంజుకునే అవకాశం ఇవ్వబోమని తేల్చి చెప్పారు. 'మీరు మా నీటిని నిలిపివేసేందుకు సాహిస్తే తగిన గుణపాఠం నేర్పుతాం' అంటూ షెహబాజ్ హెచ్చరించారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఇస్లామాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సింధు జలాలు పాకిస్థాన్‌కు జీవనాడి అని, అంతర్జాతీయ ఒప్పందాల ప్రకారం పాక్ హక్కులపై రాజీ ప్రసక్తే లేదని ప్రధాని తేల్చిచెప్పారు. నదీజలాలను నిలిపివేసే ఏ చర్యనైనా యుద్ధానికి కవ్వింపుగా భావిస్తామని హెచ్చరించారు. ఇప్పటికే ఆ దేశ సైన్యాధికారి అసీం మునీర్, విదేశాంగ శాఖ మాజీ మంత్రి బిలావల్ భుట్టో భారత్‌ను హెచ్చరించారు. అణ్వస్త్రాలు ప్రయోగించేందుకు సిద్ధమేనని, సింధూ నదిపై భారత్ ఏవైన నిర్మాణాలు చేపడితే వాటిని క్షిపణులతో పేల్చేస్తామని మునీర్ హెచ్చరించడం విదితమే.

శాంతి చర్చలపై ఉత్కంఠ

ఆసక్తికరంగా పుతిన్ అలస్కా పర్యటన

రేపు ట్రంప్‌తో భేటీ

మాస్కో: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఈనెల 15న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భేటీ కానున్నారు. అమెరికా సుంకాలు, ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం దృష్ట్యా అధినేతల సమావేశం, శాంతి చర్చలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అలాస్కా యాంకరేజ్‌లోని ఎల్మెండోర్ఫ్-రిచర్డ్సన్ సైనిక స్థావరంలో ట్రంప్-పుతిన్ భేటీ కానున్నారు. అయితే చుట్టు ప్రత్యర్థి దేశాలు ఉండటం, అరెస్టుకు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు వారెంట్ జారీ నేపథ్యంలో ఖండాలను దాటి శాంతి చర్చల్లో పాల్గొనేందుకు పుతిన్ సిద్ధమవ్వడంతో ఈ ప్రయాణం ఓ సాహసమే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రష్యా దాదాపు 30కిపైగా దేశాల విమానాలు తమ గగనతలంలోకి రాకుండా నిషేధం విధించింది. ఇలాంటి పరిస్థితుల్లో పుతిన్ ప్రయాణించాల్సిన విమానం పశ్చిమార్ధగోళం నుంచి ఉన్న మార్గాన్ని పూర్తిగా మర్చిపోవాల్సిందే. దీంతో పుతిన్ విమానం రష్యా-అమెరికా మధ్య ఉన్న బేరింగ్ జలసంధిపై నుంచి వెళ్లాలి. ఇప్పటికే అమెరికా ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంది. తమ గగనతలంలోకి రష్యా అధినేత విమానం ప్రవేశించేందుకు అనుమతిచ్చింది. రష్యా మారుమూల ప్రదేశమైన చుకోట్కా ద్వీపకల్పం నుంచి పుతిన్ విమానం రానుంది. 2022లో ఉక్రెయిన్ యుద్ధం మొదలైన నాటి నుంచి నాటో దేశాలు తమ గగనతలాలను రష్యా వాడుకోకుండా మూసివేశాయి. అమెరికా, కెనడా, నార్వే, ఐరోపా సమాఖ్య దేశాలు వీటిలో ఉన్నాయి. ఇదిలావుంటే, ట్రంప్‌తో భేటీలో అలాస్కా సమావేశంలో రష్యా- ఉక్రెయిన్ మధ్య కాల్పుల విరమణ కోసం ఒప్పందం కుదురుతుందని ట్రంప్ ఇప్పటికే ఆశాభావం వ్యక్తంచేశారు. శాంతి ఒప్పందంలో భూభాగాల మార్పిడి ఉంటుందన్న సంకేతాలిచ్చారు. అయితే తమ ప్రాదేశిక సమగ్రతను దెబ్బతీసే చర్చలను ఆమోదించబోమని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తేల్చిచెప్పారు. పుతిన్-ట్రంప్ భేటీకి అమెరికాలోని అలాస్కా రాష్ట్రం వేదిక కావడం కూడా చర్చనీయాంశంగా మారింది. భౌగోళికంగా, వ్యూహాత్మకంగా అమెరికాకు కీలకప్రాంతంగా ఉన్న అలాస్కాను గతంలో రష్యా నుంచే కొనుగోలు చేశారు. అలాస్కా నుంచి రష్యా కనిపిస్తుంది. అలాస్కాలో పర్యటించినప్పటికీ తొలి రష్యా అధ్యక్షుడిగా పుతిన్ నిలవనున్నారు. అలాస్కాను అమెరికాకు అమ్మేసిన అంశాన్ని పుతిన్ లేవనెత్తే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉక్రెయిన్ భూభాగం తమ స్వాధీనానికి ఇవ్వాలని ఆయన వాదించే అవకాశం ఉందని బ్రిటన్ మాజీ దౌత్యవేత్త నిగెల్ గౌల్డ్ డెవిస్ అన్నారు.

కిమ్‌కు పుతిన్ ఫోన్

ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తో పుతిన్ ఫోన్‌లో మాట్లాడారు. తమ ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం చేసుకోవాలని ఇద్దరు నాయకులు నిర్ణయించారు. ఉక్రెయిన్‌తో యుద్ధానికి సైనికులను పంపినందుకు కిమ్‌కు పుతిన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు అధికారిక వర్గాలు వెల్లడించాయి. కిమ్ సైనికుల ధైర్య సాహసాలు, ప్రాణ త్యాగాలను పుతిన్ ప్రశంసించినట్లు వివరించింది. కుర్స్ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవడంలో ఎంతో సహకరించినట్లు తెలిపింది. ట్రంప్‌తో భేటీ వివరాలను చర్చించినట్లు రష్యా మీడియా పేర్కొంది. ఇటీవలి కాలంలో ఈ రెండు దేశాలు తమ సంబంధాలను బలోపేతం చేసుకున్నాయి. మాస్కో సైన్యానికి మద్దతుగా దళాలను పంపించడంతో పాటు కిమ్ ఆయుధాలను సరఫరా చేశారు. గతేడాది ఇరుదేశాల మధ్య కీలక రక్షణ ఒప్పందం కూడా జరిగింది.

మీరూ జైలుకెళతారా?

- చట్ట పరిధిలో పనిచేయండి
- మీ పని తీరుతో ప్రజల్లో భయాందోళన
- ఐఏఎస్, ఐపీఎస్‌లకు రామకృష్ణ హితవు

విశాలాంధ్ర బ్యూరో- అనంతపురం: కూటమి ప్రభుత్వంలో పనిచేసే అధికారులు, కొందరు ప్రజాప్రతినిధులు చట్టా నికి అతీతులుగా వ్యవ హరిస్తున్నారని, వారి మూలంగా రాష్ట్ర ప్రజలు భయాందోళనలో ఉన్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. అనంతపురంలో సీపీఐ జిల్లా మహాసభ ప్రాంగణంలో బుధవారం రామకృష్ణ విలేకరులతో మాట్లా డారు. 1952 నుండి అనంతపురం జిల్లాలో కమ్యూనిస్టులు, కాంగ్రెస్, టీడీపీకి చెందిన మహనీయులు చాలామంది ఎమ్మెల్యేలుగా గెలిచారని, వారంతా అభివృద్ధి, ప్రజాసంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేశారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో గెలిచిన అనంతపురం ఎమ్మెల్యే బరితెగించారని, ఆయన కబ్జాలు, రౌడీయిజానికి పూనుకోవడం దుర్మార్గమని రామకృష్ణ మండిపడ్డారు. నగరంలో పేదలు, మధ్యతరగతి ప్రజలు జీవించే హక్కు కోల్పోతున్నారని ఆందోళన చెందారు. స్థానిక ఎమ్మెల్యే అనుచరుల మంటూ బహిరంగంగా దందాలకు పాల్పడుతున్నారని, భూకబ్జాలతో భయాందోళనలు రేకెత్తిస్తున్నారని విమర్శించారు. ఇంత జరుగుతున్నా పోలీస్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రశాంత వాతావరణం కల్పించాల్సిన ఐఏఎస్, ఐపీఎస్‌లు ఎక్కడున్నారని నిలదీశారు. సుపరిపాలన తొలి అడుగు అంటూ చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తుంటే... తొలి ఏడాదిలోనే అనంతపురంలో కబ్జాలు, దందాలకు అంతులేకుండా పోయిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అధికారపక్షానికి వంతపాడి ఇష్టారాజ్యంగా వ్యవహరించిన ఆరుగురు ఐపీఎస్‌లు కేసులు ఎదుర్కొంటున్నారని, డీజీ ర్యాంకు గల ఆరుగురు అధికారులు జైలుకెళ్లడం గుర్తులేదా అని ప్రశ్నిం చారు. ఇప్పుడు కూడా అధికార పక్షానికి వంతపాడుతున్న ఐఏఎస్, ఐపీఎస్‌లు జ్ఞానోదయం కలిగి చట్టానికి అనుగుణంగా పనిచేయాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరిలో మార్పు రాకపోతే... ఉమ్మడి జిల్లాలో ఆ పార్టీ కనుమరుగవుతుంద న్నారు. ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు లోకల్, నాన్ లోకల్ అంటూ కౌన్సెలింగ్ నిర్వహించకపోవడం బాధాకరమని, దీనికి ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి లోకేశ్ సమాధానం చెప్పాలన్నారు. పీ 4 పథకంతో పేదలను ధనవంతు లుగా చేస్తా అంటూ చంద్రబాబు ప్రగల్భాలు పలుకుతున్నారని, అభివృద్ధిని మాత్రం అటకెక్కించారని విమర్శించారు. బనకచర్ల ప్రాజెక్టు పేరుతో రూ.82 వేల కోట్లు అప్పు చేయడానికి సిద్ధమయ్యాడన్నారు. రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులు 1995 నుంచి ముందుకు సాగడం లేదని, ప్రభుత్వాలు మారినా ప్రాజెక్టుల్లో కనీస పురోగతి లేదని రామకృష్ణ అన్నారు.

ఏపీ హైకోర్టు జడ్జిలుగా నలుగురి ప్రమాణ స్వీకారం

(మొదటిపేజీ తరువాయి)

కౌన్సిల్ అధ్యక్షుడు ద్వారకానాథ్ రెడ్డి, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, అదనపు సొలిసిటర్ జనరల్ ధనంజయ, అదనపు అడ్వకేట్ జనరల్ పి.సాంబశివ ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీనారా యణ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారధి, ఇతర రిజిస్ట్రార్లు, సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్,బార్ కౌన్సిల్ సభ్యులు, ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఏపీ జుడీషియల్ అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు. హైకోర్టు న్యాయమూర్తులుగా ఈ నలుగురిని నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇటీవల ఆదేశాలు ఇచ్చారు.

యూరియా సరఫరాలో కేంద్రం నిర్లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

యూరియా కోసం బారులుతీరడం అన్యాయం అన్నారు. అందుకు కారణమైన కేంద్రంతో ఎంతవరకైనా పోరాడుతామని హెచ్చరించారు. తమ ఎంపీలు ఈ రోజు పార్లమెంట్‌లో కేంద్ర మంత్రిని కలిసి రాష్ట్రానికి కేటాయింపుల ప్రకారం రావాల్సిన యూరియా సరఫరా చేయాల్సిందిగా కోరడం జరిగిందని అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణకు 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించినా, ఏప్రిల్ నుంచి జూలై వరకు 32 శాతం కొరత ఏర్పడిందని మంత్రి తుమ్మల ఆగ్రహం వ్యక్తం చేశారు. మేలో 45 శాతం, ఆగస్టులోనూ 35 శాతం కొరత కొనసాగడం కేంద్రం రైతుల పట్ల ఉన్న నిర్లక్ష్యానికి ఇంతకంటే నిదర్శనం ఏముంటుందన్నారు. రాష్ట్రంలో రోజుకు 10 వేల నుంచి 12 వేల మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు జరుగు తుంటే, ఆగస్టులో మూడు లక్షల మెట్రిక్ టన్నులు అవసరం అని ముందుగానే రాష్ట్రం స్పష్టంగా తెలియజేసినా, కేంద్రం మాత్రం ఎప్పటి మాదిరిగానే రిక్త హస్తం ఇచ్చిందని విమర్శించారు. ఏప్రిల్-జులైలో ఏర్పడిన 2.10 లక్షల మెట్రిక్ టన్నుల కొరతతో పాటు ప్రస్తుత నెలలో ఉన్న 0.57 లక్షల మెట్రిక్ టన్నుల లోటును తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ఓటు హక్కు పరిరక్షణే ధ్యేయం

న్యూఢిల్లీ: ప్రజల ఓటు హక్కు పరిరక్షణే ధ్యేయంగా ఎన్నికల సంఘం, బీజేపీపై సమరాన్ని కాంగ్రెస్ వినూత్న రీతిలో ముందుకు తీసుకెళు తోంది. ఓటు దోపిడీకి గురైతే మీ హక్కులు, గుర్తింపు పోతాయంటూ ప్రజలను హెచ్చరించింది. ఓట్ల దొంగతనంపై ప్రశ్నించాలని, బాధ్యుల నుంచి సమాధానాలు కోరాలని ప్రజలకు కాంగ్రెస్ సూచించింది. ఇదే క్రమంలో 55 సెకన్ల నిడివిగల 'ఓట్ చోరీ' వీడియో అస్త్రాన్ని సంధించింది. నకిలీ ఓట్లు ఎలా పోలవుతాయో చూపించింది. 'గరీబ్ దాస్, జామ్నా దేవి దంపతులు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళతారు. వారిని ఇద్దరు వ్యక్తులు అడ్డుకుంటారు. మీ ఓట్లు వేసేశాం, ఇక మీరు మీ ఇంటికి వెళ్లిపోండి అని అంటారు. అనంతరం ఆ ఇద్దరు వ్యక్తులు నకిలీ ఓట్లు వేసి, అక్కడే బల్లపై 'ఎలక్షన్ చోరీ ఆయోగ్' అని బోర్డు పెట్టుకొని ఉన్న అధికారికి 'థంబ్స్ అప్' (బొటన వేలు పైకెత్తి సైగ చేయడం) చూపగా, ఓకే అంతా నేను చూసుకుంటా అన్నట్లు ఆయన సైగ చేస్తారు. ఇద్దరు వ్యక్తులు బూత్ వద్ద మెట్లపై కూర్చొని తమ వద్ద ఉన్న ఓటరు కార్డులన్నీ చూసుకుంటుడంతో వీడియో ముగుస్తుంది. ఈ వీడియో ద్వారా ఓట్ల దొంగతనాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నించింది.

బీజేపీ కబంధ హస్తాల నుంచి రాజ్యాంగబద్ధ వ్యవస్థలను పరిరక్షించుకోవడం కోసం ప్రజలంతా గళం వినిపించాలంటూ లోక్‌సభ, రాజ్యసభలోని ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే బుధవారం ఎక్స్ మాధ్యమంగా పిలుపునిచ్చారు. 'మీ ఓటు చోరీ అయిందంటే మీ హక్కులు, మీ గుర్తింపు దోపిడీ అయినట్టే అంటూ హెచ్చరించారు. మీ ఓటు హక్కును దోచుకోనివ్వొద్దు అంటూ రాహుల్ సూచించారు. 'ప్రశ్నించండి, సమాధానాలను డిమాండ్ చేయండి! ఓట్ల దొంగతానికి వ్యతిరేకంగా గళమెత్తండి. మీ ఓటు హక్కును దోచుకోనివొద్దు. బీజేపీ కబంధ హస్తాల నుంచి రాజ్యాంగబద్ధ వ్యవస్థలకు విముక్తి కోసం ఐక్యంగా పోరాడదాం' అంటూ ప్రజలకు ఖర్గే సందేశమిచ్చారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా స్పందిస్తూ 'మీ హక్కులు, మీ గుర్తింపును కాపాడుకోవడం కోసం మీ ఓటు చోరి కాకుండా చూసుకోవాలి. మీ ఓటును పరిరక్షించుకోండి. ఓట్ల దొంగతాన్ని ఎండగట్టండి' అంటూ పిలుపునిచ్చారు. ఈ 55 సెకన్ల వీడియోను మంగళవారం ఉదయం ఇన్స్టాగ్రామ్‌లో పెట్టగా 1,21,358 మంది వీక్షించారు. ఓట్ల దొంగతనం అన్నది చావో-రేవో అన్నట్లుగా మారిందని కాంగ్రెస్ నాయకులు తేల్చిచెప్పారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడం కోసం ఉద్యమ కార్యాచరణను సిద్ధం చేసుకున్నారు. ఇదే అంశమై నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ)కి ఏఐసీసీ ఇంచార్జి కన్హయ కుమార్ మాట్లాడుతూ ఓట్ల చోరీ చాలా పెద్ద అంశమన్నారు. 'రాహుల్ గాంధీ నిజాలను వెలుగులోకి తెచ్చారు. ప్రజాస్వామ్యం గొంతు ఏ విధంగా నొక్కేస్తున్నారన్నది రుజువులు చూపారు' అని వెల్లడించారు.

ఓట్ల చోరీ గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గురువారం 'లోకతంత్ర బచావో మషాల్ మార్చ్' పేరిట కాగడాల ప్రదర్శనను అన్ని జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ చేపడుతోందన్నారు. ఈనెల 22 నుంచి సెప్టెంబరు 7వ తేదీ వరకు 'ఓట్ చోర్, గద్దీ ఛోడ్' (ఓట్ల దొంగ, గద్దె దిగు) నినాదంతో అన్ని రాష్ట్రాల్లో ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబరు 15 నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు సంతకాల సేకరణ జరుగుతుందన్నారు. ఈ పోరాటంలో ఇండియా ఐక్యసంఘటన కలిసివున్నట్లు కన్హయ చెప్పారు.

గ్రీన్ ఎనర్జీ కారిడార్‌గా ఏపీ

విద్యుత్ రంగంలో స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు: చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: గ్రీన్ ఎనర్జీ కారిడార్‌గా ఏపీని తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకీ మారుతున్న డైనమిక్స్‌కు అనుగుణంగా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు ఉండాలని సూచిం చారు. సీఎం క్యాంపు కార్యాలయంలో విద్యుత్ సరఫరా పరిస్థితి, విద్యుత్ ప్రాజెక్టులు, పెట్టు బడులు, విద్యుత్ చార్జీల భారం తగ్గింపు తదితర అంశాలపై సీఎం బుధవారం సమీక్ష నిర్వహిం చారు. సమీక్షకు ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సీఎస్ కె.విజయానంద్, ఏపీ ట్రాన్స్ కో, జెన్ కో అధికారులు హాజరయ్యారు. పునరుత్పాదక విద్యుత్ వేగంగా విస్తరించి జన జీవనంలోకి వచ్చేసిందని, ఇక భవిష్యత్ అంతా గ్రీన్ ఎనర్జీదేనని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో వ్యయం ఎలా తగ్గించాలన్న అంశంపై అధ్యయనం చేసి... ప్రజలకు ఆ ప్రయోజనాలు అందించాలన్నారు. వచ్చే రెండు, మూడేళ్లలో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం మరో 8.9 శాతం పెరిగే అవకాశ ముందన్న చంద్రబాబు... అందుకు అనుగుణంగా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు చేసుకోవాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి సాంకేతికతను వినియోగించి గ్రీన్ ఎనర్జీలో అతితక్కువ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తి చేసే మార్గాలను అన్వేషించాలని, వినియోగ దారులపై విద్యుత్ చార్జీల భారం మోపేందుకు వీల్లేదని సీఎం అధికారులకు తేల్చి చెప్పారు. నాన్ టారిఫ్ ఆదాయ మార్గాలను అన్వేషించాలని సూచించారు. ప్రస్తుతం ఏపీ ట్రాన్స్ కో వేసిన ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్‌ను లీజుకివ్వటం ద్వారా అదనపు ఆదాయం సాధిం చాలని, ఈ మార్గం ద్వారా దాదాపు రూ.7 వేల కోట్ల వరకూ ఆదాయం వచ్చే అవకాశముందని సీఎం అన్నారు. రాష్ట్రంలో 9 శాతంగా ఉన్న విద్యుత్ పంపిణీ నష్టాలు గణనీయంగా తగ్గాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వీటిని తగ్గించేందుకు ఫీడర్లను సమర్ధమంతంగా నిర్వహించటంతో పాటు ఆయా కేటగిరీల వారీగా విభజించుకోవాలన్నారు.

దంచికొట్టింది

(మొదటిపేజీ తరువాయి)

మరింత బలపడనున్నట్లు వాతావరణశాఖ అంచనా వేస్తోంది. హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మియాపూర్, చందానగర్, లింగంపల్లి, గచ్చిబౌలి, మాదాపూర్, రాయదుర్గం, బంజారాహిల్స్ ,జూబ్లీహిల్స్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్, బొల్లారం, సికింద్రాబాద్, చిలకలగూడ, మారేడుపల్లి, కోఠి, సుల్తాన్‌బజార్, బేగంబజార్, నాంపల్లి, బషీర్‌బాగ్, హిమాయత్‌నగర్, ముషీరాబాద్, కవాడీగూడ, దోమలగూడ, అంబర్‌పేట, కాచిగూడ, బర్కత్‌పురా సైదాబాద్, చంపాపేట్, సరూర్‌నగర్ రోడ్లపైకి నీరు చేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ములుగు జిల్లా వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కలెక్టర్ దివాకర్ అప్రమత్తత చర్యలు చేపట్టారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షం కురిసింది. మంచిర్యాల, కుమురంభీం జిల్లాల్లో అత్యధికంగా 23 సెం.మీ వర్షపాతం నమోదైంది. తాండూరులో రైల్వే అండర్ పాస్ నీట మునిగింది. రైల్వే గేటును అధికారులు మూసివేశారు. భీమిని మండలం పెద్దపేట, రాజారం మధ్య వాగు ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచాయి. చిన్నతిమ్మాపూర్ వద్ద ఎర్రవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మరోవైపు నల్లవాగు పొంగడంతో పంట పొలాలు నీట మునిగాయి. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వర్షం దంచికొడుతోంది. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. తిర్యాని మండలం మాణిక్యపూర్‌వాగు పొంగడంతో రాకపోకలు నిలిచాయి. ఆసిఫాబాద్‌లోని సందీప్‌నగర్‌లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరంగల్‌లో వరద ముంపు నుంచి కాలనీవాసులు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నారు. మైసయ్యనగర్, డీకేనగర్, ఎన్టీఆర్ నగర్, శివనగర్ కాలనీల్లో వరద కాస్త తగ్గుముఖం పట్టింది. పునరావాస కేంద్రాల నుంచి కాలనీ వాసులు ఇంటికి చేరుకుంటున్నారు.

నిండుకుండలా నాగార్జున సాగర్

గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాగార్జున సాగర్ జలాశయం నిండుకుండలా మారింది. ప్రాజెక్టులో 24 గేట్లు ఎత్తి నీటి ని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో 1,74,533 క్యూసెక్కులుగా ఉంటే ఔట్‌ఫ్లో 2,33,041 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 589.30గా ఉంది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా నీటినిల్వ 309.95 టీఎంసీలకు చేరింది.

శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద నీరు

శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. జూరాల, సుంకేశుల ప్రాజెక్టుల నుంచి వరద స్థిరంగా ఉంది. శ్రీశైలం ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 2,10,286 క్యూసెక్కులు ఉండగా ఔట్‌ఫ్లో 2,09,533 క్యూసెక్కులుగా ఉంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 35 వేల క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడి గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,590 క్యూసెక్కులు నీటిని వదులుతున్నారు. నాలుగు స్పిల్ వే గేట్ల ద్వారా 1,08,628 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 883 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 204.35గా ఉంది. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 16,027 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 551 క్యూసెక్కులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి సామర్థ్య 20.17 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి సామర్థ్యం 13.71 టీఎంసీలకు చేరింది. నిర్మల్ జిల్లా కడెం జలాశయానికి వరద నీరు చేరుతోంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా ప్రస్తుతం 695.300 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో 3242 క్యూసెక్కులుగా ఉంది. కడెం జలాశయం 2 గేట్ల ద్వారా దిగువకు 12,135 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా సింగూరు ప్రాజెక్టుకు వరద నీరు కొనసాగుతుంది. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 4,638 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 633 క్యూసెక్కులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి సామర్థ్యం 22.145 టీఎంసీలకు చేరింది. మంచిర్యాల జిల్లాలో23.3 సెం.మీ, కుమురంభీం 23.3 సెం.మీ, ఆదిలాబాద్ 23.3 సెం.మీ, కన్నెపల్లి (మంచిర్యాల)23.3 సెం.మీ, భీమిని (మంచిర్యాల) 22.6సెం.మీ, రెబ్బెన(కుమురంభీ) 22 సెం.మీ, తాండూరు (మంచిర్యాల)18.2 సెం.మీ, చిట్యాల (భూపాలపల్లి) 18 సెం.మీ, మంగపేట(ములుగు) 16.4 సెం.మీ, నెన్నెల(మంచిర్యాల)14.6 సెం.మీ, గిన్నెదారి(కుమురంభీం)14.6 సెం.మీ, జంబుగ (కుమురంభీం) 13.8 సెం.మీ, జంకాపూర్ (మంచిర్యాల)13.7 సెం.మీ, రేగొండ (భూపాలపల్లి)13.3 సెం.మీ, కుంచవల్లి (కుమురంభీం) 12.7 సెం.మీ, బెల్లంపల్లి(మంచిర్యాల) 12.6 సెం.మీ, పెద్దకోడూరు(సిద్దిపేట)12 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం

(మొదటిపేజీ తరువాయి)

గవర్నెన్స్, నూతన ఆవిష్కరణలు, సురక్షితమైన డేటా షేరింగ్‌ను ప్రోత్సహించేలా దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్ ను ప్రారంభించేందుకు చొరవ చూపారు' అని కొనియాడారు. 'గ్లోబల్ ఏఐ సమ్మిట్ నిర్వహణలోనూ శ్రీధర్ బాబు కీలకంగా వ్యవహరించారన్నారు. ఏఐ యూనివర్సిటీ విషయంలోనూ కీలకంగా వ్యవహరిస్తున్నారు అని ప్రశంసించారు.

సీఎం రేవంత్ రెడ్డి ప్రోత్సాహంతోనే గుర్తింపు ...

'ఇది నా ఒక్కడికి లభించిన గుర్తింపు కాదు. తెలంగాణ ప్రజలకు దక్కిన గౌరవం. సమ్మిళిత వృద్ధి, మెరుగైన జీవితాలను అందించేందుకు ఏఐని వినియోగించాలన్న తమ ప్రభుత్వ దూర దృష్టికి ఈ గుర్తింపు నిదర్శనం. సీఎం రేవంత్ రెడ్డి ప్రోత్సాహంతోనే నాకు ఈ జాబితాలో చోటు దక్కింది. ఆయన నాయకత్వంలో తెలంగాణను ఏఐ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్ గా తీర్చిదిద్దేలా కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. సాంకేతిక పురోగతి ఫలితాలు రాష్ట్రంలో ప్రతి పౌరుడికి అందేలా కృషి చేస్తున్నాం' అని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు..

రాజకీయ అక్కసుతోనే ...అన్యాయం

రాజకీయ అక్కసుతోనే తెలంగాణకు కేంద్రం అన్యాయం చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. సెమీకండక్టర్ ప్రాజెక్టు కేటాయింపులో వివక్ష చూపించి, రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమను చూపిస్తుందంటూ బుధవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. 'ప్రపంచ స్థాయి అధునాతన సిస్టమ్ అండ్ ప్యాకేజింగ్ ఫెసిలిటీ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. మహేశ్వరంలో 10 ఎకరాల భూమి కేటాయించాం. రికార్డు సమయంలో అన్ని అనుమతులిచ్చాం. ఇండియా సెమీకండక్టర్ మిషన్ తుది ఆమోదం లభిస్తే పనులు మొదలు పెట్టేందుకు ఆ ఇన్వెస్టర్ సిద్ధంగా ఉన్నారు. అయినా... కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు' అని విమర్శించారు.

కనీస సంసిద్ధత లేని ఏపీకెలా కేటాయిస్తారు?

అన్ని అర్హతలున్నా తెలంగాణను విస్మరించి కనీస సంసిద్ధత లేని ఏపీకి ప్రాజెక్టును ఎలా కేటాయిస్తారని మంత్రి శ్రీధర్ బాబు కేంద్రాన్ని ప్రశ్నించారు. 'తర్కానికి అందని, న్యాయ విరుద్ధమైన ఈ నిర్ణయం పెట్టుబడిదారులకు తప్పుడు సంకేతాలను పంపే ప్రమాదముంది. ఇలాంటి రాజకీయ ప్రేరేపిత నిర్ణయాలు దేశ పారిశ్రామికాభివృద్ధికి మంచిది కాదు. అందుకే ఈ నిర్ణయాన్ని మరోసారి పున:పరిశీలించాల్సిన అవసరముంది. వాస్తవ పరిస్థితులను పరిగణలోనికి తీసుకుని తెలంగాణకు మేలు చేసేలా కేంద్రం నిర్ణయం తీసుకోవాలి' డిమాండ్ చేశారు. 'కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి జోక్యం చేసుకుని తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలి. న్యాయం జరిగేలా చొరవ చూపాలి. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన తెలంగాణ బీజేపీ ఎంపీలు చోద్యం చూస్తున్నారు. ఇప్పటికీ స్పందించకపోతే తెలంగాణ ప్రజలు రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతారు' అని హెచ్చరించారు.

బీజేపీ, కాంగ్రెస్‌కు చెంపపెట్టు

(మొదటిపేజీ తరువాయి)

వ్యవస్థను అడ్డం పెట్టుకుని కేసీఆర్ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టిందని ఆరోపించారు. తమ ప్రభుత్వ ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉండగానే మరో ఇద్దరి పేర్లు సిఫార్సు చేసి బీసీ వ్యతిరేక వైఖరిని సీఎం రేవంత్ రెడ్డి చాటుకున్నాడని విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్ చర్యలు రాజ్యాంగ విరుద్ధమని సుప్రీం కోర్టు తీర్పుతో స్పష్టమైందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి మరోసారి బయట పడిందని వ్యాఖ్యానించారు. అధికారం కోసం ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ వ్యవస్థలను తుంగలో తొక్కిన ఈ పార్టీల అప్రజాస్వామిక విధానాలు సాగనివ్వమని తన తీర్పుతో సుప్రీంకోర్టు చాటిచెప్పిందన్నారు. రాజ్యాంగ వ్యవస్థల పరిరక్షణకు, ప్రజాస్వామ్య విలువల కోసం పోరాడిన బీఆర్ఎస్ పక్షాన గౌరవ న్యాయ వ్యవస్థకు శిరస్సు వంచి సలాం చేస్తున్నానని కేటీఆర్ వెల్లడించారు.

వరద బాధితులకు బీఆర్ఎస్ అండ

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు అనేక లోతట్టు ప్రాంతాలు జలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ విపత్కర పరిస్థితుల్లో బీఆర్ఎస్ శ్రేణులు బాధితులకు అండగా నిలవాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఇప్పటికే అన్ని రంగాల్లో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకున్నా లేకపోయినా, ప్రతిపక్షంగా మన బాధ్యత ఎక్కువని గుర్తుచేస్తూ, వెంటనే వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లి తాగునీరు, పాలు, ఆహారం, మందులు, బట్టలు వంటి సహాయాన్ని అందించాలన్నారు. అవసరమైనచోట మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ప్రభుత్వ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని కోరారు. రాబోయే మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో ఇప్పటికే వరద వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు ... ప్రభుత్వ వైఫల్యం వలన ఇబ్బందులు పడుతుండడం పైన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఈ జిల్లాలకు సహాయక చర్యల్లో మరింత చొరవ చూపాలన్నారు. ఆ మూడు జిల్లాల పార్టీ నేతలతో కేటీఆర్ మాట్లాడారు. కష్టకాలంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ప్రజలకు అండగా ఉంటారని, ధైర్యంగా ఉండాలని కేటీఆర్ అన్నారు.

నా ప్రాణానికి ముప్పే

(మొదటిపేజీ తరువాయి)

చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాది బంధువుల నుంచి తనకు ముప్పు ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందుకు హింస, రాజ్యాంగ విరుద్ధ ధోరణుల చరిత్రను గుర్తుచేస్తూ.... రాహుల్ గాంధీకి హాని తలపెట్టవచ్చు, వేర్వేరు విధాలుగా లక్ష్యం చేసుకోవచ్చు... నిందించవచ్చు, ఇరికించవచ్చు అంటూ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మహాత్మాగాంధీ హత్య క్షణికావేశంలో జరిగింది కాదని... పథకం ప్రకారం జరిగిందని, ఓ సిద్ధాంతం మూలాలు అందుకు కారణమని పేర్కొన్నారు. గతంలో జరిగిన ఘటనల దృష్ట్యా తాజా పరిణామాల క్రమంలో తనకు ఆపాయం ఉందని గ్రహించి తగు రక్షణ కల్పించాలని న్యాయస్థానానికి రాహుల్ విన్నవించారు. ఇటీవల 'ఓట్ చోర్ సర్కార్' అంటూ పార్లమెంటులో నినాదం ఇవ్వడం, ఎన్నికల అక్రమాలపై పత్రాలు సమర్పించడం వంటి పరిణామాలతో రాజకీయ ప్రత్యర్థులు కోపంగా ఉన్నారని అభ్యర్థనలో పేర్కొన్నారు. 'నిజమైన హిందూ హింసకు పాల్పడడు. ఓ హిందూ ద్వేషాన్ని రెచ్చగొట్టడు. ద్వేషాన్ని, హింసను వ్యాప్తి చేసేది బీజేపీ. వీరు హిందువులకు ప్రతినిధులు కాబోరు' అంటూ పార్లమెంటులో చేసిన ప్రసంగాన్ని ప్రస్తావించింది. హిందువులను అవమానించారంటూ కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్, బీజేపీ శుధాంసు త్రివేది తనపై ఆరోపణలు చేశారని, కేంద్ర మంత్రి రవనీత్ సింగ్ బిట్టు బహిరంగంగానే బెదిరించారని, దేశంలోనే నంబర్ వన్ ఉగ్రవాదిగా ఆరోపించారని, బీజేపీ నేత తర్వీందర్ సింగ్ మార్వా నుంచి బెదిరింపులు వచ్చాయని తన అభ్యర్థనలో రాహుల్ పేర్కొన్నారు. ఈ కేసు తదుపరి విచారణ సెప్టెంబరు 10వ తేదీన జరగనుంది.

భారీ వర్షాలు కురుస్తున్నందున అధికారులు అందుబాటులో ఉండాలి:కలెక్టర్

విశాలాంధ్ర - సూర్యాపేట : భారీ వర్షాల కురుస్తునందున అధికారులు అందుబాటులో ఉంది ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం పాలకవీడు మండలంలో వరద ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ పర్యటించారు. రాఘవాపురం మీగడం పాడు తండా మధ్యలో ఉన్న వేమూలూరు వాగు బ్రిడ్జి, నర్లెం గూడెం, గుండెబోయినగూడెం మధ్య చెరువు అలుగును, జానపాడు -కల్మెట్ తండా మధ్యలో ఉన్న బ్రిడ్జిలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డుపై ఎక్కువ నీరు ప్రవహిస్తునందున వాహనదారులను బ్రిడ్జిపైకి వెళ్లకుండా పోలీస్, గ్రామ పంచాయతీ సిబ్బంది చూడాలని, మత్స్యకారులు చెపల వేటకి వెళ్లకుండా చూడాలని ఆదేశించారు. ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ కమలాకర్, ఎంపిడిఓ లక్ష్మి, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

విశాలాంధ్ర బ్యూరో-మెదక్: డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని అదనపు కలెక్టర్ మెంచు నగేష్ పిలుపునిచ్చారు. మెదక్ జిల్లాను మాదకద్రవ్యాలు రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవం పురస్కరించుకొని జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మాదకద్రవ్యాల నిర్మూలనకు శక్తివంచన లేకుండా పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాధా కిషన్, అధికారులు విజయలక్ష్మి, జగదీష్, జమల నాయక్, సిడిపిఓ హేమ భార్గవి, అధికారులు తదితరులు పాల్గొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో బాగంగా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలోఅదనపు ఎస్పీ ఎస్. మహేందర్, ఏఆర్ డియస్పి రంగా నాయక్, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ మధు సుధన్ గౌడ్, ఎస్బి ఇన్స్పెక్టర్ ఎస్. సందీప్ రెడ్డి, ఆర్ఐలు శ్రీ.రామకృష్ణ, శైలెందర్, ఏఓ మణి, సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నాగర్‌కర్నూల్ : నాగర్‌కర్నూల్ జిల్లాలో గత వారం పది రోజులుగా విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాలు, పొంగి పొర్లుతున్న వాగులు వంపులు, నిలిచిపోయిన రహదారి మార్గాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలిని, రాబోయే 72 గంటల పాటు అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండి సమన్వయంతో పనిచేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఒక ప్రకటన ద్వారా తెలియ జేశారు. అత్యవసర సేవలో పాల్గొనే శాఖల అధికారులకు సెలవులను రద్దు చేస్తున్నట్లు ఆయన ఈ ప్రకటన ద్వారా తెలిపారు. ముఖ్యంగా విద్యుత్ శాఖ, అగ్నిమాపక శాఖల అధికారులు ఎక్కడికక్కడ అప్రమత్తంగా ఉండా లని, వాతావరణ శాఖ సూచన మేరకు రాబోవు మూడు రోజుల పాటు భారీ వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లాలో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే 08540-230201, 08540-230203, కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందిం చాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 20 మండలాలు, 4 మున్సిపాలిటీల్లో ప్రజలకు 24 గంటలు రెవిన్యూ, పోలీస్, మున్సిపల్, గ్రామ పంచాయతీ, నీటిపారుదల శాఖల అధికారులు 24 గంటలు అందుబాటులో ఉంటారని, జిల్లాలో అత్యవసర విభాగాల్లో పనిచేసే ఉద్యోగులకు సెలవులు రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు.

ఆశయం కోసం పనిచేసిన వారు ప్రజల గుండెల్లో నిలుస్తారు

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్: సిద్ధాంతం నిబద్ధతతో, ఆశయం కోసం పనిచేసిన లియకత్ లాంటి వారు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. జిల్లాలోని కురవి మండల కేంద్రం పార్టీ కార్యాలయంలో అమరజీవి లియకత్ అలీ 21వ వర్ధంతి సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి, టిడబ్లుజెయూ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్‌లు అలీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల కోసం పనిచేసి, తుది శ్వాస విడిచే వరకు తను నమ్మిన పార్టీ కోసం ఎన్ని ఇబ్బందులున్నా పనిచేసిన గొప్ప నాయకుడు లియకత్ అలీ అని కొనియాడారు. పార్టీలు మారే నాయకులకు బుద్ధి చెప్పి, నిరంతరం ప్రజల సమస్యల కోసం పనిచేసే కమ్యూనిస్టులను ప్రజలు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, బుడమ వెంకన్న, కన్నే వెంకన్న, దూది కట్ల సారయ్య, కొణతం మహేశ్, కలగూర నాగరాజు, బొల్లం ఉప్పలయ్య, బండారి రమేష్ కన్నె గురుమూర్తి పాల్గొన్నారు.

పారదర్శకత కోసమే సమాచార హక్కు చట్టం

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : పాలనలో పారదర్శకత కోసమే సమాచార హక్కు చట్టాన్ని తెచ్చారని, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సిటిజన్ చార్టను తప్పనిసరిగా ప్రదర్శిం చాలని రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ డా.చంద్రశేఖర్ రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టంపై రాష్ట్ర సమాచార కమిషనర్ ఆధ్వర్యంలో పీఐవో అధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో సమాచార కమిషనర్లు పర్వీన్, భూపాల్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం పౌరులకు పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన అందించడంలో కీలకమైన సాధనమని తెలిపారు. ఆర్టీఐ దరఖాస్తులు, ఫిర్యాదులు తక్కువ అందిన జిల్లాల్లో నిర్మల్ ఓకటన్నారు. పీఐవో అధికారులు ప్రజలకు సమయానికి, పూర్తి సమాచారాన్ని అందించాలి అని సూచించారు. ఆర్టీఐ దరఖాస్తుల పరిష్కారం ఆలస్యం కాకుండా, చట్టంలో ఉన్న సమయపరిమితి లోపల సమాధానమివ్వాలని ఆదేశించారు. సమాచారాన్ని దాచిపెట్టడం, తప్పుడు సమాచారం ఇవ్వడం వంటి చర్యలు చట్టవిరుద్ధమని హెచ్చరించారు. ప్రభుత్వ శాఖలు పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్క అధికారి అవగాహన పెంచుకోవాలన్నారు.

యువత డ్రగ్స్‌కు బానిస కావద్దు : మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హుస్నాబాద్ : యువత, విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసై జీవిత కళలను నాశనం చేసుకోవద్దని తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో యాంటీ డ్రగ్స్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్నేహితుల కోరిక మేరకు, క్షణకాలం సంతోషం కోసం డ్రగ్స్ తీసుకుంటే జీవితం అంధకారంలోకి వెళుతుందన్నారు. ప్రపంచ దేశాలతో మన దేశం పోటీ పడాలంటే పాశ్చాత్య దేశాలకు పట్టిపీడిస్తున్న ప్రమాదకర మాదకద్రవ్యాలను మన ప్రాంతానికి రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత నేటి యువత, విద్యార్థులు, మేధావులపై ఉందన్నారు. మన ప్రాంతంలో ఎవరైనా డ్రగ్స్, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు సేవిస్తున్నట్లు లేదా విక్రయిస్తున్నట్లు కనిపిస్తే 1908కు సమాచారం అందించాలని విద్యార్థులకు, యువతకు సూచించారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సిద్ధిపేట పోలీస్ కమిషనర్ అనురాధ, సిద్ధిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తి, ఏసీపీ సదానందం, సీఐ శ్రీనివాస్, ఎస్సైలు లక్ష్మారెడ్డి, అభిలాష్, ప్రశాంత్, ఎంఈఓ బండారి మనీల, ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలి

విశాలాంధ్ర - కొమరం భీం : మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నషా ముక్త భారత్ అభియాన్ 5 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటం కేవలం ఒక వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాక, సామాజిక కర్తవ్యంగా గుర్తిస్తూ, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దొత్రే అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి

విశాలాంధ్ర - వనపర్తి : బుధవారం అదనపు కలెక్టర్ రెవెన్యూ రేవల్లి మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, వివిధ ప్రభుత్వ పథకాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా భూభారతి రెవెన్యూ సదస్సులపై దృష్టి సారించి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అధికారులు ఆ దిశగా చిత్తశుద్ధితో పనిచేయాలని రెవెన్యూ సిబ్బందిని సూచించారు. ముఖ్యంగా భూభారతి సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం రికార్డు రూమ్‌ను పరిశీలించి, అన్ని రికార్డులను సక్రమంగా, భద్రంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా సివిల్ సప్లై అధికారి కాశి విశ్వనాథం, రైస్ మిల్లుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుదాం

విశాలాంధ్ర - పెద్దపల్లి, సింగరేణి : రామగుండం సి.పి. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుదాం అని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. బుధవారం నాషా ముక్త్ భారత్ అభియాన్-2025 లో భాగంగా మాదకద్రవ్యాల దుర్విని యోగానికి వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమం పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ ఆయన అధికారులు, సిబ్బందితో కలిసి మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ చేయిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గంజాయి నిర్మూలన, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా తీసుకుంటున్న చర్యలలో భాగంగా నాషా ముక్త్ భారత్ అభియాన్ ను అమలు చేస్తోందన్నారు. రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలో మాదకద్రవ్య దుర్వినియోగానికి వ్యతిరేకంగా పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువత, మహిళలు, ఉద్యోగులు ప్రజల నుండి విస్తృత భాగస్వామ్యాన్ని కోరుతూ సామూహిక ప్రతిజ్ఞను నిర్వహించడం జరుగుతుంది అన్నారు. స్పెషల్ బ్రాంచ్ ఏసిపి మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్ ఏవో శ్రీనివాస్, యాంటీ నార్కోటిక్ ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్, సిసిఆర్ బీ ఇన్స్పెక్టర్ సతీష్, పిసిఆర్ ఇన్స్పెక్టర్ రవీందర్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ బాబురావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్లు భీమేష్, శ్రీనివాస్, ఆర్ఐలు శ్రీనివాస్ వామనమూర్తి పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర- మరిపెడ: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా (ఇన్చార్జి) కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బుధవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద చెరువు మండలంలోని పురుషోత్తమాయగూడెం వంతెనను పరిశీలించారు. గత సంవత్సరం పురుషోత్తమాయగూడెం వద్ద జరిగిన వరదలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మున్సిపాలిటీ కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే వసతి గృహాన్ని సందర్శించారు. తహసిల్దార్ కృష్ణవేణి, మున్సిపల్ కమిషనర్ విజయానంద్, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, ఎంపీఓ ధరావత్ సొమ్లాల్, ఆర్ఐ శరత్ చంద్ర, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, ఐబి నరేందర్, పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అశ్రునయనాల మధ్య వీర జవాన్ అనిల్ అంత్యక్రియలు

విశాలాంధ్ర - కారేపల్లి : జమ్మూ కాశ్మీర్ లోయలో ప్రమాదవశాత్తు సోమవారం ఉదయం వాహనం పడిపోయి మృతి చెందిన ఖమ్మం జిల్లా కారేపల్లి మండల పరిధిలోని సూర్యతండాకు చెందిన జవాన్ భానోత్ అనిల్(30) బుధవారం భారత సైనిక దళం అధికారలాంచనాలతో అశ్రునయనాలతో అంతఃక్రియలు పూర్తి చేశారు. వీర జవాన్ పార్థివ దేహం వాహనం కారేపల్లి క్రాస్ రోడ్డుకు చేరుకోగానే జిల్లా మండలానికి చెందిన ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని జవాన్ అనిల్‌కు 'జవాన్ అనిల్ అమర్ రహే' అంటూ భారీ ర్యాలీతో సూర్యతండకు తరలించారు. మృతుడు జవాన్ కి భార్య రేణుక,8నెలల బాబు ఉన్నారు. మృతి చెందిన వీర జవాన్ బానోతు అనిల్ పార్థివదేహంపై వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య వైరా మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ భానోతు చంద్రావతి, లావుడ్య రాములు నాయక్,మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్లాల్ సతీమణి మంజుల, బిఆర్ ఎస్ నేత లాకావత్ గిరిబాబు,బిజెపి జిల్లా అధ్యక్షులు కోటేశ్వరరావు తోపాటు పలువురు జిల్లా మండల నాయకులు ప్రజాప్రతినిధులు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. భారత సైనిక అధికారి మేజర్ ప్రణీత్ కుమార్ జవాన్లు పాల్గొన్నారు.

మల్లంపల్లి-ములుగు జాతీయ రహదారి మరమ్మత్తులు వెంటనే పూర్తి చేయాలి

విశాలాంధ్ర- ములుగు జిల్లా బ్యూరో : మల్లంపల్లి నుండి ములుగు జాతీయ రహదారి మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు.ఇటీవలి భారీ వర్షాల ప్రభావంతో జాతీయ రహదారి-163 పై మల్లంపల్లి, జాకారం మధ్య ఉన్న ఎస్ ఆర్ఎస్ పి కెనాల్‌పై పాత వంతెన దెబ్బతింది. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నేషనల్ హైవే అధికారులు తాత్కాలిక వంతెన నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించి రెండు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయిలో కృషి చేయాలని కొండమల్లేపల్లి ఎస్సై అజ్మీర రమేష్ తెలిపారు. బుధవారం స్థానిక శ్రీక్రాంతి జూనియర్ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు అనంతరం డ్రగ్స్ నిర్మూలనలో పాలుపంచుకుంటామని తమకు తెలిసిన సమాచారాన్ని సమీపంలో ఉన్న పోలీసులకు తెలుపుతామని చెబుతూ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. శ్రీకాంతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గుంటోజు ఆంజనేయులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ దుండిగళ్ల అశోక్, ఏవో ఎర్రమాద గోవర్ధన్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ బోనాలు

విశాలాంధ్ర - గూడూరు: వడ్డెరగూడెంలో బుధవారం ఘనంగా గ్రామస్తులు ముత్యాలమ్మకు బోనాలు సమర్పించారు. ముందుగా గ్రామస్తులు వేటపోతులు, కోళ్లను బలిచ్చి నైవేద్యాన్ని సమర్పించారు. అమ్మవారికి పట్టు వస్త్రాలతో నైవేద్యాన్ని అందించారు. గ్రామస్తులు, పెద్దలు, యూత్ యువకులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. డప్పులతో ఆ గ్రామమంతా ఆటపాటల కేరింతలతో సందడి చేశారు. శివసత్తుల పూనకాలు, చిన్నారుల ఆటపాటలతో పాల్గొని బోనాలతో ఊరేగింపుగా బయలుదేరి బోనం చెల్లించుకున్నారు. కార్యక్రమంలో శివరాత్రి శ్రీనివాస్, సంపంగి రామచంద్రు, సంపంగి రాములు, సూర మల్లయ్య, సూర శీను, సూర గంగయ్య, వల్లెపు నాగరాజు, సూర రాజులు పాల్గొన్నారు.

బిసి రిజర్వేషన్లను అడ్డుకుంటున్న బిజెపి

విశాలాంధ్ర - ఖమ్మం : రిజర్వేషన్ల సమస్యకు బిజెపి మతం రంగు ఎందుకు పులుముతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ప్రశ్నించారు. రిజర్వేషన్లను అడ్డుకునేం దుకు బిజెపి ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. జనాభా ప్రాతిపదికన బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో దానిని అడ్డుకునేందుకు బిజెపి ప్రయత్నిస్తుందని దానికి మతం రంగు పూస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తుందన్నారు. ముస్లిం రిజర్వేషన్ ఇప్పుడే కల్పించారా అని సురేష్ ప్రశ్నించారు. మతం మాటున లబ్ధి పొందుతున్న బిజెపి మత రాజకీయాలను, మతోన్మాదాన్ని ప్రోత్సహి స్తుందని ఆరోపించారు. కమ్యూనిస్టులను విమర్శించే అర్హత బిజెపి పార్టీకి లేదని కమ్యూనిస్టులవి త్యాగాలైతే బిజెపివి భోగాలని సురేష్ తెలిపారు. తెలంగాణ ప్రజల ముందు బిజెపి ద్రోహిగా నిలబడక తప్పదని సురేష్ హెచ్చరించారు. బిసి రిజర్వేషన్ల కోసం జరుగుతున్న ప్రయత్నంలో బిజెపి కలిసి రావాలని కేంద్రంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అడ్డుకునే ప్రయత్నం చేస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. అధికార యంత్రాంగం సైతం ప్రజలను అప్రమత్తం చేయాలని లోతట్టు ప్రాంతాల ప్రజలకు అన్ని రకాలుగా అందుబాటులో ఉండాలని ఆయన కోరారు.

పాత పెన్షన్ హామీ విస్మరిస్తే పోరాటమే

విశాలాంధ్ర బ్యూరో -పెద్దపల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు పోరాటం ఆపేది లేదంటూ పిఆర్‌టీయూటీఎస్ పెద్దపల్లి జిల్లా శాఖ అధ్యక్షులు గండు కృష్ణమూర్తి అన్నారు. 35, 40 సంవత్సరాలు సేవచేసి పదవి విరమణ పొందిన సీపీఎస్ ఉద్యోగి ఆసరా పెన్షన్ కంటే తక్కువ పెన్షన్ పొందబోతు న్నాడని, కాంట్రిబ్యూటరీ పెన్షన్‌ను రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టి అధికారంలోకి రాగానే తాత్సారం చేస్తూ ఉద్యోగుల ఆత్మాభిమానం దెబ్బతీస్తే సహించేది లేదని అయన అన్నారు. పీఆర్‌టియుటి ఎస్ రాష్ట్ర శాఖ రూపొందించిన సిపిఎస్ వ్యతిరేక మహాధర్నా పోస్టర్ బుధవారం జిల్లా కేంద్రంలోని పాత మండల రిసోర్స్ సెంటర్ ఆవరణలో జిల్లా ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్‌తో కలిసి ఆవిష్కరించారు. సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహదినం సందర్భంగా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఇందిరపార్క్ వద్ద మహాధర్నాకు పెద్దపల్లి జిల్లా నుండి పెద్దసంఖ్యలో సిపిఎస్ ఉద్యోగులు తరలిరావాలని కోరారు. వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మెతుకు తిరుపతి,రాములు, శ్రీరాముల రాజయ్య పాల్గొన్నారు.

జ్యువెలరీ షాపుల్లో సీసీ కెమెరాలు, భద్రత ఏర్పాట్లు చేసుకోవాలి : ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : జిల్లాలోని బంగారు షాపులు నిర్వహిస్తున్న వ్యాపారులు తమ పరిసరాల్లో సీసీ కెమెరాలతో పాటు పటిష్ఠంగా భద్రత ఏర్పాట్లు చేసుకోవాలని ఎస్పి రోహిత్ రాజు సూచించారు. బుధవారం జిల్లాలోని జ్యువెలరీ షాప్ యజమానులతో పట్టణంలోని ఐఎంఏ హాల్లో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. దొంగతనాలకు పాల్పడిన నిందితుల వద్ద నుండి ఆభరణాలను కొనుగోలు చేయకూడదని ఎస్పీ సూచించారు. వ్యాపారాలు దొంగసొత్తును కొనుగోలు చేస్తే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇటీవల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సంఘటనలను దృష్టిలో పెట్టుకొని ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తమ దుకాణాల చుట్టుపక్కల ప్రాంతాల్లో నివసించే వారి కదలికలపై కూడా సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. దుకాణాల్లో ఎక్కువ మొత్తంలో బంగారు ఆభరణాలను తమ దుకాణాలలో ఉంచవలసి వచ్చినప్పుడు సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకొని రాత్రి వేళల్లో గస్తీని పెంచుకోవాలన్నారు. అనంతరం ఈ సమావేశంలో పాల్గొన్న దుకాణాల యజమానుల సమస్యలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డిఎస్పిలు చంద్ర భాను, రెహమాన్, రవీందర్ రెడ్డి, సతీష్ కుమార్, సీసీఎస్ సీఐ రమాకాంత్, సీఐలు వెంకటేశ్వర్లు, ప్రతాప్, కరుణాకర్, శివ ప్రసాద్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - చర్ల : వందేళ్ల సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన సిపిఐ పార్టీ 4వ మహాసభ లను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు భద్రాచలం నియోజకవర్గ కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో బుధవారం నుప పోతయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 4వ రాష్ట్ర మహాసభలు ఈనెల 19 నుండి 22 వరకు మేడ్చ ల్ మల్కాజ్గిరి జిల్లాలో జరగనున్నట్లు తెలిపారు. సమ సమాజ స్థాపన లక్ష్యంగా సిపిఐ పోరాటాల నిర్వహిస్తుదన్నారు. దున్నే వాడికి భూమి కావాలని ఆవిర్భవించిన పార్టీ సిపిఐ అన్నారు. దేశంలో సిపిఐ వందేళ్ళ ప్రస్థానంతో ముందుకు సాగుతుందని కార్మికులు, కర్షకులు అణగారిన వర్గాల ప్రజలతో మరింత మమేకం అవ్వడానికి ఈ మహాసభలు దోహద పడతాయన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతో స్నేహ ధర్మాన్ని పాటిస్తూనే ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తుందన్నట్లు వెల్లడించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ, మండల నాయకులు చల్లా లక్ష్మీనారాయణ, కోటి ముత్యాలరావు, ఉప్పులూరి నాగరాజు, కోడి రెక్కల రాజారావు, ఆంద్రు వామన రావు, తోట శ్రీనివాసరావు, పాలంచ రామారావు, పాలెం సత్యనారాయణ, నుప తిరుపతిరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా నిబంధనలు భేఖాతర్..!

విశాలాంధ్ర - ఇల్లందు : పట్టణంలోని కొన్ని ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా మోనోపల్లి విధానాలు అవలంబిస్తున్నారు. ఇల్లందు పట్టణంలోని మాంటిస్సోరి ప్రైమ్ స్కూల్ అధిక ఫీజుల దోపిడీ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్న అధికారులు పట్టించుకోవటం లేదని విమర్శలు ఉన్నాయి. మూడు దశాబ్దాల నుంచి నడుస్తున్న ఈ పాఠశాలకు అనుబంధంగా గతేడాది నుంచి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఈ) పేర ప్రత్యేకంగా పాఠశాలను నిర్వహిస్తున్నారు. ఇందులో ఏడవ తరగతి వరకు విద్యాబోధనలు చేస్తున్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ బిల్లులు మాత్రం ఇవ్వడం లేదని విమర్శలు ఉన్నాయి. కాగా ఆటల దుస్తుల పేర అదనపు దోపిడీకి యాజమాన్యం ఈ ఏడాది నుంచి తెరలేరు. విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ పేర రూ. 900 నుంచి 1000 రూపాయలు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. అందులోనూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలోనే దుకాణం లా పెట్టి అమ్మటం విచిత్రంగా ఉంది. బుధవారం ఈ పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న ఒక విద్యార్థిని తండ్రి ఈ విషయమై ప్రశ్నించగా ప్రిన్సిపాల్ తో పాటు ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. రూ. 1000 కి తగ్గేది లేదని ప్రిన్సిపల్ ఖరాఖండి గా చెప్పి వసూల్ చేసారు. డబ్బులు కట్టాక బిల్లు ఇవ్వమంటే యాజమాన్యం ఇవ్వలేదు. దీంతో తండ్రి జిల్లా విద్యాశాఖ అధికారి తోపాటు మండల విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో బుక్స్, నోట్స్, మెటీరియల్, డ్రెస్, షూ, డైరీ, టై, బెల్ట్ లు అమ్మకూడదని అధికారులు స్పష్టం చేసారు. ఈ క్రమంలో జిల్లా అధికారి సూచనల మేరకు మండల విద్యా శాఖ అధికారి ఆ పాఠశాలకు వెళ్లి విచారణ చేసారు. తాము ఎలాంటి డ్రెస్సులు నమ్మడం లేదని అబద్దాలు చెప్పినట్లు తెలుస్తుంది. విచారణ సమయంలో విద్యార్థి తండ్రి అందుబాటులో లేకపోవడంతో రేపు మళ్ళీ దీనిపై సమగ్రంగా విచారించనున్నారు. కాగా విద్యార్థులకు ఇచ్చిన స్పోర్ట్స్ డ్రెస్ ను మరల పాఠశాల యాజమాన్యం హుటా హుటిన వెనక్కి తీసుకున్నట్లు పక్కా సమాచారం అందింది. ఈ విషయంలో విద్యా శాఖ అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేసి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

దేశ ప్రజలకు శాపంగా ప్రధాని మోడీ తప్పిదాలు

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : తమ గుజరాతి పెట్టుబడిదారులను ప్రపంచవ్యాప్తంగా విస్తరించడానికి ప్రధాని మోడీ చేసిన ప్రయత్నాలు దేశ ప్రజలకు లేడు శాపంగా మారాయని వామపక్ష ప్రతిపక్ష నాయకులు తీవ్రంగా విమర్శించారు. మోడీ బలహీనతను కనిపెట్టిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధిస్తున్న కక్ష సాధింపు సుంకాల వల్ల దేశం ఆర్థికంగా నష్టపోతున్నట్టు విమర్శించారు. ట్రంప్ సుంకాలపై మోడీ పెదవి విప్పాలిని సీపీఐ, కాంగ్రెస్ సీపీఎం, సీపీఐ ఎం ఎల్, టి యు సి ఐ నాయకులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు, కొత్వాల్ శ్రీనివాసరావు, దొడ్డ రవి కుమార్, కల్లూరి కిషోర్, గొని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. జాతీయ పిలుపు లో భాగంగా డోనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను బుధవారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో దగ్ధం చేశారు. నాయకులు మాట్లాడుతూ భారతదేశంపై 25 శాతం సుంకాలు విధించడమే కాక దేశానికి తక్కువ ధరకు అందుతున్న రష్యా చమురు వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని ట్రంప్ ఆర్థిక శిక్షలు వేస్తున్న తన వ్యాపారులను కాపాడుకునేందుకు మోడీ నోరు మెదపడం లేదని విమర్శించారు. సిపిఐ నాయకులు నాయకులు ఉప్పుశెట్టి రాహుల్ అధ్యక్ష తన జరిగిన కార్యక్రమంలో నాయకులు అడుసుమిల్లి సాయిబాబా, పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, శనగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, చెరుకూరి శేఖర్ బాబు, కొంగర అప్పారావు, కొండ వెంకన్న, ఆచార్యులు, బద్ది కిషోర్, దుర్గా మహేష్, తులసిరామ్, కతోజు సత్య, నిరంజన్, కాంతి, మాధవి, మల్లికార్జున రావు, నరసింహారావు, ఎర్రం శ్రీను, సురేష్, రాజేష్, గోనెల రమేష్, రాయబారపు వెంకటేశ్వర్లు, వేల్పుల రమేష్, పాల్గొన్నారు.

తిరుగులేని ఫైర్ బ్రాండ్ ఎంపీ రేణుక చౌదరి

విశాలాంధ్ర - మణుగూరు : దేశ రాజకీయాల్లోనే మహిళ నాయకురాలు తిరుగులేని ఫైర్ బ్రాండ్‌గా మాజీ కేంద్రమంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గురిజాల గోపి అన్నారు. రేణుక చౌదరి 71వ జన్మదిన వేడుకలు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్లో గల క్యాంప్ కార్యాలయంలో బుధవారం అక్షర మహిళా మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గోపి ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయాల్లోకి అరంగేట్రం చేసి దేశ రాజకీయాల్లో తిరుగులేని నాయకురాలిగా ఎదిగారని కొనియాడారు. నిరుపేద మహిళలకు చీరలు అందించి, 300 మందికిపైగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ మైనారిటీ నాయకులు ఎండి షరీఫ్, నూరుద్దీన్, అక్షర మహిళ మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ, షబానా పాల్గొన్నారు.

సంపాదకీయం

75 ఏళ్లకు తప్పుకోవడం ఉత్తిదే

అధికారంలో ఉన్నవారు 75 ఏళ్లకు చేరితే పదవుల్లోంచి తప్పుకోవాలని సంఘ్ పరివార్ ఓ సూత్రీకరణ చేసింది. ప్రధానమంత్రి మోదీ వచ్చే సెప్టెంబర్ 17న 75 ఏళ్ల వారవుతారు. అందువల్ల ఆయన తప్పుకోవాలని ఆర్.ఎస్.ఎస్. అధినేత అనేకసార్లు అన్యాపదేశంగా ఈ అంశం గుర్తుచేశారు. కానీ అదే సూత్రం ఆర్.ఎస్.ఎస్. అధినేతకు కూడా వర్తించాలిగా. ఆ లెక్కన మోదీ కన్నా ఆరు రోజుల ముందు భగవత్ కు 75 నిండుతాయి. అంటే ముందు ఆయన సర్ సంఘ్ చాలక్ బాధ్యతల నుంచి తప్పుకోవాలి. ఆయనకు అలాంటి ఆలోచన లేదని తేలిపోయింది. సూత్రీకరణ చేసిన వారే దాన్ని పాటించకపోతే ప్రధాని మోదీ దాన్ని లెక్కచేయనక్కర్లేదు. భగవత్ సర్ సంఘ్ చాలక్ పదవి నుంచి తప్పుకోవడం లేదు కనక మోదీ దిగిపోవాలని అడిగే హక్కు ఆయనకు ఎటూ ఉండదు. మోదీని ఆర్.ఎస్.ఎస్. ఇక ఒత్తిడి చేయడం కుదరదు. ఆర్.ఎస్.ఎస్.కు, మోదీ మధ్య సంబంధాలు సవ్యంగా లేవని ఇటీవల ఎక్కువగా వినిపిస్తోంది. బీజేపీ కి ఆర్.ఎస్.ఎస్. అనుబంధ సంస్థ కాదు. ఆర్.ఎస్.ఎస్. కు బీజేపీ ఓ ఉపాంగం. భగవత్ కనక సెప్టెంబర్ 11నాటికి దిగిపోవాలనుకుంటే మోదీని అదే సూత్రం పాటించాలని ఒత్తిడి చేయడానికి వీలుండేది. మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేసిన పనల్లా ఆర్.ఎస్.ఎస్. ఎజెండాను అమలు చేయడమే. కానీ ఆర్.ఎస్.ఎస్. అధినాయకత్వంతో మోదీకి అంత సయోధ్య లేదన్న ప్రచారం ఎక్కువగానే ఉంది. మోదీ ఆర్.ఎస్.ఎస్. మాట వినడం లేదన్న ప్రచారమూ ఉంది. మోదీకి ఇప్పటికీ ప్రభుత్వం మీద గట్టి పట్టు ఉంది. ఆయన నాయకత్వం మీద గుసగుసలాడే వారు ఉండొచ్చు కానీ నేరుగా ఎదుర్కునే వారు ఎవరూ ఆ పార్టీలో కనిపించడం లేదు. పైగా ఆయనకు ప్రజాదరణ కొనసాగుతోంది. ఆధిపత్యం చెలాయించే విషయంలో మోదీని దరిజేరగలిగే వారు ఎవరూ లేరు. ఆర్.ఎస్.ఎస్. దన్ను ఉంటే తప్ప అధికారంలో కొనసాగగలిగే స్థితిలో మోదీ ఏమీ లేరు. ప్రస్తుత దశలో మోదీకి ఆర్.ఎస్.ఎస్. అండకన్నా ఆర్.ఎస్.ఎస్.కు మోదీ అవసరమే ఎక్కువగా కనిపిస్తోంది. అందుకే 75 ఏళ్లకు చేరిన సూత్రాన్ని మోదీకి వర్తింప చేయకూడదన్న నిర్ణయానికి సంఘ్ పరివార్ వచ్చినట్టుంది. 75 ఏళ్లకు చేరుకున్నవారు పదవుల్లోంచి తప్పుకోవాలన్న సూత్రాన్ని సంఘ్ పరివార్ అధికారికంగా విరమించలేదు. రద్దు చేయలేదు. బిహార్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ అమలు చేయడం మోదీకి, సంఘ్ పరివార్ కు కూడా అత్యవసరం. ఆ ఓటర్ల జాబితా ప్రక్షాళనలో సంఘ్ పరివార్ ఎజెండా ఇమిడి ఉంది. వీలైనంత మంది ముస్లింలనే కాదు అణగారిన వర్గాల వారి పేర్లు కూడా తొలగించే పన్నాగం అమలు అవుతోంది. ఈ మహత్కార్యం సాధించడానికి ఎన్నికల కమిషన్ రామ భక్త హనుమాన్‌లా సిద్ధంగానే ఉంది. ప్రతిపక్షాలు ఎంత యాగీ చేసినా వినిపించుకునే ప్రజాస్వామ్య స్ఫూర్తి సంఘ్ పరివార్ కు గానీ మోదీకి గానీ ఎటూలేదు. బిహార్‌లో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా అన్న పథకమే ఆర్.ఎస్.ఎస్. తయారు చేసింది. ఆ పథకం తయారు చేసి దాదాపు ఆరేళ్లయింది. అది మోదీ మదిలో మెదిలిన ఆలోచనా కాదు. ఎన్నికల కమిషన్ సొంతంగా తలకెత్తుకున్న కార్యక్రమమూ కాదు. మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలలో ఆర్.ఎస్.ఎస్., బీజేపీ కార్యకర్తలు ఈ పథకాన్ని సవ్యంగా అమలు చేయనందువల్ల ప్రతిపక్షాలలో అనుమానాలు బయలుదేరాయి. మధ్య కర్నాటకలోని మహదేవ్‌పుర శాసనసభ నియోజక వర్గంలో ఓటర్ల దోపిడీ ఎలా జరిగిందో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అనుమాన రహితంగా నిరూపించారు. రాహుల్ లేవనెత్తిన ప్రశ్నలకు ఎన్నికల కమిషన్ సమాధానాలు చెప్పే స్థితిలో లేదు. అందువల్ల రాహుల్ మీడియా సమావేశంలో జరిగిన లోపాలను ఎత్తి చూపడం కాదు తన ఆరోపణలన్నింటినీ ప్రమాణపత్రంతో పాటు అందజేస్తే అప్పుడు దర్యాప్తు గురించి ఆలోచిస్తామని ఎన్నికల కమిషన్ చెప్తోంది. పైగా ప్రశ్నలు లేవనెత్తిన రాహుల్ గాంధీకే ఎన్నికల కమిషన్ నోటీసులు జారీ చేస్తోంది.

హర్యానా, ఢిల్లీ, మహారాష్ట్ర శాసనసభల ఎన్నికల ప్రచారంలో సంఘ్ పరివార్ కార్యకర్తలు చురుకుగా పాల్గొన్నారు. బీజేపీకి విజయం సాధించి పెట్టారు. ఈ పథకం చాపకింది నీరులా అమలవుతున్నప్పుడు ప్రతిపక్షాలకు కనీసం ఉప్పయినా అందలేదు. విజయాల పరంపర అంతా మోదీ ఘనత అనుకున్నారు. కాషాయ ఎజెండాను ఆయన అమలుచేస్తూ వస్తున్నారు. అది ఆర్.ఎస్.ఎస్.కు సమ్మతమే. కానీ మోదీ తమ మాట వినడంలేదన్న కోపం ఆర్.ఎస్.ఎస్. అధినాయకులకు ఉంది. అందుకే పాలకులకు అహంకారం ఉండకూడదు అని మోహన్ భగవత్ సూటిపోటి మాటలు వదిలి మోదీని కట్టడి చేయాలనుకున్నారు. అయితే మోదీ పట్టు సడలనందువల్ల ఆర్.ఎస్.ఎస్. వేచి చూసే విధానాన్ని అనుసరిస్తున్నట్టుంది. ఓటర్ల జాబితా తయారీలో ఉన్న లొసుగులను ప్రతిపక్షాలు సమర్థంగా ఎత్తి చూపుతుండడంతో బీజేపీ ప్రభుత్వం, కడకు సంఘ్ పరివార్ కూడా చిక్కుల్లో పడాల్సి వచ్చింది. ఈ దశలో 75 ఏళ్లు వస్తే పదవి నుంచి తప్పుకోవాలన్న సూత్రానికి కట్టుబడి ఉండాలని చెప్పే శక్తి ప్రస్తుతానికి సంఘ్ పరివార్‌కు లేదు. మరి భగవత్ కు మోదీ కన్నా ఆరు రోజుల ముందే 75 ఏళ్లు వస్తాయి కనక ఆయన సర్ సంఘ్ చాలక్ పదవినుంచి తప్పుకుంటారా అన్న ప్రశ్నలు సహజంగానే వచ్చాయి. భగవత్ తప్పుకో కూడదని నిర్ణయించుకున్నందువల్ల అదే సూత్రం మోదీకి వర్తిస్తుంది. ఆర్.ఎస్.ఎస్., బీజేపీ నాయకులకు 75 ఏళ్లు వస్తే పదవుల్లోంచి తప్పుకోవాలన్న నిబంధన ఆర్.ఎస్.ఎస్.లోనూ లేదు. బీజేపీలోనూ లేదు. మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత తలపండిన సీనియర్ల అడ్డు తొలగించడానికి 75 ఏళ్ల సూత్రాన్ని తనకు అనువుగా మలచుకున్నారు. అద్వాణీ, మురళి మనోహర్ జోషి, జస్వంత్ సింగ్ లాంటి వారిని మార్గదర్శక్ మండల్‌లో పడేశారు. మోదీ వారిని సలహా అడిగిందీ లేదు. వారు చెప్పిందీ లేదు. బి.ఎస్.ఎడ్యూరప్ప 2019లో 76వ ఏట ముఖ్యమంత్రి అయ్యారు. 78 ఏళ్లు వచ్చేదాకా ఆయన ముఖ్యమంత్రి పదవిలో ఉన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ బిహార్‌లో అమలు చేయగలిగితే దేశమంతటా అదే పని కొనసాగించి బీజేపీ ఓటర్ల పరిధి విస్తరించుకోవచ్చు. ఈ దశలో మోదీని దిగిపోవాలని ఒత్తిడి చేస్తే కాషాయ ఎజెండా అమలుకు ఆటంకం కలుగుతుంది. అప్పుడు ప్రతిపక్షాలు మరింత క్రియాశీలంగా మారొచ్చు. అందువల్ల గీసిన గీతను భగవత్ దాటితే మోదీకి ఆ గీత గురించి గుర్తు చేయాల్సిన అవసరమే ఉండదు. సంఘ్ పరివార్ కు ఈ దశలో కావాల్సింది అధికారం తప్ప నీతి సూత్రాలు కావు.

ఆదివాసీ ఉద్యమ మార్గదర్శి శిబుసోరెన్

అరుణ్ శ్రీవాస్తవ

భారతదేశంలోని ఆదివాసీలకు మొదటి దేవుడు బిర్సా ముండా తర్వాత రెండవ దేవుడు శిబు సోరెన్. అవిభాజ్య బీహార్ రాష్ట్రంలోని రామ్ గఢ్ జిల్లా నెమ్రా గ్రామంలో సంతాల్ గిరిజన తెగలో జన్మించని శిబు సోరెన్ ఆదివాసీయేతరుల నుంచి ఆదివాసీల విముక్తి కోసం సుదీర్ఘకాలం అలుపెరగని పోరాటం చేశారు. గిరజనోద్యమానికి గుర్తింపు తెచ్చిన నాయకుడు సోరెన్. తన పోరాటం ప్రారంభ సంవత్సరాల్లో, ఆదివాసీల విముక్తికోసం, రాజకీయ సంస్కరణల కోసం ఉద్యమించారు. స్వతంత్ర మార్క్సిస్ట్-లెనినిస్ట్ ఎకె రే, సామాజిక కార్యకర్త బినోద్ బెహారీ మహతోతో కలిసి జార్ఖండ్ విముక్తి మోర్చాను(జెఎమ్ఎమ్) స్థాపించాడు. జెఎమ్ఎమ్ ప్రధాన కార్యదర్శి అయ్యాడు, నిర్మల్ మహతో అధ్యక్షుడిగా జెఎమ్ఎమ్ బాధ్యతలు చేపట్టాడు. దక్షిణ బీహార్‌లోని వడ్డీ వ్యాపారులు, వర్తకుల దోపిడీ, అణచివేత విధానాలను తీవ్రంగా ప్రతిఘటించారు. వారితో ఆయన వ్యక్తిగత అనుభవం, వారి నిరంకుశత్వం, అణచివేత విధానాలకు వ్యతిరేకంగా ఆదివాసీల

పోరాటానికి నాయకత్వం వహించడానికి ఆయనకు ప్రేరేపణ అయింది. కళాశాల విద్యార్థిగా, దోపిడీ, అణచివేతలను వ్యతిరేకించే పాఠశాల ఉపాధ్యాయుడు అయిన తండ్రి సోబరన్ సోరెన్‌ను దారుణంగా హత్య చేయడాన్ని ఆయన ప్రత్యక్షంగా చూశారు. నవంబర్ 27, 1957 న గోలా బ్లాక్ సమీపంలోని లుకైయాతాండ్ అడవిలో ఆయన హత్యకు గురయ్యారు. ఈ సంఘటన శిబు సోరెన్‌ను వ్యవస్థీకృత రాజకీయ పోరాటానికి పురికొల్పింది. ఆయన ఏ కమ్యూనిస్టు పార్టీకి చెందినవారు కాకపోయినా, ఎ.కె. రేతో కలిసి మార్క్సిస్ట్-లెనినిస్ట్ భావజాలంతో ఆదివాసీల హక్కుల కోసం ఉద్యమించారు. ఆయన పోరాట పటిమ, స్వభావం, కార్యనిర్వహణ విధానంలో మార్క్సిజం-లెనినిజానికి సంబంధించిన ప్రాథమిక అంశాలు ఉన్నాయి. ప్రాథమిక పోరాటస్థాయిలో బీహార్ ప్రభుత్వం ఆయనపై అన్ని రకాల పోలీసు కేసులను నమోదు చేసినప్పటికీ, అధికారులు జార్ఖండ్‌లోని గిరిజన ప్రాంతంలో శిబుసోరెన్ చేపట్టిన ఉద్యమ వ్యాప్తిని అరికట్టలేకపోయారు.

ఉద్యమ ప్రారంభ దశలో ఆదివాసీలు శిబుసోరేన్ ఉద్యమంపై సందేహాన్ని వ్యక్తం చేశారు. కానీ అతి త్వరలోనే వారు సోరెన్ ఉద్యమ ప్రయోజనాన్ని, దీర్ఘకాలిక ప్రభావాన్ని గ్రహించగలిగారు. అన్యాక్రాంతమైన గిరిజన భూములను తిరిగి పొందేందుకు సోరేన్ పెద్ద ఎత్తున ఉద్యమించారు. ఆదివాసీల భూములలో బలవంతంగా పంట కోయడం ప్రారంభించారు. మార్క్సిస్ట్ గెరిల్లాల మాదిరిగానే, సోరేన్ భూస్వాములకు వ్యతిరేకంగా, ప్రత్యేక పరిస్థితుల్లో సందర్భాలలో సొంత కోర్టులను నిర్వహించి న్యాయ సూచనలు చేసేవారు. మొదటిసారిగా 1975 జనవరి 23 న సోరెన్ చేపట్టిన ఉద్యమం హింసాత్మకంగా మారింది. శిబుసోరేన్ 'గిరిజనేతర' ప్రజలను తరిమేందుకు ప్రచారాన్ని ప్రేరేపించాడని పోలీసులు ఆరోపిస్తూ చేపట్టిన హింసాత్మక ఘటనలో కనీసం పదకొండు మంది మరణించారు. జెఎమ్ఎమ్ ఏర్పడిన తర్వాత ఇది మొదటి పెద్ద హింసాత్మక చర్య. ఈ కేసు 1975 జనవరి 23న జమ్తారా జిల్లాలోని చిరుదిహ్ గ్రామంలో తొమ్మిది మంది ముస్లింలతో సహా 11 మంది ఊచకోతకు గురయ్యారు. డికుస్ (బయటి వ్యక్తులు) ను తరిమికొట్టడానికి సోరెన్ ప్రారంభించిన ఉద్యమం హింసాత్మకంగా మారింది. సోరెన్ బయటి వ్యక్తులను చంపడానికి ప్రజలను ప్రేరేపించాడని ఆరోపించి రాజకీయ రంగు పులమడంతో ఘటన హింసాత్మకమైంది. ఈ సంఘటనతో ఆ పార్టీ ప్రత్యేక గిరిజన రాష్ట్రం కోసం డిమాండ్ చేసింది. దశాబ్దాల ఆందోళన తర్వాత, జార్ఖండ్ నవంబర్ 15, 2000 న బీహార్ నుంచి విడిపోయి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది.

శిబు, ఎ.కె.రే, బినోద్ బెహారీ మహతోలతో కలిసి ఆదివాసీలు విచ్చలవిడిగా మద్యం వాడకానికి వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టారు. ఆదివాసీలు పేదలుగా, రుణగ్రస్తులుగా మారడంతో ఈ ప్రాంతంలో భూమిని మద్యం కోసం అమ్మడం వల్ల బాధితులుగా మారారు. ఈ సందర్భంలో శిబు ప్రజా న్యాయస్థానాన్ని నిర్వహించి, మద్యానికి అలవాటు పడిన ఆదివాసీలకు తగిన శిక్షలు విధించారు. దోపిడీదారులు, భూ కబ్జాదారుల నుంచి భూమిని తిరిగి ఆదివాసీలకు అందించేందుకు ఆయన సుదీర్ఘ పోరాటాన్ని చేపట్టారు. 18 సంవత్సరాల వయస్సులో శిబుసోరెన్‌లో సంతాల్ నవయువక్ సంఘ్ స్థాపించారు.ప్రధానంగా ఆయన యువతపై దృష్టి సారించారు. 1960 లలో సోరెన్ 'ధంకట్నీ ఆందోళన్'ను ప్రారంభించారు, ఆదివాసీలకు భూమి చెందినప్పటికీ, వారు పండించిన వరిలో మూడింట ఒక వంతు మాత్రమే ఆదివాసీలకు ఇచ్చే పద్ధతికి, కొంత ఆర్థిక సహాయం అందించారనే కారణంతో మిగిలిన మూడింట రెండు వంతులు వడ్డీ వ్యాపారస్థులకు ఇచ్చే పద్ధతిని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో సోరెన్ గిరిజన యువకులను సమీకరించి, దీర్ఘకాలిక పోరాటాన్ని ప్రారంభించాడు, ఇది ఆయన ఇంటి పేరుగా మార్చింది.

శిబు సోరెన్ పోరాట పటిమకుగాను ఆయనకు 'దిషోమ్ గురు' పది దిశల గురువు - అనే బిరుదును పొందారు. ఇది సంతల్ సమాజ గౌరవానికి చిహ్నం. సోరెన్‌కు ఆదివాసీలలో పెరుగుతున్న ప్రజాదరణ, అయనలోని పోరాటపటిమను మరింత తీవ్రతరం చేసింది. దక్షిణ బీహార్‌లో నక్సలైట్ ఉద్యమంతో అప్పటికే పోరాడుతూ అప్పటి బీహార్ ప్రభుత్వాన్ని గడగడలాడిస్తున్న ఉద్యమాన్ని నియంత్రించడానికిగాను ప్రజల అధికారి కె.బి. సక్సేనాను ధన్‌బాద్‌కు పంపింది. అయితే ఆయన రాక వార్త ఆదివాసీలకు ఆయన రావడానికి ముందే చేరింది. అటవీ ప్రాంతాలలో సోరెన్‌ను చూడటానికి వెళ్ళిన రోజున, వందలాది మంది గిరిజన యువకులు విల్లు, బాణాలతో చెట్లపై చేరి ఆయనపై గురి ఎక్కుపెట్టారు. తరువాత సోరెన్ సూచనల మేరకు, వారు సక్సేనాకు దారి ఇచ్చారు. ఇది సక్సేనా, శిబు సోరెన్‌లకు కూడా విజయవంతమైన మిషన్. అయితే ప్రభుత్వం మాత్రం ఆదివాసీలపై ఏదో ఒక రకమైన ఎన్‌కౌంటర్‌ను అమలు చేయాలని నిశ్చయించు కుంది. అయితే శిబు సోరెన్ ప్రధాన స్రవంతి రాజకీయాల్లోకి రావడానికి ఇది మార్గం సుగమం చేసింది. భూ కబ్జాదారులు, వడ్డీ వ్యాపారుల దుర్మార్గపు అవకతవకలను సక్సేనా ఎదుర్కోవలసి వచ్చింది. శిబుకు పునరావాసం కల్పించకుండా, చంపకుండా చూసుకోవడానికి వారు తమ అధికారాన్ని, వనరులను ఉపయోగించారు. సక్సేనాను మధ్యలో బదిలీ చేశారు. అయితే, ఆయన కొత్త పదవీ బాధ్యతలు చేపట్టిన డిసి లక్ష్మణ్ శుక్లాతో తన పని పూర్తయ్యేలా చూసుకున్నారు.

శిబు సోరెన్ జార్ఖండ్ ముఖ్యమంత్రిగా మూడుసార్లు పనిచేశారు. మార్చి 2005 లో కొంతకాలం, తరువాత ఆగస్టు 2008 నుంచి జనవరి 2009 వరకు, డిసెంబర్ 2009 నుంచి మే 2010 వరకు ముఖ్యముంత్రిగా ఉన్నారు. 2004 లో ఆయనను 1975 చిరుదిహ్ ఊచకోత కేసుకు సంబంధించిన కేసులో శిబుసోరెన్‌ను అరెస్టు చేశారు. అయితే బెయిల్ మంజూరు చేసినప్పటికీ ఆయన అరెస్టు శిబు జాతీయ రాజకీయ జీవితంపై నీలినీడలు కమ్మేసింది. చివరికి 1980 లో ఆయన కాంగ్రెస్‌తో స్నేహం చేశారు. గిరిజన హక్కుల కోసం పోరాటాలు, జార్ఖండ్ అనే కొత్త రాష్ట్ర ఏర్పాటుకు కారణమైంది. మరణంలో కూడా శిబు ఆదివాసీ గుర్తింపు, గౌరవం, స్వయం పాలనకు ప్రతిరూపంగా కొనసాగారు. 'దిషోమ్ గురువు' అయిన శిబు సోరెన్ కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాదు, భారతదేశం అంతటా ఆదివాసీలను మేల్కొలిపి, భూస్వామ్య అణచివేతకు వ్యతిరేకంగా పోరాడటానికి వారిని ప్రేరేపించిన విప్లవాత్మక స్ఫూర్తి. ఆయన సాధించిన గొప్ప విజయం ఏమిటంటే, విచ్ఛిన్నమైన ఆదివాసీలను ఏకంచేసి, ఉమ్మడి లక్ష్యం కోసం పోరాడటం సాంస్కృతిక గౌరవాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం ఆయన చేసిన కృషి అపారం.

ప్రహసనంగా రాష్ట్రాభివృద్ధి

చలసాని వెంకటరామారావు
సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు

రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ముందు చూపుతో కూడిన ఒక ప్రణాళిక అవసరం. మనం ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి ఉన్న రాష్ట్రం. మనకు గోదావరి, కృష్ణా, పెన్నా వంటి నదులు ఉన్నాయి. 900 కి.మీ విస్తీర్ణం ఉన్న సముద్ర తీర ప్రాంతముంది. విస్తారమైన అడవులు, ఖనిజ సంపద ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలో ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంది. 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో మనం ఆశించిన స్థాయిలో ప్రగతిని సాధించలేకపోయాం. 1950 దశకం చివరలో కమ్యూనిస్టు పార్టీ "విశాలాంధ్రలో ప్రజారాజ్యం" పేరుతో ఒక సమగ్ర అభివృద్ధి ప్రణాళికను సుందరయ్యగారు రచించగా ప్రచురించింది. 67 ఏళ్లు గడిచినా నిజమైన ప్రజారాజ్యం కలలు నేటికి సాకారం కాలేదు. 77 ఏళ్ల స్వతంత్ర భారతంలో అన్ని రంగాలలో పాలకుల వైఫల్యం కన్పిస్తున్నది. ఒకనాటి ప్రధాన సమస్యలు నేటికీ కొనసాగుతున్నాయి. అభివృద్ధి జరిగినా ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం జరగటంలేదు. పెరిగిన సంపద కొద్దిమంది చేతులలోనే కేంద్రీకృతమై ఉంది. ఒకనాటి జాతీయ స్ఫూర్తి, అంకిత భావం, నిస్వార్థ త్యాగం నేటి తరంలో మచ్చుకు కన్పించటం లేదు. గ్రామీణ పట్టణ ప్రాంతాలలో అక్షరాస్యత పెరిగినా ఉద్యోగ అవకాశాలు రోజురోజుకు తగ్గిపోతున్నాయి. ఆధునిక శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం ఎన్నో ఉద్యోగాలను, ఉపాధి అవకాశాలను కల్పించినప్పటికి నిరుద్యోగుల శాతం స్వాతంత్ర్యానంతరం ఎన్నడూలేని స్థాయిలో పెరిగి ఆందోళన కల్గిస్తున్నది. విద్య ఒక మార్కెట్ సరుకుగా మారిపోయింది. ప్రభుత్వ విద్యా వ్యవస్థ బాధ్యతాయుతంగా పనిచేయకపోటంతో ప్రైవేటు విద్యారంగం ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయింది. సంపన్నుల పిల్లలు మాత్రమే విద్యను కొనుగోలు చేసుకోగలుగుతున్నారు. సామాన్యులు విద్యావంతులైనా సంపన్నుల పిల్లలతో పోటీ పడలేకపోతున్నారు. రిజర్వేషన్ వల్ల కొంత సామాజిక మార్పు వచ్చినా సమగ్రమైన అభివృద్ధిపథంలో వెళ్లలేకపోతున్నారు.

ప్రభుత్వ రంగంలో వైద్యం అందని ద్రాక్షగా మారిపోయింది. ఆధునిక భవనాలు, యాంత్రిక శక్తి పెంపొందినా డాక్టర్ల కొరత వేదిస్తున్నది. డాక్టర్లు ఉంటే మందులు ఉండవు. మందులు ఉంటే సాంకేతిక నిపుణులు ఉండరు. ఇక ప్రైవేటు వైద్యం సామాన్యులకు అందనంత ఎత్తుకు ఎదిగిపోయింది. రాష్ట్రంలో కార్పొరేట్ హాస్పటల్స్ మాత్రమే హాస్పటల్స్ అనే స్థాయిలో ప్రజల మనోభావాలు మారిపోయాయి. ప్రభుత్వ డాక్టర్లు సైతం ప్రైవేటు ప్రాక్టీస్‌వైపు మొగ్గు చూపు తున్నారు. దీనివలన పేద, సామాన్య ప్రజలు తీవ్ర వడిదుడుకులు ఎదుర్కొంటు న్నారు. వైద్యం కోసం స్థిర ఆస్తులు, బంగారం వంటి వాటిని అమ్ముకోవలసిన దుర్భర పరిస్థితులు నేటికి కొనసాగటం మన దౌర్భల్యం. గత రెండు దశాబ్దాలుగా సాగునీటి రంగంపై కొంత దృష్టి సారించినా, అనేక ప్రాజెక్టులు ప్రారంభించి దశాబ్దాలు గడుస్తున్నా వాటిని పూర్తి చేయలేకపోయారు. ప్రధానంగా రాయలసీమ ప్రాజెక్టుల పరిస్థితి దయనీయంగా ఉంది. ప్రాజెక్టులు పూర్తయి నీరు వచ్చినా కాల్వల నిర్మాణం లేక నీటి వినియోగం జరగటం లేదు. రాష్ట్రంలో నేటికి 10 లక్షల హెక్టార్ల భూమి చెరువుల కింద సాగు చేస్తున్నారు. ఈ వ్యవసాయం ప్రకృతిపై ఆధారపడి ఉంటుంది. అతివృష్టి, అనావృష్టి పరిస్థితులలో పంట చేతికి వచ్చే వరకు గ్యారంటీ లేని పరిస్థితులు ఉన్నాయి. భారీ నీటి పారుదల ప్రాజెక్టులు, అనేక ఎత్తిపోతల పథకాలు సకాలంలో పూర్తికావటం లేదు. ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రణాళికా బద్దమైన విధానం పాలకులకు లోపించింది. దీని వలన అంచనాలు తారుమారైపోతున్నాయి. పోలవరం లాంటి కేంద్ర ప్రాజెక్టులు సైతం నత్త నడకన నడుస్తున్నాయి. కాంట్రాక్టు సంస్థల మార్పిడి, రీటెండర్లు వంటి సమస్యలు ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆలస్యం చేసింది. నిర్వాసితుల భారం తగ్గించే కుట్రలో భాగంగా ప్రాజెక్టు ఎత్తు తగ్గించే ప్రతిపాదన ముందుకు తెచ్చారు. ప్రాజెక్టు స్థాయిని బ్యారేజ్ స్థాయికి దిగజార్చే ప్రయత్నం జరుగుతున్నది. దీని వలన రాష్ట్రంలో పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు దెబ్బతింటాయి. పారిశ్రామిక సంస్థలకు, లక్షల ఎకరాల మెట్ట భూములకు నీరు అందుబాటులోకి వస్తుంది.

> రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా రాష్ట్ర ప్రయోజనాలకు భిన్నంగా అప్పులు చేసి సంక్షేమ పథకాలను ఇస్తున్నారు. అభివృద్ధి దుర్భిణి వేసి వెతికినా కన్పించటం లేదు. సంక్షేమం పేరుతో ఉచిత పథకాలు పెట్టి మోయలేని భారంతో తిరిగి ప్రజల నెత్తిన భారాలు వేస్తున్నారు. ఈ ఉచిత పథకాల వల్ల రాష్ట్ర ప్రభుత్వ రుణ భారం రోజురోజుకు పెరిగిపోతున్నది. ఎస్సీ, ఎస్టీ వర్గాల సబ్సిడీలు, ప్రోత్సాహకాలలో కోత విధిస్తున్నారు.

తాగునీటి ఇబ్బందులు తొలుగుతాయి. కృష్ణా, గోదావరి, పెన్నా నదుల అనుసంధానం ఒక కలగా మిగిలిపోయింది. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయకుండా నిరుప యోగమైన బనకచర్ల వంటి ప్రాజెక్టులు నిర్మించాలనే ఆలోచన హేతుబద్ధం కాదు. వ్యవసాయం, నీటి పారుదల రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలి. వ్యవసాయం గిట్టుబాటు కాక రైతు కుటుంబాలు వ్యవసాయం వదిలి ఇతర రంగాలవైపు వెళ్లిపోయారు. దీనివల్ల కౌలు రైతుల సంఖ్య బాగా పెరిగింది. కౌలు రైతులకు సరైన పరపతి సౌకర్యంగాని, ప్రతికూల పరిస్థితులలో ఆదుకునే పరిస్థితిగాని లేక అనేక సందర్భాలలో ఆత్మహత్యలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో ఆహారపంటల ఉత్పత్తి రోజురోజుకు తగ్గిపోతున్నది. ఇది ఆందోళన కలిగించే విషయం. మార్కెట్ సౌకర్యాల లేమి, గిట్టుబాటు ధరలులేక, సాగు ఖర్చులు పెరిగి, కూలీల కొరత వల్ల వ్యవసాయం దండుగ అనే భావన బలపడుతున్నది. కారణం ఏదైనా భూముల ధరలు పెరగటంతో ఇంకా రైతు కుటుంబాలు వ్యవసాయ భూములను ఆశ్రయించుకుని ఉన్నారు.

రాష్ట్రంలో పారిశ్రామిక వృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. గత 10 ఏళ్లలో ఒక్క కియా కార్ల పరిశ్రమ తప్ప ఎటువంటి భారీ పరిశ్రమ రాష్ట్రానికి రాలేదు. ఉన్న పరిశ్రమలే ప్రభుత్వాల విధానాల వల్ల ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయి. రాష్ట్రంలోని ఏకైక భారీ పరిశ్రమ విశాఖ ఉక్కును నిర్వీర్యం చేసే ప్రయత్నం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయి. రాష్ట్రం పారిశ్రామిక రంగంలో బాగా వెనుకబడిపోయింది. దీని వల్ల ఉద్యోగాలు కల్పన తగ్గి నిరుద్యోగం పెరిగిపోయింది. ఉన్న ప్రభుత్వ రంగ పరిశ్రమలను, సంస్థలను కేంద్రం ప్రైవేటు రంగానికి బదలాయిస్తుంటే అధికారపక్ష, ప్రతిపక్ష నాయకులు ఇరువురూ డూడూ బసవన్నలుగా తలలు ఊపుతున్నారు తప్ప వ్యతిరేకత వ్యక్తం చేయటం లేదు. ప్రైవేటు రంగంలో లాభాపేక్షతో తమ దోపిడీ యధేచ్ఛగా సాగిస్తున్నారు. కేంద్రం రాష్ట్రానికి సాయం అందించటంలో 'ముష్టివాడికి చెయ్యి విదిల్చి' నట్లుగా వ్యవహరిస్తున్నది.

విద్యుత్ రంగంలో ఆధునీకరణ జరిగి ఎన్నో మార్పులు వచ్చాయి. కానీ ఈ రంగంలో ప్రైవేటు పెట్టుబడులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయి ప్రభుత్వం వారితో ఒప్పందాలు చేసుకుని అధిక ధరలు చెల్లించి ఆ భారం వినియోగదారులపై వేస్తున్నారు. అసలు కన్నా వడ్డీ ముద్దు అన్నట్లు బిల్లు కంటే ట్రాఫిక్ చార్జీలు, ఫిక్సడ్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీల పేరుతో వేలకు వేలు వసూలు చేస్తున్నారు. ఇప్పుడు ప్రీ పెయిడ్ మీటర్లు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. అదానీ దోపిడీకి స్వర్గధామంగా విద్యుత్ రంగం తయారయ్యింది. పీక్ టైమ్‌లో విద్యుత్ చార్జీలు పెంచాలని ఆలోచిస్తున్నారు. ద్వంద్వ ధరల విధానం ద్వారా పెట్టుబడిదారుల జేబులు నింపాలని చూస్తున్నారు. వ్యవసాయ ఉచిత విద్యుత్‌కు మీటర్లు బిగించి రైతులు అడ్వాన్సుగా బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు. ప్రభుత్వ నయా ఉదారవాద ఆర్థిక విధానాల ఫలితంగా గ్రామీణ, చిన్న పరిశ్రమలు దెబ్బతిన్నాయి. ప్రైవేటు గుత్త పెట్టుబడిదారులు రిటైల్ వ్యాపారం రంగంలోకి ప్రవేశించటంతో చిన్న వ్యాపారులు, చిన్న పరిశ్రమలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు గ్రామీణ ప్రజల వలసలు పెరిగాయి. బీహార్, యూపి, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, ఝార్ఖండ్ రాష్ట్రాలతో పాటు తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల వారు ఈ వలసలలో పాల్గొంటున్నారు. ఒకప్పుడు వ్యవసాయ రంగం తరువాత ప్రముఖంగా ఉన్న చేనేత రంగం నేడు బాగా బక్కచిక్కి పోయింది. రాష్ట్రంలోని మూడు ప్రధాన ప్రాంతాలు కోస్తా, రాయలసీమ, ఉత్తరాంధ్ర మధ్య సమతుల అభివృద్ధి లేక అసమానతలు పెరిగిపోతున్నాయి. దీని వలన ప్రాంతాల మధ్య సమన్వయం, సమగ్ర అభివృద్ధి దెబ్బతింటున్నది.

రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా రాష్ట్ర ప్రయోజనాలకు భిన్నంగా అప్పులు చేసి సంక్షేమ పథకాలను ఇస్తున్నారు. అభివృద్ధి దుర్భిణి వేసి వెతికినా కన్పించటం లేదు. సంక్షేమం పేరుతో ఉచిత పథకాలు పెట్టి మోయలేని భారంతో తిరిగి ప్రజల నెత్తిన భారాలు వేస్తున్నారు. ఈ ఉచిత పథకాల వల్ల రాష్ట్ర ప్రభుత్వ రుణ భారం రోజురోజుకు పెరిగిపోతున్నది. ఎస్సీ, ఎస్టీ వర్గాల సబ్సిడీలు, ప్రోత్సాహకాలలో కోత విధిస్తున్నారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సైతం కోత విధించారు. గత కొంతకాలంగా రాష్ట్రంలోని అంతర్గత రహదారుల పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది. నిర్వహణ లేక రోడ్లు, వంతెనలు నిర్వీర్యమై పోతున్నాయి. రాష్ట్రాన్ని ఎవరు పరిపాలించినా లంచగొండితనం, అవినీతి మూడుపువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది. రాజకీయ కక్షలు, కార్పణ్యాలు, వేదింపులు పెరిగిపోతున్నాయి. ప్రతి అభివృద్ధి ప్రాజెక్టు వెనుక 'క్విడ్ ప్రోకో' నడుస్తున్నది. ప్రభుత్వ మద్యం పాలసీ అనేక కుటుంబాలను నాశనం చేస్తున్నది. బెల్టు షాపులు ప్రతి వూరిలో వెలిశాయి. తాగుబోతుల ఆగడాలు పెరిగాయి. రాష్ట్ర అభివృద్ధిని గూర్చి ఒక ప్రణాళికాబద్ధమైన విధానం లేదు. వర్తమానం గూర్చి మాట్లాడకుండా ప్రభుత్వ నేతలు విజన్ 2047 జపం చేస్తున్నారు. ఈ విధానాలు రాష్ట్రాభివృద్ధికి ఏ రకంగాను దోహదం చేయవు.

ఈ నేపథ్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి 28వ మహాసభలు ఆగస్టు 23-25 తేదీలలో ఒంగోలులో జరగనున్నాయి. ఈ సభలలో రాష్ట్ర సమగ్ర అభివృద్ధి గూర్చి ప్రధానంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపకల్పన చేయనున్నారు. రాష్ట్రంలో వివిధ వర్గాల మధ్య అంతరాలు, వైషమ్యాలు తగ్గించేందుకు అవసరమైన సూచనలతో కూడిన ఒక సమగ్ర తీర్మానం మహాసభ ఆమోదించనున్నది.

సెల్: 9490952093

తక్షణం శాంతి సాధన అవశ్యం

భరత్ దోగ్రా

ప్రపంచంలో శాంతి సాధన అవశ్యం. అత్యంత ముఖ్యమైన వాతావరణం, న్యాయ సమస్యలను పరిష్కరించేందుకు అత్యంత వేగంగా అంతర్జాతీయ సహకారం ఏర్పడకముందే శాంతికి ప్రపంచం కట్టుబడి ఉండవలసింది. అయితే ఇందుకుపూర్తి భిన్నంగా పరిస్థితి ఉంది. అత్యంత ప్రమాదకరమైన యుద్ధాల ముప్పు పెరుగుతోంది. ఈ యుద్ధాలు జరగడానికి ప్రపంచంలో మానవీయ సంక్షోభ పరిస్థితులు ప్రధాన కారణం. విస్తృత ప్రాంతాలలో ఆకలి సమస్య పెరిగింది. అంతేకాదు, పెద్ద ఎత్తున ఆకలిచావులు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరగా యుద్ధాలు, సంఘర్షణలకు అంతం పలకాలి. ఇప్పుడు మూడు యుద్ధాలు జరుగుతున్నాయి. ఈ యుద్ధాలు తీవ్రమైన కష్టాలకు లోనుకానున్నందున వీటిని పరిష్కరించడానికి ప్రత్యేక శ్రద్ధపెట్టాలి.

ఇటీవల కాలంలో సూడాన్‌లో జరుగుతున్న అంతర్యుద్ధం స్త్రీలపై తీవ్రస్థాయిలో హింస జరుగుతోంది. అంతేకాదు, సాయుధ సంఘర్షణ మరింత విస్తరించే అవకాశం కనిపిస్తోంది. మరింత విధ్వంసకర ఆయుధాలతో సాయుధసంఘర్షణలు మరింత పెరిగే అవకాశాలున్నాయి. యుద్ధాల్లో అనేక ఇతర దేశాలు జోక్యం చేసుకుంటున్నాయి. ఇరుపక్షాలు విధ్వంసకర ఆయుధాలను వినియోగించడంవల్ల విధ్వంసం మరింత పెరిగే అవకాశాలున్నాయి. ఈ అవకాశాలను వీలైనంత త్వరంగా నిరోధించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. ఈ యుద్ధాన్ని ఆఫ్రికా యుద్ధంగా విస్తరించే ఏ అవకాశాన్ని ఇవ్వకూడదు. అంతక్రితం కాంగో సంఘర్షణ జరిగింది. ఈ సంఘర్షణను వీలైనంత త్వరగా పరిష్కరించాలి. అలాగే సయోధ్యతో భారీగా సహాయాన్ని, ప్రత్యేకించి మహిళలను దృష్టిలో ఉంచుకుని నివాసగృహాల నిర్మాణం చేపట్టాలి. ఈ విషయంలో ఐక్యరాజ్యసమితి కీలకపాత్ర నిర్వహించాలి. సంకుచిత భావాలను పక్కనపెట్టి భద్రతామండలిలోని శాశ్వత సభ్యదేశాలు, ఇతర దేశాలు తమ పూర్తి సహకారం అందించాలి. పశ్చిమాసియాలో అనేకరకాల సమస్యలున్నాయి. అయితే ఇజ్రాయిల్ గాజా స్ట్రిప్‌పైన దాడిచేసి విధ్వంసకాండను జరుపుతున్న అంశాన్ని పరిష్కరించడానికి ప్రథమ ప్రాధాన్యత నివ్వాలి. ఇందుకుగాను అంతర్జాతీయ వత్తిడి తీసుకురావాలి. అమెరికా కాల్పుల విరమణకు సైతం చిత్తశుద్ధితో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కాల్పుల విరమణతోపాటు గాజా ప్రజలకు భారీగా నివాసగృహాలను నిర్మించడమే గాక ఇతర సహాయ కార్యక్రమాలను

చేపట్టాలి. ఐరాస గాజా ప్రజల తరఫున నిలిచి వారి సొంత ప్రాంతంలోనే ఉండి నివశించే అవకాశం కల్పించాలి. పలస్తీనాను స్వతంత్రదేశంగా ప్రకటించాలి. ఇరాన్ అణ్వాయుధాలు తయారీ పరిశ్రమ సమస్యను పరిష్కరించాలి. ఇజ్రాయిల్‌లో పనిచేస్తున్న శాంతి శక్తులకు అంతర్జాతీయ మద్దతును మరింత బలోపేతం చేయడం. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తీవ్రమైన సవాళ్లు ఎదుర్కొంటోంది. రెండు దేశాలలో ప్రజలు భారీగా ప్రాణాలు పోగొట్టుకున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు ఇతర ప్రాంతాలకు వలసవెళ్లారు. రెండు దేశాలు మూడో ప్రపంచ యుద్ధానికి కారణం కావచ్చు. సుదీర్ఘకాలంగా యుద్ధం జరుగుతోంది. ఊహించలేనంతగా ఆస్తుల నష్టం జరిగింది. యుద్ధాన్ని నిలిపివేయడమేగాక యుద్ధం శాశ్వతంగా ఆగిపోయేందుకు చర్యలు తీసుకోవాలి. అలాగే రెండు దేశాల మధ్య సంబంధాలను కొనసాగించడానికి చిత్తశుద్ధిగల అభిలాష ఉండాలి. ఇటీవల కాలంలో యుద్ధం చోటుచేసుకున్నప్పటికీ గతంలో స్నేహదేశాలే. శాశ్వత శాంతికోసం దృఢమైన అంకిత భావాన్ని పెంపొందించుకోవాలి. అమెరికా నిజంగా శాంతి కావాలని కోరుకుంటే నాటోలోగల ఐరోపా దేశాలు కూడా శాంతిని కోరుకుంటాయి. అనేకమంది ఆచరణాత్మక మేధావులు, ఆలోచనాపరులు శాంతికి కట్టుబడి ఉన్నారు. క్రిమియా, డాన్‌బాస్ నష్టాన్ని ఉక్రెయిన్ అంగీకరించాలి. శాంతిని కోరుకున్నట్లయితే ఈ నష్టాన్ని అంగీకరించవలసిందే. అంతర్జాతీయ సహకారంతో రెండు దేశాల మధ్య శాంతి ఒడంబడికలు ఎంతైనా అవసరం.

భవిష్యత్‌లో శాంతి, సుస్థిరత, నివాసగృహాల నిర్మాణం, రష్యా, పశ్చిమ దేశాల మధ్య సహకారంతో పురోగతిని సాధించాలి. 2014కు ముందు రాజ్యాంగంలో పొందుపరిచిన తటస్థీకరణకు కట్టుబడి ఉండేందుకు ఉక్రెయిన్ శ్రద్ధపెట్టాలి. ఇలా జరిగి ఉంటే నేడు పురోగించిన శాంతి దేశంగా ఉండేది. ఈ అంశాలపైన శ్రద్ధ పెట్టకపోవడం కారణంగా ఇప్పుడు విధ్వంసకర ఫలితాలు వచ్చాయి. కనీసం మూడు యుద్ధాలు నిలిచిపోవాలని ఆశించడం అంతగా జరగకపోవచ్చు. ప్రజలందరూ శాంతికి కట్టుబడి ఉండి కృషి చేయాలి. ఇటీవలకాలంలో తృతీయ ప్రపంచయుద్ధం, అణుయుద్ధం ఎంతో దూరం లేదన్న సంకేతాలు, అభిప్రాయాలు వెల్లడయ్యాయి. శాంతి కోసం ప్రపంచ నాయకుల మీద బాధ్యతను వదలిపెట్టకుండా ప్రజలంతా కలిసి శాంతి ఉద్యమానికి పూనిక వహించాలి.

అమెరికా సుంకాల ప్రభావం ఉండకపోవచ్చు

సీఈఏ అనంత నాగేశ్వరన్

న్యూఢిల్లీ: రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాల ప్రభావాన్ని ఇప్పుడే అంచనావేయడం తొందరపాటు చర్య అవుతుందని ముఖ్య ఆర్థిక సలహాదారుడు వి.అనంత నాగేశ్వరన్ అభిప్రాయపడ్డారు. ఇప్పటి వరకు భారత ఆర్థిక వ్యవస్థ మందగిస్తున్న సంకేతాలు కనిపించలేదని చెప్పారు. ఈ ఏడాదికి భారత ఆర్థిక వ్యవస్థ 6.3 నుంచి 6.8 శాతం వృద్ధి నమోదు చేయవచ్చని అంచనావేశారు. దేశంలోని రాజకీయ స్థిరత, భారీ మార్కెట్ అవకాశాలు, బలమైన లేబర్‌మార్కెట్, స్థిరంగా పెరుగుతున్న ఆర్థిక వృద్ధి వంటి అంశాలను పరిశీలిస్తే... తయారీ సంస్థల ఏర్పాటుకు అత్యుత్తమ ప్రదేశమన్నారు. భారత్ సెమీకండక్టర్లు, కృత్రిమ మేధ రంగంలో పోటీ పడేందుకు కీలక చర్యలు తీసుకొంటోందని నాగేశ్వరన్ పేర్కొన్నారు. ముంబైలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం భారత వస్తువులపై అమెరికా 25 శాతం సుంకాలు విధిస్తోంది. ఆగస్టు 27 నుంచి ఇవి 50 శాతానికి చేరనున్నాయి. రష్యా నుంచి చమురు, గ్యాస్ దిగుమతుల కారణంగా ఈ అదనపు పన్ను విధిస్తోంది. ఈ చర్యలను భారత విదేశాంగశాఖ తీవ్రంగా వ్యతిరేకించింది. అకారణంగా తమను లక్ష్యంగా చేసుకొన్నట్లు ఆరోపించింది. 2022లో ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం మొదలైన తర్వాత పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించాయి. మాస్కో నుంచి భారత్ కారు చౌకగా చమురు కొనుగోలు చేసింది. ఇది పశ్చిమ దేశాలకు కంటగింపుగా మారింది. భారత్ ఎగుమతులకు అతిపెద్ద మార్కెట్లలో అమెరికా కూడా ఒకటి. 2024-25లో భారత్ 86.51 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులు ఎగుమతి చేసింది. దీంతో 40.82 బిలియన్ డాలర్ల వాణిజ్య మిగులు సాధించింది.

బీహార్‌లో అమానుషం

పట్నా: బీహార్‌లో దారుణం చోటుచేసుకుంది. చేతబడి చేస్తున్నారనే అనుమానంతో ఇద్దరు వ్యక్తులను స్తంభానికి కట్టేసి కొట్టి, ఆపై వారితో బలవంతంగా మూత్రం తాగించారు. ఈ దారుణమైన ఘటన కతిహార్‌లో చోటుచేసుకుంది. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఘటనపై స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బీహార్‌లోని బరారి పోలీస్ స్టేషన్ పరిధిలోని కతిహార్‌లో గ్రామస్థులు... అదే గ్రామానికి చెందిన ఉమేష్ మండల్, మహ్మద్ ఇక్బాల్ అనే ఇద్దరు వ్యక్తులను చేతబడి చేస్తున్నారనే అనుమానంతో స్తంభానికి కట్టేసి చితక్కొట్టారు. అనంతరం మానవత్వం మరచి వారితో బలవంతంగా మూత్రం తాగించారు. ఈ ఘటన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బరారి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులిద్దరినీ గ్రామస్థుల చెర నుంచి రక్షించారు. అనంతరం బాధితులను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ కేసుతో ప్రమేయం ఉన్న ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా, మరికొందరి కోసం గాలింపు కొనసాగుతోందని పోలీసులు చెప్పారు. బాధితులిద్దరిని కొట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బాధితులిద్దరూ చేతబడి చేస్తున్నారనే గ్రామస్థుల వాదనపైనా విచారణ చేస్తామని స్పష్టం చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ప్రజలు తప్పు చేశారని పోలీసులు అన్నారు.

తండ్రే హంతకుడు... పోలీసుల నిర్ధారణ

బెంగళూరు: కర్నాటకలోని హసన్ జిల్లాలో రెండేళ్ల క్రితం అదృశ్యమైన యువకుడి (32) ఆచూకీని పోలీసులు గుర్తించారు. తండ్రే కుమారుడిని హతమార్చి ఇంటి పెరట్లో పాతిపెట్టినట్లు గుర్తించారు. ఘటనాస్థలి వద్ద తవ్వకాలు జరిపి యువకుడి అస్థిపంజరాన్ని వెలికితీశారు. పోలీసుల వివరాల ప్రకారం... హసన్ జిల్లా సొంతెబసవనహళ్లి గ్రామంలో గంగాధర్ అనే వ్యక్తి ఆర్థిక వివాదాల కారణంగా తన కుమారుడు రఘు (32)ని 2022లో హతమార్చాడు. ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని ఇంటి పెరట్లో పాతిపెట్టాడు. అప్పటి నుంచి రఘు ఎవరికీ కనిపించలేదు. ఈ ఏడాది ఆగస్టు ఒకటో తేదీన తండ్రి గంగాధర్ మరణించాడు. అయితే, తండ్రి అంత్యక్రియలకు కొడుకు హాజరుకాకపోవడంతో బంధువులు అనుమానం వ్యక్తం చేశారు. ఆ తర్వాత జరిగిన కర్మకాండలకు కూడా రఘు రాలేదు. దీంతో బంధువులు రఘు తమ్ముడు రూపేష్‌ను గట్టిగా ప్రశ్నించారు. దీంతో అతడు అసలు విషయం బయటపెట్టాడు. తన తండ్రే అన్నను చంపి పెరట్లో పాతిపెట్టినట్లు చెప్పాడు. దీంతో బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూపేష్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు, స్థానిక అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని తవ్వకాలు జరిపారు. ఈ క్రమంలో ఇంటి పెరట్లో రఘు అస్థిపంజరాన్ని వెలికితీశారు. అనంతరం దాన్ని పరీక్షల కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక విచారణలో రఘు మాజీ బీఎంటీసీ ఉద్యోగి అని తేలింది. క్రికెట్ బెట్టింగ్‌లు, పేకాటలో భారీగా డబ్బులు పోగొట్టుకున్నట్లు తెలిసింది. ఉద్యోగం కోల్పోయిన తర్వాత స్వగ్రామానికి తిరిగొచ్చిన రఘు... అప్పులు తీర్చేందుకు తండ్రిని డబ్బుల కోసం వేధించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ విషయంలో తండ్రీకొడుకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుందని, ఈ క్రమంలో ఆగ్రహంతో గంగాధర్ పదునైన ఆయుధంతో రఘుపై దాడి చేయడంతో అతడు మరణించినట్లు పోలీసులు భావిస్తున్నారు. ప్రాథమిక దర్యాప్తు ఆధారంగా ఈ కేసులో తండ్రే హంతకుడని పోలీసులు నిర్ధారించారు.

‘ఓట్ల దొంగ...గద్దె దిగు’

జైపూర్‌లో మార్మోగిన నినాదం: కాంగ్రెస్ భారీ ప్రదర్శన

జైపూర్: ‘ఓట్ల దొంగ, గద్దె దిగు’ అంటూ కాంగ్రెస్ నినాదమిచ్చింది. ‘ఓట్ల చోరీ’ వ్యతిరేక ఆందోళనల్లో భాగంగా బుధవారం రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ సింగ్ దోత్సారా అధ్వర్యంలో పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి షహీద్ స్మారక్ వరకు భారీ ప్రదర్శన జరిగింది. ర్యాలీ సాగిన మార్గం ‘ఓట్ చోర్, గద్దీ ఛోడ్’ (ఓట్ల దొంగ, గద్దె దిగు) నినాదాలతో మార్మోగింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ రాజస్థాన్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు టికారామ్ జుల్లి, మాజీ మంత్రి ప్రతాప్ సింగ్ కచారియా తదితరులు ఓటర్ల జాబితాల అక్రమాలను ఎండగట్టారు. దిద్దుబాటు చర్యలు తీసుకోవడంతో ఎన్నికల సంఘం విఫలమైందని అశోక్ గెహ్లాట్ ఆరోపించారు. అక్రమాలపై వివరణ ఇవ్వడం లేదని, ఇలా జరగడం చరిత్రలో ఇదే మొదటిసారి అని అన్నారు. ఎలాంటి కారణాలు చూపకుండా 60 లక్షల ఓట్లు తొలగించడంతో బీహార్ పరిస్థితి ఆందోళన కలిగిస్తోందన్నారు. ఎవరి ఓటు తీసేశారు... ఎన్ని నకిలీ ఓట్లు చేరాయో తెలియదన్నారు. ఇది స్థానిక సమస్య కాదని దేశం మొత్తానికి సంబంధించినదని గెహ్లాట్ అన్నారు. సచిన్ పైలట్ మాట్లాడుతూ అన్ని సందేహాలు నివృత్తి చేసేలా ఎన్నికల సంఘం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎక్కడెక్కడ లోపాలు, అక్రమాలు జరిగాయో వెల్లడించాలన్నారు. అంతకుముందు పార్టీ కార్యకర్తలనుద్దేశించి గోవింద్ సింగ్ ప్రసంగించారు. దొంగ ఓట్లతో ప్రధాని మోదీ గద్దెనెక్కారని విమర్శించారు. ‘ఎస్ఐఆర్ పేరుతో ఓట్లలో కోతలు పడుతున్నాయి. నకిలీ ఓట్లు జాబితాల్లో చేరుతున్నాయి. ఇదంతా బీజేపీకి లబ్ధి చేకూర్చేందుకే జరుగుతోంది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఈ అక్రమాలను సాక్ష్యాలతో చూపారు. ఓట్ల చోరీతో రాజ్యాంగంపై ప్రత్యక్ష దాడి జరుగుతోంది’ అని గోవింద్ సింగ్ అన్నారు. ఈసీ, బీజేపీ ఎన్నికల మోసాలను ఎండగట్టేందుకు కాంగ్రెస్ అధ్వర్యంలో పోరు తీవ్రతరం చేస్తామన్నారు.

మాంసం నిషేధంపై రగడ

• ఒవైసీ, ఆదిత్య ఠాక్రే ఆగ్రహం • అజిత్ పవార్ సైతం అభ్యంతరం

న్యూఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కొన్ని రాష్ట్రాలు, నగరాల్లో మాంస విక్రయాలపై తాత్కాలిక నిషేధం విధించడం దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారి తీసింది. పర్యావరణ, జంతు సంక్షేమం, సంప్రదాయ విలువల పరిరక్షణ పేరుతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ... దీనిపై మాంసం వ్యాపారులు, హోటల్ యజమానులు, పౌర సమాజంలోని విభిన్న వర్గాల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మాంస నిషేధం అనుకూల, ప్రతికూల వర్గాలు నెట్టింట పెద్ద ఎత్తున చర్చిస్తున్నారు. మాంసం నిషేధంపై గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ తీసుకున్న నిర్ణయాన్ని హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ తీవ్రంగా ఖండించారు. ఆగస్టు 15, ఆగస్టు 16 (జన్మాష్టమి) తేదీల్లో మాంస దుకాణాలు, కబేళాలు మూసివేయాలని చెప్పడం సరి కాదని ఆయన వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవడానికి, మాంసాహారానికి సంబంధమేమిటని ఒవైసీ ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల్లో 99 శాతం మంది మాంసం తింటారు. ఇలా నిషేధం విధించడం వల్ల ప్రజల స్వేచ్ఛ, గోప్యత, జీవనోపాధి, సంస్కృతి, ఆహార హక్కులు, మత స్వేచ్ఛలను ఉల్లంఘించినట్లు అవుతుందని ఎక్స్ వేదికగా ఒవైసీ రాసుకొచ్చారు.

మహారాష్ట్రలో మాంసం నిషేధంపై వివాదం

మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో మాంసంపై నిషేధం విధించగా... ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక రోజు కోసం ప్రజలు భావోద్వేగాలను కించపర్చొద్దని సూచించారు. మహారాష్ట్ర దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం రోజుల్లో ఇలా ఆంక్షలు పెట్టడం సరికాదన్నారు. థానే జిల్లా కల్యాణ్-డొంబివిలి మునిసిపల్ కార్పొరేషన్ కూడా ఇలాంటి ఆదేశాలు జారీ చేయగా... శివసేన(ఉద్ధవ్) నేత ఆదిత్య ఠాక్రే తీవ్రంగా మండిపడ్డారు.

స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఏం తినాలో నిర్ణయించడం ప్రజల హక్కు స్వేచ్ఛను హరించినట్లు అవుతుందన్నారు. తమ ఇంట్లో నవరాత్రి సమయంలో కూడా ప్రసాదంలో రొయ్యలు, చేపలు ఉంటాయని గుర్తు చేశారు. ఇది తమ సంప్రదాయం, తమ హిందుత్వం అని ఆదిత్య ఠాక్రే వెల్లడించారు. మాంసం నిషేధానికి మహారాష్ట్రలోని బీజేపీ-సేన-ఎన్‌సీపీ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని ఏకనాథ్ షిండే నేతృత్వంలోని శివసేన అధికార ప్రతినిధి అరుణ్ సావంత్ తెలిపారు. ప్రతిపక్షం తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టాలని చూస్తోందన్నారు. మాంసం నిషేధం వివాదం, పండుగ రోజుల్లో వ్యక్తిగత స్వేచ్ఛ, సంప్రదాయాలు, ప్రభుత్వ ఆంక్షల పరిమితులపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చను రగిలించింది.

జయాబచ్చన్‌పై కంగన విసుర్లు

న్యూఢిల్లీ: అలనాటి ప్రముఖ నటి, సమాజ్‌వాది పార్టీ నాయకురాలు, రాజ్యసభ సభ్యురాలు జయాబచ్చన్‌పై బాలీవుడ్ నటి, మండి బీజేపీ ఎంపీ కంగనా రాణావత్ విమర్శలు గుప్పించారు. ఆమె బాలీవుడ్ స్టార్ నటుడు అమితాబ్ బచ్చన్ భార్య కాబట్టి ప్రజలు ఆమె కోపతాపాలను సహిస్తున్నారంటూ వ్యాఖ్యానించారు. జయాబచ్చన్ సహనం కోల్పోయి ఆమెతో సెల్ఫీ దిగేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తిపై చిందులు తొక్కారు. అతడిని కోపంగా పక్కకు తోసేశారు. ‘ఏం చేస్తున్నావు నువ్వు... ఏంటిది’ అంటూ అతడిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆవరణలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్ అయింది. ఆ వీడియోపై కంగన స్పందిస్తూ ... జయాబచ్చన్ అత్యంత విశేషాధికారం కలిగిన మహిళ అంటూ వ్యాఖ్యానించారు. ఈ ఘటనను అవమానకరంగా, సిగ్గు చేటుగా అభివర్ణించారు. ఈ మేరకు ఇన్‌స్టాలో పోస్టు పెట్టారు.

పాక్‌కు గూఢచర్యం డీఆర్డీవో ఉద్యోగి అరెస్టు

జైపూర్: పాకిస్థాన్ గూఢచారిగా పనిచేస్తున్న మహేంద్ర ప్రసాద్ (32) అనే వ్యక్తిని రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో సీఐడీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చందన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ఉన్న డీఆర్డీవో గెస్ట్ హౌస్‌లో అతడు మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ వ్యక్తులతో అతడు నిత్యం సంభాషిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. భారతీయ రక్షణ రంగ కార్యకలాపాల సమాచారాన్ని అతడు చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. ఉత్తరాఖండ్‌లోని అల్మోరా అతడి స్వస్థలం. సోషల్ మీడియా ద్వారా పాకిస్థాన్ ఇంటెలిజెన్స్‌తో అతడికి లింకు ఉన్నట్లు గుర్తించారు. డీఆర్డీవో సైంటిస్టులు కదలికలు, చందన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌కు వస్తున్న భారత ఆర్మీ అధికారుల వివరాలను పాక్ ఇంటెలిజెన్స్‌తో అతడు పంచుకున్నట్లు తెలుస్తోంది. జైసల్మేర్‌లో ఉన్న కేంద్రంలో రక్షణ రంగ పరికరాలను పరీక్షిస్తుంటారు. భద్రతా ఏజెన్సీలు ప్రసాద్‌ను విచారిస్తున్నాయి. అతడి మొబైల్ ఫోన్‌ను సాంకేతిక విశ్లేషణ కోసం వినియోగిస్తున్నారు. డీఆర్డీవో ఆపరేషన్స్‌కు సంబంధించిన సున్నిత సమాచారాన్ని అతడు షేర్ చేసినట్లు ధృవీకరించారు. గూఢచర్యం కేసు కింద ప్రసాద్‌ను సీఐడీ ఇంటెలిజెన్స్ అరెస్టు చేసింది.

స్వామిజీకి 50 మంది సంతానం

- పెద్దోడికి 72... చిన్నోడికి 28 ఏళ్లు
- వారణాసిలో ఓటర్ల జాబితా వైరల్
- ఈసీ చమత్కారం: కాంగ్రెస్ విమర్శలు
- అవమానించారు... కోర్టుకెళతాం: స్వామిజీల సంఘం

లక్నో: ఎన్నికల జాబితాల్లో అక్రమాలపై ప్రతిపక్ష కాంగ్రెస్ ఆందోళనలు చేస్తూ, ఎన్నికల సంఘాన్ని, బీజేపీని నిలదీస్తున్న తరుణంలో అందరిని ఆశ్చర్య పరిచే ఓ జాబితా వైరల్ అయింది. ఉత్తర ప్రదేశ్, వారణాసికి సంబంధించిన ఓటరు జాబితాలో ఓ స్వామిజీకి 50 మంది సంతానమని, పెద్ద కుమారుడికి 72 ఏళ్లు, అందరి కంటే చిన్నవాడికి 28 ఏళ్లు అని అందులో ఉంది. ఈ జాబితా వివాదాస్పదంగా మారింది. స్వామి రాజ్‌కమల్ దాస్ వారణాసిలోని రామ్‌జానకీ ఆలయ వ్యవస్థాపకుడు. ఈయన ఓ స్వామిజీ. బ్రహ్మచర్యం పాటిస్తారు. అలాంటి ఆయనను 50 మంది ఓటర్లకు తండ్రిగా ఈసీ జాబితా పేర్కొంది. స్వామి దాస్ మొదటి సంతానం బన్వరి దాస్‌కు 72 ఏళ్లు, చివరి సంతానం రాఘవేంద్రకు 28 ఏళ్లుగా చూపింది. ఈ జాబితా సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. ఎన్నికల సంఘం చేసిన అద్భుతం అంటూ ఎక్స్ మాధ్యమంగా కాంగ్రెస్ వ్యంగాస్త్రాలు సంధించింది. ‘రాజ్‌కమల్ దాస్ 50 మందికి తండ్రిగా ఓటర్ల జాబితాలో ఉంది. దీనిని పొరపాటు అంటూ ఈసీ తోసిపుచ్చుతుందా లేక జరిగిన మోసాన్ని అంగీకరిస్తుందా?’ అంటూ ఎద్దేవా చేసింది. వివాదాస్పద జాబితాను తమ ఖాతాలో పంచుకుంది. ఇదిలావుంటే హైందవ మతానికి చెందనని స్వామిజీలు అనుసరించే ఆచారాలను అవమానించారంటూ కాంగ్రెస్‌పై వారణాసిలోని స్వామిజీల సంఘం విరుచుకుపడింది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై కోర్టుకు వెళతామని స్వామి జితేంద్రనంద సరస్వతి వెల్లడించారు. జానపద గాయని నేహా సింగ్ రాథోడ్, ఆర్‌జేడీ నాయకులు కంచన్ యాదవ్‌తో పాటు ఈ వ్యవహారంలో సామాజిక మాధ్యమం ద్వారా స్పందించిన కొందరు జర్నలిస్టులపైనా ఫిర్యాదులు చేస్తామన్నారు. సనాతన ధర్మం ప్రకారం శిష్యులు తమ గురువు పేరును తండ్రి స్థానంలో పేర్కొనవచ్చని స్వామి జితేంద్రనంద వెల్లడించారు. ఆధార్ కార్డులు, ఓటర్ కార్డుల్లో 70 ఏళ్ల వ్యక్తికి తండ్రిగా 50 ఏళ్ల గురువు ఉంటే తప్పు కాదన్నారు. ఇదే అంశమై ఎన్నికల సంఘాన్ని కలుస్తానని ఆయన వెల్లడించారు.

గుజరాతీయులకు బీహార్‌లో ఓట్లు

తేజస్వీ యాదవ్ ఆరోపణలు

పట్నా: బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతోన్న వేళ ఈసీ ఆ రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) నిర్వహించింది. ఓటరు జాబితా నుంచి 65 లక్షల మంది ఓటర్లను తొలగించామని ఎన్నికల సంఘం ప్రకటించింది. దీనికి సంబంధించి ఇటీవల ముసాయిదా విడుదల చేసింది. దాంతో ఓటర్ల జాబితాలో అక్రమాలు చోటుచేసుకున్నాయని విపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. గుజరాత్ వ్యక్తులు బీహార్‌లో ఓటర్లుగా మారుతున్నారని తాజాగా ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ విమర్శించారు. ‘గుజరాత్‌కు చెందిన కొందరు వ్యక్తులు బీహార్‌లో ఓటు హక్కు పొందుతున్నారు. బీజేపీ ఇంఛార్జి భిఖుభాయ్ దల్సానియా పట్నా ఓటర్‌గా మారారు. 2024లో ఆయన గుజరాత్‌లో ఓటువేశారు. అక్కడ ఆయన పేరు తొలగించారు. బీహార్ ఎన్నికలు ముగిసిన తర్వాత ఆయన మళ్లీ ఎక్కడికి వెళ్తారు. ఇదంతా ఒక కుట్ర. ఎన్నికల కమిషన్‌తో కలిసి బీజేపీ మోసం చేస్తోంది’ అని తేజస్వి తీవ్ర విమర్శలు చేశారు. ఇటీవల ఈసీ ప్రకటించిన ప్రత్యేక సమగ్ర సవరణ జాబితాలో తన గుర్తింపు కార్డు నంబరు కనిపించలేదని, రాష్ట్రంలో 65 లక్షల ఓటర్ల పేర్లను తొలగించారని తేజస్వీ యాదవ్ ఆరోపించిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన ఈసీ... అవి నిరాధారమని చెప్పింది. ముసాయిదా జాబితాలో 416 క్రమ సంఖ్య వద్ద తేజస్వి పేరు ఉందని, ఆయన చెప్పిన కార్డు ఫోర్జరీ చేశారా అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపింది.

రోడ్డు ప్రమాదంలో 11 మంది యాత్రికుల మృతి

జైపూర్: రాజస్థాన్ రాష్ట్రం దౌసా జిల్లాలో బుధవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దౌసా-మనోహర్ పూర్ రోడ్డులోని బాపీ సమీపంలో వ్యాన్ - కంటైనర్ ఢీకొనడంతో 11 మంది మృతి చెందారు. 15 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను జైపూర్ లో వివిధ ఆసుపత్రులకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిలో తొమ్మిది మంది పరిస్థితి విషమంగా ఉండడంతో సవాయి మన్ సింగ్ ఆసుపత్రిలో ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. ఉత్తర ప్రదేశ్‌లోని ఎటావా జిల్లాకు చెందిన యాత్రికులు ఖాటూష్యామ్‌జీ దేవాలయాన్ని సందర్శించి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ట్రాఫిక్ నిలిచిపోవడంతో క్రేన్ సహాయంతో వాహనాలను పక్కకు తొలగించారు. మృతుల్లో ఏడుగురు పిల్లలు ఉన్నట్టు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు.

రెజ్లర్ సుశీల్ కుమార్ బెయిల్ రద్దు

న్యూఢిల్లీ: ఒలింపిక్ పతక విజేత, రెజ్లర్ సుశీల్ కుమార్ బెయిల్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఢిల్లీలోని ఛత్రసాల్ స్టేడియం వద్ద జరిగిన హత్య కేసులో సుశీల్ జైలుశిక్ష ఎదుర్కొంటున్నారు. జూనియర్ జాతీయ రెజ్లింగ్ మాజీ చాంపియన్ సాగర్ ధన్‌కర్ హత్య కేసులో సుశీల్ కుమార్‌పై ఆరోపణలు ఉన్నాయి. మార్చి నాల్గవ తేదీన ఈ కేసులో ఢిల్లీ హైకోర్టు సుశీల్‌కు బెయిల్ మంజూరు చేసింది. అయితే జస్టిస్ సంజయ్ కరోల్, ప్రశాంత్ కుమార్ మిశ్రాలకు చెందిన సుప్రీం ధర్మాసనం ఆ బెయిల్‌ను రద్దు చేసింది. మరో వారం లోగా సుశీల్ సరెండర్ కావాలని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొంది. ఓ ఆస్తి విషయంలో రెజ్లర్ల మధ్య వివాదం చెలరేగింది. మే 2021లో ధన్‌కర్‌పై సుశీల్ కుమార్‌తో పాటు మరి కొందరు దాడి చేశారు.

పౌరసత్వం లేకుండానే ఓటరు జాబితాలో సోనియా పేరు

బీజేపీ ఎదురుదాడి

న్యూఢిల్లీ: బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి ఎన్నికల్లో భారీ నేరపూరిత మోసానికి పాల్పడ్డాయని కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలపై కాషాయ పార్టీ ఎదురుదాడికి దిగింది. ఎన్నికల్లో అవకతవకల గురించి భారీ ప్రసంగాలు, నిరసనలు చేపడుతున్న కాంగ్రెస్ పార్టీ గతంలో ఎన్నో మోసాలకు పాల్పడిందని బీజేపీ నేత అమిత్ మాలవీయ అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత సోనియా గాంధీ భారత పౌరసత్వం పొందకముందే ఓటర్ల జాబితాలో ఆమె పేరు ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఈ విధంగా పౌరసత్వం లేని వారికి ఓటు హక్కు ఎలా కల్పించారో చెప్పాలని ప్రశ్నించారు. భారత ఓటర్ల జాబితాతో సోనియా గాంధీ పేరు చేర్చి అనేక ఉల్లంఘనలకు పాల్పడ్డారని మాలవీయ అన్నారు. ‘భారత పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందు ఎన్నికల జాబితాలో సోనియా గాంధీ పేరు ఉంది. అప్పటికి ఆమె ఇటలీ జాతీయురాలు. ఆ సమయంలో ఓటర్ల జాబితాలో ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీ, మేనకా గాంధీతో పాటు సోనియా గాంధీ పేరు కూడా చేర్చారు. ఈ విషయంపై 1982లో నిరసనలు వ్యక్తం కావడంతో ఆమె పేరు తొలగించారు. 1983 జనవరిలో తిరిగి చేర్చారు. ఆ ఏడాది ఏప్రిల్ 30న ఆమెకు భారత పౌరసత్వం మంజూరయింది. ఈ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ప్రవర్తించింది. పౌరసత్వం లేని సోనియా గాంధీ పేరును ఓటరు జాబితాలో చేర్చి ఎన్నికల ఉల్లంఘనలకు పాల్పడింది’ అని అమిత్ మాలవీయ ఆరోపించారు. దీనిపై కాంగ్రెస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

పాక్ కాల్పుల్లో భారత జవాను మృతి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని ఉరి సెక్టార్ సమీపంలో బుధవారం భారత్, పాకిస్థాన్ సైనిక దళాల మధ్య కాల్పులు జరిగాయి. నియంత్రణ రేఖ వద్ద జరిగిన కాల్పుల్లో ఓ భారత సైనికుడు మృతి చెందాడు. చొరబాటు యత్నాన్ని ఆపే సమయంలో ఈ ఘటన జరిగింది. ఆర్మీ వర్గాల వివరాల ప్రకారం... మంగళవారం రాత్రి కొందరు చొరబాటుకు ప్రయత్నించారు. చొరబాటుదారులకు అండగా పాకిస్థాన్ ఆర్మీ ఫైరింగ్ జరిపినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ బోర్డర్ యాక్షన్ టీమ్ ఈ ప్రయత్నానికి సహకరించినట్లు స్పష్టమవుతోంది. చొరబాటు జరిగే సమయంలో... ఎదురుకాల్పులు జరిగాయి. ఆ సమయంలో గాయపడ్డ జవాను ఆ తర్వాత ప్రాణాలు కోల్పోయాడు. అయితే వాతావరణం సరిగా లేకపోవడంతో చొరబాటుదారులు తప్పించుకున్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడింది.

విశాలాంధ్ర హైదరాబాద్

జనజీవనానికి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలి

భారీ వర్షాలపై ఆయా కలెక్టర్లతో మాట్లాడిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారీ వర్షాల వలన జనజీవనానికి ఆటంకం లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని రెవెన్యూ విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు మరో నాలుగు రోజుల పాటు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలకు అనుగుణంగా భారీ వర్షాల వలన ప్రజలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముంపు ప్రాంతాల్లో ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా విపత్తుల నిర్వహణా శాఖ ఆయా జిల్లాల్లో ఇరిగేషన్, విద్యుత్, పంచాయితీరాజ్, రహదారులు, పోలీస్ విభాగాలతో కలిసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్‌లు నిరంతరం పనిచేసేలా చూడాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పరిస్థితి గురించి ఆరా తీశారు. భారీ వర్షాలు కురుస్తున్న హనుమకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి తదితర జిల్లాలపై ఎక్కువ దృష్టి సారించాలన్నారు. ప్రజలతో నేరుగా సంబంధం ఉండే రెవెన్యూ విభాగం నిరంతరం పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలి. ప్రజాజీవనానికి ముఖ్యంగా రాకపోకలకు ఆటంకం లేకుండా చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఈనెల 20న జరిగే సిపిఐ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని పార్టీ మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శి బాల్ కిషన్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సురవరం వెంకటరామిరెడ్డి భవన్ సిపిఐ ఆఫీసులో ఈనెల 19 నుండి 22వ తేదీ వరకు మేడ్చల్ జిల్లాలో జరిగే సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలోని కొన్ని రాష్ట్రాలలో జరుగుతున్న ఎన్నికల ఓటర్ల జాబితాను తొలగించటం హాస్యాస్పదం మనీ అన్నారు. రాజ్యాంగ పరిధిలోని ఎన్నికల కమిషన్ స్వచ్ఛందంగా విధులు నిర్వహించవలసిన అవసరం ఉన్నప్పటికీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎన్నికల కమిషన్ పై ఒత్తిడి పెంచి ఓటర్ల జాబితాను తొలగించడం అన్యాయం అన్నారు. ఇప్పటికైనా అర్హులైన వారందరికీ ఓటర్లుగా గుర్తించి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కే.పద్మావతి, కొండపల్లి రాము, పి.సురేష్ పట్టణ కార్యదర్శి కోటకదిర నరసింహ జిల్లా కౌన్సిల్ సభ్యులు భార్గవి,చాంద్ భాషా, సత్యనారాయణ రెడ్డి, మెట్టు మహేష్, పట్టణ సహాయ కార్యదర్శి ఆనంద్, గంటల శ్రీను, సుందర్ రాజ్, ఇందిరక్క, పుష్ప, శ్రావణ్‌కుమార్, హనుమంత్, ఎస్ రమేష్, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

జలమండలిలో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్ర సామజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా చేపట్టిన 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమాన్ని జలమండలిలో బుధవారం నిర్వహించారు. జలమండలి ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఈడీ మయాంక్ మిట్టల్ హాజరై ఉద్యోగులతో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థ వినియోగం తీవ్రమైన సామాజిక, మానసిక, శారీరక సమస్యలకు దారితీస్తుందని, దీనిని ఎదుర్కోవడానికి అందరూ ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఎన్సీ, డైరెక్టర్ ఆపరేషన్స్-2 వీఎల్.ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్, ఫైనాన్స్ డైరెక్టర్ పద్మావతి, సీజీఎంలు జీఎంలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

సిపిఐ రాష్ట్ర సమితి మహాసభలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - ఎల్.బి.నగర్ : ఉప్పల్ మండల్ పరిధిలోని, నాగోల్ డివిజన్, కొత్త డివిజన్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ నాగోల్‌లోని ఎస్.ఏ.డాంగే భవన్‌లో బుధవారం గోడపత్రికను ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా నాయకులు బొడ్డుపల్లి కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎన్.డి.ఏ ప్రభుత్వం మోడీ నాయకత్వంలో దొంగ ఓట్లతో, దొంగ నోట్లతో, అధికారానికి ఎక్కి దేశ ప్రజలను, రైతులను, కార్మికులను, నిరుద్యోగులను, విద్యార్థులను, గాలికి వదిలేసిందన్నారు. ప్రస్తుతం పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తుందన్నారు. పార్లమెంటును మొత్తం వ్యాపారస్తులతో, పెట్టుబడులతో నింపేసిందని విమర్శించారు. 79 సంవత్సరాల స్వాతంత్ర భారతదేశంలో ప్రజాసేవ ప్రజా పాలన, శాసన వ్యవస్థ పరిపాలన వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. ప్రజల మనోభావాలను అవకాశంగా తీసుకొని మొన్నటి వరకు రామ మందిరం పేరుతో అధికారలోకి వచ్చి, నేడు అధికారాన్ని కాపాడుకోవడం కోసం సీతా మందిరం అంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఉడుతల మల్లేష్, కె.వెంకటేశ్వర్లు, పి.శివకుమార్, ఎస్.కార్తీక్, సిహెచ్.ఈశ్వర్, పి.మధు తదితరులు పాల్గొన్నారు.

జూలూరు మూసిని పరిశీలించిన రాచకొండ పోలీస్ కమిషనర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : హైదరాబాద్‌లో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల ప్రభావంతో మూసీ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం రాచకొండ పోలీస్ కమిషనర్ భూదాన్ పోచంపల్లి వద్ద ఉన్న జూలూరు మూసిలో లెవెల్ బ్రిడ్జి, సంగం బ్రిడ్జులను పరిశీలించారు. వరదనీరు ఎక్కువగా వచ్చే పరిస్థితుల్లో రహదారులను తాత్కాలికంగా మూసివేయాలని అధికారులను సూచించారు. అలాగే, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు అధికారులు పూర్తిగా సిద్ధంగా ఉండాలని తెలిపారు.

మిషన్ వాత్సల్య కార్యక్రమాలపై దృష్టి పెట్టాలి

మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రతి చిన్నారికి ఆరోగ్యకరమైన, సంతోషకరమైన బాల్యం అందించడానికి మిషన్ వాత్సల్య ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని మంత్రి సీతక్క సూచించారు. అలాగే జిల్లాల వారీగా సిబ్బంది నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అధ్యక్షతన బాలల హక్కుల కమిషన్ కార్యకలాపాలపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, సభ్యులు, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ సృజన, సంబంధిత అధికారులు హాజరయ్యారు. సమావేశంలో బాలల హక్కుల కమిషన్ ఏర్పాటైన నాటి నుండి ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలు, అమలు చేసిన చర్యలు, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి అవసరమైన వనరులపై చర్చ జరిగింది. జిల్లాస్థాయిలో మహిళా శిశు సంక్షేమ శాఖ నుండి మరింత సహకారం అందించాలని కమిషన్ విజ్ఞప్తి చేసింది. చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యుల నియామకానికి దరఖాస్తుల గడువు ఈనెల 8తో ముగిసినప్పటికీ ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో, గడువు పెంపు సాధ్యాసాధ్యాలను పరిశీలించి, న్యాయపరమైన సలహా తీసుకొని తగిన నిర్ణయం తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో బాలల హక్కుల కమిషన్ మరింత క్రియాశీలకంగా పని చేయడానికి మహిళా శిశు సంక్షేమశాఖ పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. నేటి బాలలే రేపటి తెలంగాణ భవిష్యత్తు పౌరులని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన "తెలంగాణ రైజింగ్-2047" లక్ష్య సాధనలో నేటి బాలలదే కీలకపాత్ర అని స్పష్టం చేశారు.

మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై విస్తృత అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధానికి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్చంద్రా రెడ్డి అధ్యక్షతన మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. బుధవారం మిషన్ పరివర్తన సామూహిక ప్రతిజ్ఞ కార్యకలాపం 13.8.2025 నషా ముక్త్ భారత్ అభియాన్ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి "మాదక ద్రవ్యాల అక్రమ రవాణా దుర్వినియోగం పై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని డ్రగ్స్ వాడకం వలన కలిగే దుష్పరిణామాల గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉండి, నాతోపాటు ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా కృషి చేస్తానని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు చేసే వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియ చేస్తానని, డ్రగ్ రహిత జీవనశైలిని అనుసరిస్తానని, డ్రగ్-రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామి నవుతానని" ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలపై చర్చించి, ఇకముందు చేపట్టవలసిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. మాదక ద్రవ్యాలు సేవిస్తే కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలలో అవగాహన పెంపొందించేం దుకు సామాజిక మాధ్యమాలతో పాటు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించు కోవాలని సూచించారు. డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండడంతో పాటు, తమ దృష్టికి వచ్చే నిషేధిత డ్రగ్స్ సరఫరా మరియు వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని తక్షణమే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, సంబంధిత అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో త్వరలో టూరిస్ట్ పోలీసులు: డిజిపి

విశాలాంధ్ర, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో టూరిస్టుల భద్రత కోసం త్వరలో టూరిస్ట్ పోలీసులను కేటాయించనట్లు రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్ వెల్లడించారు. తెలంగాణ టూరిజం శాఖ, పోలీస్ శాఖల మధ్య సమన్వయ సమావేశం బుధవారం డిజిపి కార్యాలయంలో జరిగింది. టూరిజం శాఖ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, శాంతి భద్రతల అడిషనల్ డిజిపిమహేష్ ఎం భగవత్, టూరిజం శాఖ ఎం.డి వి.క్రాంతి, ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎం.డి సిహెచ్.ప్రియాంక, ఇతర పోలీసు అధికారులు ఈ సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ తొలి దశలో టూరిజం శాఖకు అవసరమైన 80 మంది పోలీసు సిబ్బందిని త్వరలో కేటాయిస్తామని తెలియజేశారు. సెప్టెంబర్ 27వ తేదీన జరగనున్న వరల్డ్ టూరిజం డే సందర్భంగా టూరిస్ట్ పోలీసుల వ్యవస్థ సిద్ధం చేయాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న పర్యాటక ప్రాంతాలైన అనంతగిరి, సోమశిల, రామప్ప, యాదగిరి గుట్ట, పోచంపల్లి, నాగార్జునసాగర్, బుద్ధవనం, భద్రాచలం, అమ్రాబాద్ తదితర ప్రాంతాలలో టూరిస్ట్ పోలీసులు పని చేస్తారని అన్నారు. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి చెందేందుకు పోలీస్ శాఖ పర్యాటక శాఖకు పూర్తిగా సహకరిస్తుందని తెలిపారు. షూటింగ్ పర్మిషన్లు కోసం, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ కోసం పర్యాటక శాఖ విధి విధానాలను రూపొందించాలని డిజిపి సూచించారు. తద్వారా ఆయా కార్యక్రమాలకు భద్రత కల్పించడం పోలీస్ సిబ్బందికి సులభం అవుతుందని తెలిపారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి కోసం వివిధ కార్యక్రమాలను చేపట్టనునట్లు తెలిపారు. హైదరాబాద్ అడిషనల్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, మల్టీ జోన్ బి2 ఐజిపి తఫ్సీర్ ఇక్బాల్, సైబరాబాద్ జాయింట్ కమిషనర్ గజరావు భూపాల్, రాచకొండ డిసిపి ఇందిర, ఏఐజి రమణ కుమార్, తదితరులు సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు.

వంద మంది పేద విద్యార్థులకు ఉచితంగా ఇంజనీరింగ్ విద్య

విశాలాంధ్ర - హైదరాబాద్ : 100 మంది పేద విద్యార్థులకు నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యను ఉచితంగా అందిస్తున్నట్లు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్ నగర్ నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చదువుకోవాలని ఆసక్తి ఉండి, చదువుకోవడానికి స్తోమత లేని నిరుపేద విద్యార్థులకు ఉచితంగా మహబూబ్ నగర్ నగరంలోని జికె ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మేనేజ్మెంట్ కోటాలో 100 మంది విద్యార్థులకు ఉచితంగా ప్రవేశాలు కల్పించి, తన సొంత నిధులతో ఇంజనీరింగ్ విద్యను చదివించనున్నట్లు ఆయన తెలిపారు. మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషనల్ హబ్‌గా అభివృద్ధి చేయాలని 18 నెలలుగా పాజిటివ్ దృక్పథంతో పనిచేస్తున్నామని, అందులో భాగంగా పాలమూరు యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కాలేజ్, లా కళాశాలలను మంజూరు చేయించుకోవడం జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీస్సులతో మహబూబ్ నగర్‌కు ఐఐఐటి కళాశాల సైతం మంజూరు కావడం జరిగిందని, ఆలాగే మైనారిటీ విద్యార్థుల కోసం కూడా జికె ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ను ముఖ్యమంత్రిని ఒప్పించి మంజూరు చేయించడం జరిగిందని ఆయన తెలిపారు. మహబూబ్ నగర్ ను ఎడ్యుకేషనల్ హబ్, స్కిల్ డెవలప్మెంట్ హబ్ గా అభివృద్ధి చేయాలని తాను తాపత్రయం పడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, సిజె బెనహర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పేద ప్రజల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ నగరంలోని శిల్పారామంలో మహబూబ్ నగర్ నగరానికి చెందిన 3340 మంది లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ఒక్క రేషన్ కార్డు కూడా పేద ప్రజలకు గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం మన తెలంగాణా రాష్ట్రంలోనే రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని ఆయన గుర్తు చేశారు.

భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండండి, అత్యవసరం తప్పితే ఎవరు బయటకి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియచేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలిపారు. వాతావరణ శాఖ సూచనల మేరకు అప్రమత్రంగా ఉండలని ఎడతెరిపి లేకుండా కురుస్తున్నా భారీ వర్షాల కారణంగా ప్రజలు ప్రతి కాలనీ వాసులు, తమ ఇండ్ల నుంచి ఎవరు బయటకి రావొద్దు అని, అత్యవసరం తప్పితే ఎవరు బయటకి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ఇబ్బందులు కలిగిన, (ఎలక్ట్రికల్, రోడ్డు, డ్రైనేజీ, మంచి నీటి) సమస్యలు ఎదురైన, వెంటనే సంబంధిత అధికారులకు గాని, మాకు గాని, మా కార్యాలయంకు గాని సంప్రదించవల్సిందిగా ఆరెకపూడి గాంధీ తెలియచేసారు. కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని కాలనీవాసులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని, అదేవిధంగా వర్షాలను దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అధికారులు, హైడ్రా సిబ్బంది, మాన్ సున్ ఎమర్జెన్సీ టీమ్స్, డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండ చూడలని, ప్రజలు అభద్రతకు లోను కాకుండా ధైర్యంగా ఉండలని, వర్షాలు పడుతున్న సమయంలో ఇంటి నుండి బయటకి రాకుండా ఉండలని తప్పని పరిస్థితుల్లో బయటకి వస్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలని అదేవిధంగా అధికారులు గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతాలు, ప్రజలకు నిత్యం ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, ఎక్కడ ఏ సమస్య తలెత్తిన వెంటనే పరిష్కరించేలా చూడాలని అధికారులకు తెలియచేసారు. అధికారులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.

జీహెచ్ఎంసీ యంత్రాంగం హై అలర్ట్



విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అధిక వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు జీహెచ్ఎంసీ యంత్రాగం సర్వసన్నద్ధంగా ఉందని కమిషనర్ ఆర్‌వి కర్ణన్ తెలిపారు. బుధవారం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌లోని కంట్రోల్ రూంను కమిషనర్ తనిఖీ చేశారు. ఫిర్యాదులపై ఆరా తీశారు. కంట్రోల్ రూం కార్యకలాపాలను సమీక్షించారు. 24/7 అప్రమత్తంగా ఉండాలని కంట్రోల్ రూం సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో మోడరేట్ వర్షాలు కురుస్తున్నాయనీ, ఈరోజు సాయంత్రం నుండి అధిక వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ అప్రమత్తం చేసిందన్నారు. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ ఉద్యోగులకు సెలవులు రద్దు చేశామని చెప్పారు. ఉన్నత అధికారుల ను హెడ్ క్వార్టర్‌లో ఉండాలని ఆదేశించామన్నారు. ఇప్పటికే జోనల్ కమిషనర్‌లు, డిప్యూటీ కమిషనర్‌లు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని గమనిస్తూ అపసవ్యతలను చక్కదిద్దుతున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారని అన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు శిథిలావస్థకు చేరిన భవనాలలో నివాసం ఉంటున్న ప్రజలను ఖాళీ చేయిస్తున్నారు. పౌరుల ఫిర్యాదులపై స్పందించేందుకు, సహాయక కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో ప్రభావంతంగా చేపట్టేందుకు పోలీస్, హైడ్రా, విద్యుత్, జలమండలి, మెట్రో రైలు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నగరంలో వర్షాల నేపథ్యంలో ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. నగర ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దనీ కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మ్యాన్ హోల్ లను ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవవద్దు అని కమిషనర్ జీహెచ్ఎంసి, జలమండలి, హైడ్రా సిబ్బంది, ప్రజలకు సూచించారు. మ్యాన్ హోల్ పై ఏమైనా ఫిర్యాదులు ఉంటే జీహెచ్ఎంసి కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా కృషి చేస్తున్నామని చెప్పారు.

మూసారాంబాగ్ బ్రిడ్జి పనులు నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలి: కమిషనర్

నగరంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మూసి పరివాహక ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా , లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవార ఉదయం జీహెచ్ఎంసీ కమిషనర్ మూసారాంబాగ్, మలక్ పేట సర్కిల్‌ల పరిధిలో సంబంధిత డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్లు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పర్యటించారు. మూసారాంబాగ్ వంతెన సహా ప్రగతిలో ఉన్న నిర్మాణ పనులను పరిశీలించారు. మూసి వెంబడి ప్రయాణిస్తూ నీటి ప్రవాహ ఉధృతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అధికారులు తీసుకున్న ముందస్తు చర్యలు, జాగ్రత్తలను సమీక్షించారు. మూసారాంబాగ్ బ్రిడ్జి పనుల పురోగతిని పరిశీలించిన ఆయన, ట్రాఫిక్ సమస్యలు తగ్గించేందుకు ఈ ప్రాజెక్టు ఎంతో కీలకమని అన్నారు. టౌన్ ప్లానింగ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శాఖలు సమన్వయంతోభద్రత ప్రమాణాలు నిక్కచ్చిగా పాటిస్తూ, వర్షాకాలంలో కనెక్టివిటీని పెంచుతూ రవాణా సౌకర్యాలు మెరుగుపరిచే కీలక ప్రాజెక్టులను వేగవంతం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ అధికారులకు సూచించారు.

మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ఆరోగ్యానికి హానికరమైన మాదకద్రవ్యాలను నిరోధించుటకు ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా పిలుపునిచ్చారు. నషా ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జెఎల్‌బి హరిప్రియ, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాంమోహన్, జిల్లా సంక్షేమ అధికారి శారద, కమ్యూనిటీ ఎడుకేటర్ విజయ, వివిధ శాఖ సిబ్బందితో కలిసి అదనపు కలెక్టర్ మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా యువత పాటుపడాల మాదక ద్రవ్యాల నివారణపై జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని, డ్రగ్స్ తీసుకునే, అక్రమ రవాణా చేసే వారి గురించి తెలిసిన సమాచారాన్ని 1908 టోల్ ఫ్రీ నంబరుకు తెలియజేయాలని సూచించారు.

ఈనెల 19న జాబ్ మేళా

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్సిటీలోని ఎంప్లాయిమెంట్ బ్యూరో, మిత్రా ఏరిన ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈనెల 19న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నది. ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. మిత్రా ఏరిన ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ లోని సీనియర్ రిలేషన్షిప్ మేనేజర్ 40 పోస్టులను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు. డిగ్రీ చేసిన యువతి యువకులకు 18 నుండి 30 సంవత్సరాల వయసు వారికి మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ చీఫ్ ఒక ప్రకటనలో తెలియజేసింది. రూ.15,000 నుండి రూ.20,000 వేలవరకు వేతనం ఉండే ఈ సీనియర్ రిలేషన్షిప్ మేనేజర్ ఉద్యోగాలకు మరిన్ని వివరాలకు శిరీష ఫోన్ నెం.77998 84909ను సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు. విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ తో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో, వద్ద నేరుగా ఆగస్టు 19న హాజరు కావాలని ప్రకటనలో పేర్కొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించేందుకు నూతన సబ్ స్టేషన్లు

విశాలాంధ్ర - పటాన్ చెరువు : పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన, నాణ్య మైన విద్యుత్ అందించేందుకు నూతన సబ్ స్టేషన్లు నిర్మిస్తున్నామని పటాన్ చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్ చెరువు డివిజన్ పరిధిలోని సింఫని కాలనీలో 6 కోట్ల 50 లక్షల రూపాయలతో నిర్మించ తలపెట్టిన 33/11 కెవి ఇండోర్ సబ్ స్టేషన్, తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పోచారంలో 3 కోట్ల 50 లక్షల రూపాయలతో నిర్మించ తలపెట్టిన సబ్టేషన్ పనులకు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పటాన్ చెరువు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలతో పాటు పల్లెలు పట్టణాలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వంతో చర్చించి నూతన సబ్ స్టేషన్లు మంజూరు చేయించు కోవడం జరుగుతోందని తెలిపారు. నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్ అందించేందుకు సబ్ స్టేషన్లతోపాటు విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, ట్రాన్స్కో డి ఈ భాస్కరరావు, ఏడి సంజయ్, సీనియర్ నాయకులు అంతి రెడ్డి, బిక్షపతి, కోడూరు బిక్షపతి, బండి శంకర్, రామచందర్, దుర్గారెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ గృహాలు కేటాయించాలి

విశాలాంధ్ర - జవహర్ నగర్ : జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బుధవారం సిపిఐ రాష్ట్ర 4వ మహా సభలు గాజుల రామారంలో జరుగుతున్న నేపథ్యంలో సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం జవహర్‌నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న పేదలకు కొద్ది మంది మాత్రమే డబల్ బెడ్ రూములు అందాయని మిగతా అర్హులైన పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి డబల్ బెడ్ రూములు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర 4వ మహాసభల విజయవంతం చేయాలని పార్టీ ప్రజలంతా ఆదరించాలని శ్రేణులు మరింత నూతన ఉత్సాహంతో విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నరసింహులు, రాష్ట్ర నాయకులు రవిచంద్ర, కప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, ఆల్వాల్ మండల కార్యదర్శి అమరావతి బాబు, రైస్ సంగం జిల్లా అధ్యక్షులు డి జంగయ్య, గిరిజన సమైక్య ప్రధాన కార్యదర్శి స్వరూప, కీసర మండల సిపిఐ సహాయ కార్యదర్శి వి రవి నాయక్, మండల అధ్యక్షులు ఏఐటియుసి అంబాల ఎల్లయ్య, కాప్రా మండల సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, మహిళా సమైక్య అధ్యక్షురాలు కోదాసు జయమ్మ, సిపిఐ నాయకులు కే గంగారాం, పి నరసింహ, చంద్రయ్య,ఎస్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఏర్పాటుచేసిన బృందాలకు సూచించారు. బుధవారం లంగర్‌హౌస్‌లోని బాపు ఘాట్ వద్ద మూసీ నదిని అదనపు కలెక్టర్ జి. ముకుందరెడ్డితో కలిసి వరద ఉధృతిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగరంలో లోతట్టు ప్రాంతాలతో పాటు మూసి పరివాహక ప్రాంత ప్రజలను బృందాలు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని అలాగే జీహెచ్‌ఎంసి, హైడ్రా, పోలీస్ అధికారులతో కలిసి పని చేయాలని ఆమె సూచించారు. నగరంలో ఎక్కడైనా సమస్యలు ఉన్నట్లయితే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 040 23202813, 7416687878 కి కాల్ చేసి సమస్యలను తెలియచేసి అధికారులతో నివృత్తి చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీ కాలనీలో రూ. 97.00 లక్షల రూపాయలతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణం పనులకు కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గం మరియు కాలనీల అభివృద్దే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం ఎంఐజీ కాలనీలో రూ.97 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, కాలనీ వాసులకు ఉపశమనం లభించింది అని, మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తానని అన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, సీసీ రోడ్లు వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని, ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని, అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని గాంధీ చెప్పడం జరిగినది. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించడం జరిగింది. నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు,మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సన్ ఫీస్ట్ డార్క్ ఫాంటసీ నూతన యాడ్ ఫిలిం ఆవిష్కరణ

విశాలాంధ్ర - హైదరాబాద్: మన రోజూవారీ లంచ్ దినచర్యల్లో తీపి లోటును గుర్తించి, సన్ ఫీస్ట్ డార్క్ ఫాంటసీ హృదయాన్ని తాకే కొత్త యాడ్ ఫిల్మ్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా ఐటీసీ లిమిటెడ్ ఫుడ్స్ డివిజన్ బిస్కట్స్, కేక్స్ క్లస్టర్ విభాగ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అలీ హర్రిస్ షేర్ మాట్లాడుతూ కంపెనీ వారి 'హర్ టిఫిన్‌కి స్వీట్ ఎండింగ్' కాంపైన్‌లో భాగంగా షా రుఖ్ ఖాన్‌ను ఈ యాడ్ చూపిస్తుందన్నారు. ఇంట్లో లేదా రెస్టారెంట్లలో భోజనాలు తరచుగా డిజర్ట్‌తో ముగుస్తుందని, టిఫిన్‌లో డిజర్ట్ ఉండటం చాలా అరుదు అని సంబంధిత అవగాహన పొందుతూ బ్రాండ్ 'హర్ టిఫిన్‌కి స్వీట్ ఎండింగ్'ని పరిచయం చేసింది ఈ కొత్త ఫిల్మ్ రోజూవారీ తల్లిదండ్రుల ప్రేమను, డార్క్ ఫాంటసీని నిర్వచించే ఆహ్లాదకరమైన వినోదంతో అద్భుతంగా అల్లుకుందని అన్నారు. జీవిత కథనంలో, మనం షారూఖ్ ఖాన్ ను తండ్రి పాత్రలో తన కొడుకుతో కలిసి తమ టిఫెన్ లో డార్క్ ఫాంటసీ కుక్కీని రహస్యంగా పెట్టడం చూస్తామని, అయితే అమ్మ వారి కంటే ముందడుగులో ఉందని గ్రహిస్తారన్నారు. ఈ ఫిల్మ్ కనక్షన్ మరియు ఆనందాల ఈ చిన్న క్షణాలను సంబరం చేస్తుంది, డార్క్ ఫాంటసీతో తియ్యని ముగింపుకు ఎల్లప్పుడూ హామీ చేకూరుతుందని ఇది బలపరుస్తోందన్నారు. తమ సిగ్నేచర్ మోల్టెన్ చాకో ఫిల్లింగ్ స్మార్ట్, సింగిల్ సర్వ్ ప్యాకేజింగ్‌తో డార్క్ ఫాంటసీ చాకో ఫిల్స్ ఆధునిక రోజుల టిఫిన్ కోసం రూపొందించబడిందన్నారు. ఇది తీపి తిన్నాలని కోరికను సంతృప్తి పరచడమే కాకుండా స్కూల్‌కు వెళ్లే పిల్లలకైనా లేదా కార్యాలయాలకు వెళ్లే ప్రొఫెషనల్స్ కోసమైనా లంచ్ విరామాలకు ఆనందకరమైన ఆశ్చర్యాలను కూడా చేరుస్తుందన్నారు. "సన్ ఫీస్ట్ డార్క్ ఫాంటసీలో, రోజూవారీ క్షణాల్లోకి లాలసత్వం తీసుకురావడానికి మేము గణనీయమైన పద్ధతుల కోసం తాము ఎల్లప్పుడూ అన్వేషిస్తుంటాం అని, ఈ కాంపైన్‌తో షారుఖ్ ఖాన్ ఈ అందమైన రుచికరమైన కథకు ఉదాహరణగా భాగస్వామిగా ఉండటం ఎంతో ఉపయుక్తమన్నారు. డార్క్ ఫాంటసీతో పని చేయడం అంటే ఆ ట్రీట్‌లో లీనమవడం అని ఎఫ్సీ ఉల్కా నేషనల్ క్రియేటివ్ డైరెక్టర్ సుచిత్ర గహ్లోట్ తెలిపారు.

విద్యార్థుల అసెంబ్లీ పర్యటన

విశాలాంధ్ర, బషీర్ బాగ్: విద్యార్థులకు శాసన ప్రక్రియపై ప్రత్యక్ష అనుభవం కల్పించే లక్ష్యంతో అర్థశాస్త్ర ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర శాసనసభకు క్షేత్ర పర్యటనను నిర్వహించినట్లు సీనియర్ ఫ్యాకల్టీ సతీష్ పెండ్యాల, సీనియర్ ఫ్యాకల్టీ అలేఖ్య నాగమోతు తెలిపారు. శాసన వ్యవస్థ, విధానాలు, ప్రజాస్వామ్యంలో శాసనసభ పాత్రపై అవగాహన పెంచే ఉద్దేశ్యంతో వారు విద్యార్థులతో ప్రత్యేక చర్చలు నిర్వహించి అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి విద్యార్థులకు ఈ ప్రత్యేక అవకాశం కల్పించడానికి సహకరించిన తెలంగాణ శాసనసభ కార్యదర్శి నరసింహ చార్యులు కు అర్థశాస్త్ర ఐఏఎస్ అకాడమీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.తరగతి గదిలో పాఠాలు నేర్చుకోవడం ఎంత ముఖ్యమో, శాసనసభను ప్రత్యక్షంగా చూడడం ద్వారా విద్యార్థులు సిద్ధాంతాన్ని వాస్తవ అనుభవంతో మిళితం చేసుకోవచ్చన్నారు. ఇది భవిష్యత్ సివిల్ సర్వెంట్స్ ఎగ్జామ్స్ కు సన్నద్ధం అయ్యే వారికి సువర్ణ అవకాశమన్నారు.ఈ కార్యక్రమం ద్వారా అర్థశాస్త్ర ఐఏఎస్ అకాడమీ, అనుభవాధారిత విద్య, పౌర అవగాహన, ప్రజాసేవలో విజయానికి కావలసిన నైపుణ్యాల పెంపునకు దోహదపడుతుందన్నారు. విద్యార్థులు శాసనసభలో జరిగే చర్చలు, నిర్ణయ ప్రక్రియలు, విధానాల రూపకల్పనపై సమగ్ర అవగాహన పొందుతారని తెలిపారు. సందీప్ మహాజనతో పాటు ప్రముఖ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర - మొయినాబాద్ : మొయినాబాద్ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారిణి ఉషా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీలర్లు రైతులకు ఎమ్మార్పీకి మించి ఎరువులు అమ్మినా, యూరియాకు వేరే ఎరువులు లింక్ చేసి అమ్మినా, కృత్రిమ కొరత సృష్టించాలని చూసినా కేసులు నమోదు చేసి, లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారిణి అనురాధ, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా, డ్రగ్ కంపెనీలు ప్రమాణాలు పాటించాలి

మంత్రి కొండా సురేఖ

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలోని పర్యావరణాన్ని పరిరక్షించే ప్రక్రియలో ఫార్మా, డ్రగ్ కంపెనీలు... ప్రమాణాలు పాటించాలని తెలంగాణ అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. బుధవారం సెక్రటేరియట్‌లో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫార్మా, బల్క్ డ్రగ్ పరిశ్రమల అనుమతుల విషయంలో అవకతవకలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ ముందు ఉన్న కేసులకు సంబంధించిన వివరాల ను మంత్రికి పీసీబీ అధికారులు వివరించారు. సీపీసీబీ (సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు)కి అందిన ఫిర్యాదుల వివరాలు కూడా అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో సెక్రటేరియట్‌లో బుధవారం ఫారెస్టు మినిస్టర్ ఛాంబర్‌లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. కాగా, ఈ సమావేశానికి హాజరైన అటవీ, పర్యావరణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీం, పీసీబీ మెంబర్ సెక్రటరీ రవి, సీఈ రఘు, శ్రీనివాసరెడ్డి, నాగేశ్వర రావు, వెంకన్న, రవిశంకర్, పోచంపల్లి, చౌటుప్పల్, చిట్యాల నుంచి పరిశ్రల ప్రతినిధులు సైతం పాల్గొన్నారు. కాగా, అనుమతులు లేని, అనుమతుల టైం అయిపోయిన కంపెనీలను ఎన్నిసార్లు రైడ్స్ చేశారో స్థానికంగా గ్రౌండ్ వాటర్ కలుషితం అవుతున్న స్టేటస్ చెక్ చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఎంతటి వారైనా పర్యావరణ పరిరక్షణ ఉల్లంఘిస్తే ఊరుకునేది లేదని అధికారులకు స్పష్టం చేశారు. ఆ టాస్క్ ఫోర్స్ కమిటీలో ఒక ఐఏఎస్ ఆఫీసర్, ఒక ఐపీఎస్ ఆఫీసర్, ఫారెస్ట్ అధికారులు, రెవెన్యూ అధికారులు, ఎన్విరాన్మెంటల్ పరిరక్ష కులు, సెంట్రల్ పిసిబి అధికారులు కూడా ఇందులో చేర్చి ఉన్నత స్థాయి కమిటీని వేస్తామని స్పష్టం చేశారు. అయితే, ప్రతి ఆరు నెలలకి ఒకసారి ఇన్‌స్పెక్షన్ చేస్తున్నట్టు మంత్రి సురేఖకి పీసీబీ మెంబర్ సెక్రటరీ జి.రవి వివరించారు. జనావాసాలున్న చోట ఫార్మా, బల్క్ డ్రగ్ కంపెనీలు వాటిని స్థానచలనం చేసేందుకు కసరత్తు చేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా ఔటర్ రింగు రోడ్డు అవతలనే ఫార్మా కంపెనీలుండాలని చెప్పారని... ఆ మేరకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి గుర్తు చేశారు. పొల్యూషన్ కంట్రోల్ ప్రమాణాలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయితే, చాలా ముఖ్యమైన సమావేశానికి కొన్ని కంపెనీ ప్రతినిధులు రాకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఇంతటి ముఖ్యమైన సమావేశానికి ఆయా కంపెనీలు వారి సంస్థల్లోని చిన్న చితకా ఉద్యోగులను పంపడం సరికాదన్నారు. పర్యావరణ శాఖ మంత్రి అనే చైర్ కి గౌరవం ఇవ్వాల్సి అనివార్యత ఉందన్న విషయం గుర్తించాలన్నారు. కంపెనీలకు అనుమతుల్లో ఉదాశీనత సరికాదని పీసీబీ అధికారులను హెచ్చరించారు. చౌటుప్పల్ ఏరియా నుంచి పర్యావరణ పరిరక్షణ, నీటి కలుషితం మీద విపరీతమైన ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వాటిపై చాలా కఠినంగా ఉంటామని స్పష్టం చేశారు. నిబంధనలు, ప్రమాణాల మేరకు చర్యలు తీసుకుంటనే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్నారు. నీటి కలుషితం కూడా తగ్గుతుందని వివరించారు.

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు ఘనంగా ఉండాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : స్వతంత్ర దినోత్సవ ఏర్పాట్లు ఘనంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. బుధవారం గోల్కొండ కోటను సందర్శించి వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లను ఉన్నత అధికారులతో కలిసి ఆయన సమీక్షించారు. చారిత్రక గోల్కొండ కోటలో రాష్ట్ర ముఖ్యమంత్రిచే జాతీయ జెండా ఆవిష్కరణ, పోలీసుల గౌరవ వందనం అలాగే అభివృద్ధి సంక్షేమ పథకాల సందేశం తదితరాంశాలపై సమీక్షించి వేడుకల తుది ఏర్పాట్లను ఉన్నత అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అతిథులకు ఎక్కడ కూడా ఇబ్బందులు అసౌకర్యం కలగకుండా వేడుకలు అత్యంత ఘనంగా, గౌరవప్రదంగా నిర్వహించబడాలని, ముఖ్యంగా ప్రోటోకాల్, భద్రత, ప్రజల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రతిభావంతమైన పోలీసు సిబ్బందికి పతకాలు ప్రదానం చేసే కార్యక్రమం, గార్డ్ ఆఫ్ ఆనర్, మార్చ్ పాస్ట్ తీరును సమీక్షించారు. వాతావరణ సూచనల ప్రకారం వర్షాల నేపథ్యంలో అదిశగా ప్రాధాన్యత ఇవ్వాలని, వాటర్‌ప్రూఫ్ షెడ్లు, మెడికల్ క్యాంపులు, గ్యాలరీలు, సీటింగ్ కెపాసిటీ, బారికెట్స్ అలాగే వాటర్‌ప్రూఫ్ జనరేటర్, పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్స్, ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాట్ల పై సంబంధిత అధికారులరు సీఎస్ కి వివరించారు. నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీటి అందుబాటు, పారిశుధ్యం, వైద్య సిబ్బంది, ఫస్ట్ ఎయిడ్ సదుపాయాలు అందుబాటులో ఉండాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు. విద్యుత్, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, రెవెన్యూ, వైద్య, ఆరోగ్య శాఖల అధికారులు తమ ఏర్పాట్లు పూర్తయ్యాయని నివేదించారు. వేడుకలు ఎటువంటి అంతరాయం లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు, అడిషనల్ సీపీ విక్రమ్ సింగ్ మాన్, డిజిపి డాక్టర్ జితేందర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, ఐఅండ్‌పిఆర్ కమిషనర్ సి.హెచ్ ప్రియాంక, అదనపు డీజీపీ మహేష్ భగవత్ పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనం ఏర్పాట్లపై సమీక్ష సమావేశం

విశాలాంధ్ర - హైదరాబాద్ : జిహెచ్‌ఎంసి సికింద్రాబాద్ జోన్ పరిధిలో గణేష్ నిమజ్జనం ఏర్పాట్లపై జోనల్ కమిషనర్ ఎన్.రవి కిరణ్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిమజ్జన మార్గాలు, రోడ్లు గుంతల రహితంగా ఉండేలా, ఎక్కడ రోడ్ కట్టింగ్ లేకుండా చూడాలని సూచించారు. గణేష్ నిమజ్జనం కోసం చేపడుతున్న పనుల సమీక్ష చేసి, చెరువుల ఏర్పాట్ల కోసం కార్మికుల నియామకం చేసి చెరువుల్లో నీటి నింపే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు, చెరువుల జాబితా పూర్తి చేయాలని ఆదేశించారు. గణేష్ సంప్రదాయాలను తెలిసిన క్రేన్ల ఆపరేటర్లతో స్టాటిక్ క్రేన్లను, పోలీస్‌స్టేషన్‌ల వారీగా మొబైల్ క్రేన్లను సిటీఓ సమన్వయం చేయాలని సూచించారు. రోడ్లపై, తాత్కాలిక చెరువుల వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని ఈఈ (ఎలక్ట్రికల్) విభాగానికి ఆదేశాలు జారీ చేశారు. నిమజ్జన మార్గాల్లో చెట్ల కొమ్మల తొలగింపు, స్పాట్ క్లియరెన్స్ చేసి ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల వరకు శుభ్రపరిచే పనులు చేపట్టాలని చెప్పారు. గణేష్ మండపాల విషయంలో నిర్వాహకులు ఫోన్ నంబర్లను పోలీసుల కు, డీసీలకు అందజేయడం, వ్యర్థాల నిల్వ ఏర్పాట్లు చేసి జిహెచ్‌ఎంసి వాహనాలతో సమన్వయం చేయడం, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడం, చిన్న అగ్ని నిరోధక పరికరాలు సిద్ధంగా ఉంచడం, పేపర్ షాట్స్ వాడకాన్ని తగ్గించడం వంటి సూచనలు చేశారు. అదనపు డీసీపీ సి.వెంకట గోపాల్ రెడ్డి, ఏసీపీ ట్రాఫిక్ జి.శంకర్ రాజు, జాయింట్ సీఈఓ కాంటోన్మెంట్ పల్లవి విజయవంశీ, ఎస్ఈ డి.ఆశలత, సిటీ ప్లానర్ శ్రీనివాస్, డీడీ అనిల్, జోనల్ సిటిఓ శ్రీనివాస్, 15 సర్కిల్ ఉప కమీషనర్ పి.రమంజులారెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - కాప్రా : కుత్బుల్లాపూర్, షాపూర్ నగర్ మహారాజా ఫంక్షన్ లో జరగనున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర 4వ మహాసభలు ఈనెల 19 నుంచి 22 తేదీ వరకు నాలుగు రోజులు పాటు ఘనంగా జరగనున్నాయని,మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ లోని సీపీఐ కార్యాలయం నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ నుండి ప్రచార రథాన్ని జెండా ఊపి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జీ. దామోదర్ రెడ్డి ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజుల పాటు తిరగనున్న ప్రచార రథం మొదటి రోజు ఉప్పల్ నియోజకవర్గంలోని ఈసీఐఎల్, కుషాయిగూడ,చర్లపల్లి, ఏఎస్ రావు నగర్, హెచ్ బీ కాలనీ, అశోక్ నగర్, మల్లాపూర్, నాచారం,హబ్సిగూడ, ఉప్పల్, రామంతపూర్, చిలుకానగర్ ప్రాంతాల్లోని అన్ని కాలనీలలో ప్రచారం సాగుతోందన్నారు. ఈ సందర్భంగా లిసీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జీ. దామోదర్ రెడ్డిలి మాట్లాడుతూ వ్యవస్థలన్నింటినీ గుప్పెట్లో పెట్టుకొని మోదీ సర్కారు పాలన సాగిస్తోందని వారు విమర్శించారు. ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా దొంగ ఓట్లు... దొంగ నోట్లతో అధికారాన్ని కైవసం చేసుకుంటుందని మండిపడ్డారు. 140 కోట్ల జనాభా గల భారతదేశంలో వేలాది కులాలు, మతాలు, భాషలు ఉన్నాయని, కానీ మతోన్మాదులు మాత్రం హిందుత్వాన్ని పాటించాలని ప్రజలను బెదిరిస్తున్నారన్నారు. దొంగ ఓట్లపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బయటపెట్టిన ఆధారాలకు ఈసీ సమాధానం చెప్పాలని నిలదీశారు. కమ్యూనిస్టులుగా రాబోవు రోజుల్లో ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ రాష్ట్ర మహాసభల్లో అనేక తీర్మానాలు చేసి ఉద్యమాలకు శ్రీకారం చుడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టి. సత్య ప్రసాద్, సీపీఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు నారా నర్సింహా, సాయిలు, కిరణ్, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నేతలు మహేష్, సుధీర్, అరుణ్ పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రాబోయే 72 గంటలలో భారీ వర్ష సూచన హెచ్చరికతో బుధవారం మధ్యాహ్నం బోడుప్పల్ కమీషనర్ ఎ. శైలజా ఆధ్వర్యములో సంబంధిత అధికారులు పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, హెల్త్, హైడ్రా అధికారులతో ప్రత్యేక అత్యవసర సమావేశం మున్సిపల్ మీటింగ్ హాల్ యందు ఏర్పాటు చేయనైనది. ఈ కార్యక్రమంలో నీటి ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ముందు జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించడం, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం అందించడం, ప్రమాద ప్రాంతాల గుర్తింపుపై సమావేశంలో చర్చ జరిగింది. అదే విధంగా కార్యాలయంలో ఎమర్జెన్సీ అత్యవసర ముగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనైనది. కంట్రోల్ రూమ్ నెంబర్ :040-27215959 ను సంప్రదించగలరని కోరనైనది. ఇట్టి సమావేశంలో రెవెన్యూ శాఖ నుండి మేడిపల్లి మండలం తహసీల్దార్ హసీనా, పోలీస్ శాఖ నుండి ఇన్స్పెక్టర్ గోవింద రెడ్డి, ఇరిగేషన్ శాఖ నుండి అసిస్టెంట్ ఇంజనీర్ పరమేష్, హెల్త్ డిపార్ట్మెంట్ నుండి బోడుప్పల్ మెడికల్ ఆఫీసర్ ప్రణీత్, హైడ్రా అధికారులు, అసిస్టెంట్ మునిసిపల్ కమీషనర్ శ్యామ్ సుందర్‌రావు, మున్సిపల్ అధికారులు, వార్డ్ ఆఫీసర్స్, వార్డ్ సూపర్ వైజర్స్ పాల్గొన్నారు.

వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



విశాలాంధ్ర-దుండిగల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండా లని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ పేర్కొన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ కౌన్సిల్ హాల్ నందు రానున్న 2 రోజుల్లో అధిక వర్షాభావం ఉన్నందువల్ల ముందస్తుగా చేపట్టవలసిన చర్యలపై పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ట్రాఫిక్, ఎలక్ట్రికల్, ఇరిగేషన్ మొదలగు డిపార్ట్మెంట్‌ల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా చెరువులు, ఎఫ్ టి ఎల్ లెవెల్ ఎప్పటికప్పుడు చూసుకోవాలని, చెరువు కట్టలు తెగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపైన, ఎక్కువ వర్షాలు ఉన్నప్పుడు గాలికి కరెంటు తీగలు, స్తంభాలు తెగిపడుతుంటాయి. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలని చర్చించుకున్నారు. గండి మైసమ్మ తాసిల్దార్ సయ్యద్ అబ్దుల్ మతిన్, జీడిమెట్ల ట్రాఫిక్ ఏసీపి, ట్రాఫిక్ సిఐ, పోలీస్ స్టేషన్ దుండిగల్ సిఐ,దొమ్మర పోచంపల్లి ఎలక్ట్రికల్ ఇంజనీర్, గండి మైసమ్మ ఇరిగేషన్ ఏఈ, మున్సిపల్ వార్డ్ ఆఫీసర్స్,మున్సిపల్ స్టాఫ్ పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్ లైన్లను మార్చాలి

విశాలాంధ్ర - కాప్రా : మల్లాపూర్ డివిజన్ దుర్గా నగర్ లోని గత 25 సంవత్సరాల క్రితం వేసిన డ్రైనేజ్ పైపుల వల్ల మురికి నీరు రోడ్డుపై పొంగి ప్రవహిస్తున్నాయని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని దుర్గ నగర్ కాలనీవాసులు బుధవారం హెచ్‌ఎండబ్ల్యూ ఎస్ అధికారులను కలిసి వినతిపత్రం ఇచ్చారు. నిత్యం రోడ్డుపై మురుకునీరు ప్రవహిస్తుందని దానివల్ల రోడ్డు మొత్తం గుంతల మయంగా తయారైందని అటు నుంచి వెళ్లేవారికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. చుట్టుపక్కల ఇళ్లల్లో దుర్వాసన, దోమలు ఈగలు వృద్ధి చెందడంతో అనారోగ్య బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండ్ల మధ్యలో ఉన్న చిన్న గల్లీలో పైప్లైన్ సరిగ్గా వేయకపోవడం వల్ల రోడ్డుపై మురికి నీరు వస్తున్నాయని పలుమార్లు అధికారులకు, నాయకులకు దృష్టికి తీసుకువెళ్లిన నిమ్మకు నీరెత్తినట్టు వహరిస్తున్నారని వారు మండిపడ్డారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని లేనిచో రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని వారు అధికారులను హెచ్చరించారు. కాలనీవాసులు కలగా సర్వేశ్, నర్సింగ్, లింగమ్మ, వెంకటేష్, సాయిలు, అండాలు, వసంత, స్వామి పాల్గొన్నారు.

వైయస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసిన సాతల గోపాల్

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: ఆంధ్రప్రదేశ్ అధికార ప్రతినిధి ఆరే శ్యామల ఆదేశాల మేరకు సాతల గోపాల్ తాడేపల్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం వైయస్సార్సీపి నాయకులు తెలంగాణ రాష్ట్రంలో వైఎస్ఆర్ పార్టీని ప్రారంభించాలని ఆయన అభిమానిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోతిరెడ్డి, రామ్ భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆపన్న హస్తం సీఎంఆర్ఎఫ్

విశాలాంధ్ర - పటాన్ చెరువు : ఆపద కాలంలో మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని పటాన్ చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరువు నియోజకవర్గం ఇస్నాపూర్ గ్రామానికి చెందిన కంచర్ల శోభ, గుమ్మడి దల గ్రామానికి చెందిన మహేష్ యాదవ్‌లు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం స్థానిక ఎమ్మెల్యే జిఎంఆర్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు కంచర్ల శోభ వైద్య చికిత్స నిమిత్తం ఐదు లక్షల రూపాయలు, మహేష్ యాదవ్ చికిత్స నిమిత్తం రెండు లక్షల 50వేల రూపాయలు ఎల్ఓసిలు మంజూరయ్యాయి. బుధవారం క్యాంపు కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే జిఎంఆర్ ఎల్ఓసిలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎల్ఓసిలతో పాటు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పారదర్శకంగా పంపిణీ చేస్తున్నమని తెలిపారు.

వినాయకుని మండపం నిర్మించాలి

విశాలాంధ్ర- దుండిగల్: నియోజకవర్గం 125 డివిజన్ కైసర్ నగర్‌లోని 2 బి హెచ్ కే డబల్ బెడ్ రూమ్స్ యువ నాయకులు బుధవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి రానున్న వినాయక చవితి ఉత్సవాల్లో వినాయకుని నూతన మండపం నిర్మించాలని విన్నవించారు. కొలను హన్మంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి పూర్తి చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం డబల్ బెడ్ రూమ్స్ వాసులు కొలను హన్మంత్ రెడ్డిని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, ఆలి భాయ్, యాదగిరి, రాజు,వినయ్, సునీల్, సాగర్, డేవిడ్, సాయి, మదన్, శ్రీనివాస్, తేజ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే ఏకాగ్రత సాధ్యం

విశాలాంధ్ర - పటాన్ చెరువు : ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ఆధ్యాత్మిక భక్తి భావంతో యువతకు సాధించాలనే ఏకాగ్రత సైతం పెంపొందుతుందని అమీన్పూర్ యువ నాయకులు తుమ్మల రుష్వంత్ రెడ్డి స్పష్టం బుధవారం అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని మాధవపురి హిల్స్ కాలనీలో గల శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయం ప్రథమ వార్షికోత్సవంలో అమీన్పూర్ యువ నాయకులు తుమ్మల రుష్వంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం స్థానికంగా నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రుష్వంత్‌రెడ్డి మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి స్థానిక మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని తెలిపారు. ప్రతి ఆలయంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆలయ సభ్యులు ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తుమ్మల సునీత పాండురంగారెడ్డి, తుమ్మల ప్రసన్న ప్రతాపరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక మాజీ కౌన్సిలర్ మహదేవరెడ్డి, ఆలయ నిర్వాహకులు, పాల్గొన్నారు.

కల్వర్టుల నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్

శేరిలింగంపల్లి - విశాలాంధ్ర : మియాపూర్ డివిజన్ పరిధిలోని బొల్లారం మెయిన్ రోడ్‌లో శ్రీ సత్యలక్ష్మి నగర్ కాలనీ, మయూరి నగర్ కాలనీ, హెడిఎఫ్సి బ్యాంక్ హై టెన్షన్ లైన్ కింద నూతనంగా నాల మీద కల్వర్టుల నిర్మాణం చేపట్టే పరిసర ప్రాంతాలను హెచ్‌ఎండిఏ అధికారులు, జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు, జలమండలి అధికారులతో కలిసి మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ మియాపూర్ డివిజన్ అభివృద్ధిలో భాగంగా నాలల మీద కల్వర్టుల నిర్మాణం చేపట్టే పరిసర ప్రాంతాలను హెచ్‌ఎండిఏ అధికారులు, జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు, జలమండలి అధికారులతో కలిసి పర్యటించి పరిశీలించడం జరిగినదని, ఎన్నో ఏండ్ల సమస్య కల్వర్టుల నిర్మాణం ద్వారా తీరునని, మియాపూర్ నుండి ప్రయాణించే ప్రయాణికులకు ఎంతో ఉపశమనం కలుగునని, మియాపూర్ డివిజన్ అభివృద్ధి కొరకై పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ సహకారంతో డివిజన్ పరిధిలో మంజూరైనటువంటి పనులను విడతల వారీగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. హెచ్‌ఎండిఏ డిఈ విద్యాసాగర్, ఏఈ ఆశిష్, జెఈ ఐకె రెడ్డి, ఇంజనీరింగ్ విభాగం డిఈ దుర్గా ప్రసాద్, జలమండలి డిజిఎం నారాయణ, మేనేజర్ సునీత, వర్కిన్స్పెక్టర్లు నవీన్, లింగయ్య, హర్షద్ పాల్గొన్నారు.

అగ్రసేన్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

విశాలాంధ్ర, బషీర్ బాగ్ : అగ్రసేన్ జయంతిని ఘనంగా నిర్వహించడంతో పాటు సభ్యత్వ నమోదుపై విస్తృత ప్రచారం చేయాలని అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా అన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025-27 కాలానికి కేంద్ర కమిటీ సభ్యులు, శాఖల ఆఫీస్ బేరర్ల రెండవ ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఈ నెల 14న గురువారం సాయంత్రం 7 గంటలకు సికింద్రాబాద్ ప్యారడైజ్‌లోని అగర్వాల్ సమాజ్ బాంక్వెట్ హాల్‌లో జరుగుతుందని చెప్పారు. కేంద్ర కమిటీ, మొదటి ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో ఆమోదించిన విధంగా, సభ్యత్వ రుసుమును ఒక్కొక్కరికి రూ.350 నుండి 2 సంవత్సరాలకు రూ.21 కు తగ్గించడం, ఆ తర్వాత సభ్యత్వ రుసుమును మార్చడానికి, నిర్ణయించడానికి కేంద్ర కమిటీకి అధికారం ఇవ్వడంపై చర్చ జరుగుతుందని వివరించారు. కేంద్ర కమిటీ మొదటి ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో ఆమోదించిన విధంగా అగర్వాల్ సమాజ్ ఎన్నికలలో సెంట్రల్ పదవీ విరమణ చేస్తున్న అధ్యక్షుడు, మాజీ అధ్యక్షుడికి శాఖల పదవీ విరమణ చేస్తున్న అధ్యక్షుడికి ఓటు హక్కు కల్పించడంపై చర్చిస్తామన్నారు.

హిమాయత్‌సాగర్ రిజర్వాయర్ సందర్శన

విశాలాంధ్ర - హైదరాబాద్ : జల మండలి ఈడీ మయాంక్ మిట్టల్ అధికారులతో కలిసి వరద పరిస్థితిని పర్యవేక్షించేందుకు హిమాయత్‌సాగర్ రిజర్వాయర్‌ను బుధవారం తనిఖీ చేశారు. అధికారులను ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలను అడిగి తెలుసుకున్న ఈడీ వర్షపాతానికి అనుగుణంగా, రిజర్వాయర్‌ల నీటి మట్టం, గేట్ల నిర్వహణ తదితర అంశాల్లో ఎప్పటికప్పుడూ పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, ట్రాన్స్మిషన్ సిజిఎం బ్రిజేష్, జీఎం సంతోష్ పాల్గొన్నారు.

మద్యం కేసులో నిందితులకు రిమాండ్ పొడిగింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మద్యం కేసులోని 12 మంది నిందితులకు ఏసీబీ కోర్టు మరోసారి రిమాండ్ పొడిగించింది. ఈనెల 26వ తేదీ వరకు రిమాండ్ పొడిగిస్తూ బుధవారం ఆదేశాలిచ్చింది. అనంతరం నిందితులను కోర్టు నుంచి జైలుకు పోలీసులు తరలించారు. జీపు ఎక్కించే క్రమంలో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆవేశపడ్డారు. అన్యాయంగా కేసులో ఇరికించారంటూ అరిచారు. అక్రమంగా కేసులు పెట్టిన అధికారులు తప్పకుండా శిక్ష అనుభవిస్తారన్నారు. వేద పాఠశాలను నడుపుతున్నానని, మద్యానికి దూరంగా ఉంటానని చెప్పుకున్నారు. రాజకీయంగా కక్ష ఉంటే మరో కేసు పెట్టాలంటూ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ప్రభుత్వ పెద్దలు తప్పు చేశారని విమర్శించారు. కోర్టులోనూ తన ఆవేదనను వెళ్లగక్కారు. వెన్నునొప్పితో బాధపడుతున్నానని, పెయిన్ కిల్లర్లు వాడినా నొప్పి తగ్గలేదని, చికిత్స అవసరమని వైద్యులు చెప్పారని, అందుకు 15 రోజులు అనుమతివ్వాలని, లేకుంటే శస్త్రచికిత్స అవసరమవుతుందని న్యాయమూర్తి వద్ద వాపోయారు. ఇదిలావుంటే, తనకు బెయిల్ రాకుండా సిట్ ప్రయత్నిస్తోందని ఏ1 రాజ్ కేసీరెడ్డి ఆరోపించారు. సిట్ అధికారులు ఎక్కడో పట్టుకున్న డబ్బుతో తనకు లంకె పెట్టి, కట్టుకథలు అల్లుతున్నట్లు వెల్లడించారు. తనకు రోజుకు రెండు సార్లు ఇంటి భోజనానికి అనుమతివ్వాలని ఎంపీ మిథున్‌రెడ్డి ఏసీబీ కోర్టుకు విన్నవించారు. రోజుకి ఒక పూట మాత్రమే భోజనం వస్తున్నట్టు తెలిపారు. ఇంటి భోజనం కోసం పిటిషన్ వేసుకోవాలని న్యాయమూర్తి ఆయనకు సూచించారు.

అప్రమత్తంగా ఉండండి

భారీ వర్షాలపై మంత్రులు, అధికారులకు చంద్రబాబు ఆదేశం



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రులు, అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ సమీక్షకు మంత్రులు వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, సీఎస్ విజయానంద్ తదితరులు హాజరయ్యారు. విపత్తు నిర్వహణ, వ్యవసాయం, జలవనరుల శాఖ ఉన్నతాధి కారులు కూడా సమీక్షలో పాల్గొన్నారు. వాతావరణ శాఖ సూచనల మేరకు రాగల రెండు, మూడు రోజులు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తత అవసరమని ముఖ్యమంత్రి చెప్పారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో వాగులు, వంకల నుంచి వచ్చే ఆకస్మిక వరద ప్రవాహాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ దిగువ ప్రాంతాలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కృష్ణానదిలో రేపటికల్లా ఐదు లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చే అవకాశం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. ప్రకాశం బ్యారేజీ నుంచి 3.09 లక్షల క్యూసెక్కుల నీరు 35 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నామని తెలిపారు. కాలువలకు ఐదు వేల క్యూసెక్కుల మేర నీరు విడిచిపెట్టినట్టు అధికారులు చెప్పారు. దీనిపై స్పందించిన సీఎం... ప్రకాశం బ్యారేజి దిగువ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. మరోవైపు నాగార్జునసాగర్, పులిచింతల గేట్లను కూడా ఎత్తినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని తక్షణం తొలగించేందుకు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు.

ఎగువ నుంచి వస్తున్న నీటిని సద్వినియోగం చేసుకునేలా రోజుకు నాలుగు టీఎంసీల చొప్పున తరలించి సోమశిల, కండలేరు ప్రాజెక్టులు నింపాలని సీఎం ఆదేశించారు. వరద నీటిని వృథాగా సముద్రంలోకి పోనీయవద్దన్నారు. మైలవరం సహా ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షం బుడమేరు, వెలగలేరుకు పెద్ద ఎత్తున వస్తోందని, ఈ నీరు కృష్ణా నదిలోకి పంపుతున్నట్లు తెలిపారు. బుడమేరు డైవర్షన్ ఛానల్ పనులు కూడా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్టు వివరించారు. వరద నిర్వహణా పనుల్లో భాగంగా రూ.40 కోట్లతో బుడమేరు- వెలగలేరు యూటీ నిర్మాణం చేపట్టేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారు. భారీవర్షం కారణంగా కొండవీటి వాగు, పాలవాగులకు వస్తున్న నీటిని కృష్ణా నదిలోకి నాలుగు పంపుల ద్వారా ఎత్తి పోస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వర్షకాల సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాలువల్లో నీటి ప్రవాహాలు సక్రమంగా వెళ్లేందుకు వీలుగా గుర్రపు డెక్క, తూటు తొలగించాలని, జిల్లాల్లో వర్షాల పరిస్థితిపై ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్లు కూడా అప్రమత్తంగా ఉండి రైతులకు తక్షణ సమాచారం ఇవ్వాలని సీఎం ఆదేశించారు.

నా జీవితంలో చాలా ఆసక్తికరమైన అనుభవాలు ఉన్నాయి, కానీ 'చనిపోయిన వ్యక్తులతో' టీ తాగే అవకాశం ఎప్పుడూ రాలేదు. ఈ ప్రత్యేకమైన అనుభవానికి ఎన్నికల కమిషన్‌కు ధన్యవాదాలు! బీహార్‌లో మరణించారన్న పేరుతో ఓటర్ల జాబితా నుండి ఈసీ తొలగించిన ప్రజలతో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సమావేశమయ్యారు. దీనికి ఈసీ ఏమి సమాధానం చెబుతుంది.

ఈగల్ ఆపరేషన్ వరుస విజయాలు: డీజీపీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా రైళ్ల ద్వారా గంజాయి, మత్తుపదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీస్‌శాఖ చేపట్టిన 'ఆపరేషన్ ఈగల్' వరుస విజయాలు సాధిస్తున్నదని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో గంజాయిపై ఉక్కుపాదం మోపామని, గంజాయి ఉనికే లేకుండా చేయడంతో స్మగ్లర్లు ప్రత్యామ్నాయ మార్గాల వైపు దృష్టి సారించారని, సరిహద్దు రాష్ట్రం ఒడిశా నుంచి రైళ్ల ద్వారా రాష్ట్రం మీదుగా గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారని తెలిపారు. ఈగల్ ఐజీపీ ఆకే రవికృష్ణ నేతృత్వంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్, సీఆర్పీఎఫ్, స్థానిక పోలీసుల సమన్వయంతో చేపట్టిన ఆపరేషన్ ద్వారా వివిధ రైల్వే స్టేషన్లలో గంజాయి, గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గత నెల నుంచి 53 రైళ్లలో ఈగల్ జరిపిన ఆపరేషన్‌లో 43 కేజీల గంజాయి, 436 గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నామని, 10 ఎన్డీపీఎస్ కేసులు నమోదు చేసి... 10 మందిని అరెస్టు చేశామని వివరించారు. కోరమండల్ ఎక్స్‌ప్రెస్ విజయవాడలో 445 గ్రాములు (79 గంజాయి చాక్లెట్లు) స్వాధీనం చేసుకుని బీహార్‌కు చెందిన ఒకరిని, రాయగఢ్-గుంటూరు ఎక్స్‌ప్రెస్‌లో విజయనగరంలో 4.3 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని కర్నూలుకు చెందిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు వివరించారు. ఆపరేషన్ ఈగల్ అమలు ద్వారా రైల్వే మార్గంలో మత్తు పదార్థాల రవాణ నెట్‌వర్క్‌పై దృష్టి పెట్టిందన్నారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న పోలీసు సిబ్బంది, అధికారులను డీజీపీ అభినందించారు.

అక్రమ మైనింగ్ ఆపాలి

హరినాథ్ రెడ్డి డిమాండ్

విశాలాంధ్ర-సత్యవేడు: తిరుపతి జిల్లా, సత్యవేడు మండలం, పీవీపురం పంచాయతీ చమర్తికండ్రిగలో జోరుగా అక్రమ మైనింగ్ సాగుతోందని, దీనిని తక్షణమే ఆపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు హరినాథ్ రెడ్డి డిమాండ్ చేసింది. ఆయన బుధవారం సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్ తదితరులతో కలిసి కంకర క్వారీలను సందర్శించారు. గతంలో దళితులకు, గిరిజనులకు పట్టాలు ఇచ్చిన సాగు భూమిని కూడా ఆక్రమించుకొని కంకర తవ్వకాలు సాగిస్తున్నారన్నారు. దేవాలయ భూములు, శ్మశానవాటికలనూ వదలడం లేదన్నారు. మైనింగ్ వల్ల వాయు కాలుష్యం పెరిగి చమర్థకండ్రిగ కాలనీ గిరిజనులకు రోగాలు వస్తున్నాయని, బ్లాస్టింగ్‌లతో గిరిజనుల ఇళ్లు బీటలు వారుతున్నాయని, భూగర్భ జలాలు అడుగంటి కలుషితమైన నీటిని తాగే దుస్థితి గిరిజనులకు ఏర్పడిందన్నారు. అడవిలోకి వెళ్లే పరిస్థితి కూడా వారికి లేదన్నారు. అనేక సార్లు రెవెన్యూ అధికారులకు గిరిజనులు మొరపెట్టుకున్నా... ఆర్డీవోను కలిసినా ఫలితం లేదని హరినాథ్ రెడ్డి వెల్లడించలేదు. అక్రమ మైనింగ్ యదేచ్ఛగా సాగుతుంటే అధికారులు ఎందుకు పట్టించుకోరని ప్రశ్నించారు. కంకర క్వారీ యాజమాన్యాల గుప్పెట్లో ఉన్న గిరిజనుల భూములను స్వాధీనం చేసుకొని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ మైనింగ్ ఆగకపోతే సీపీఐ అధ్వర్యంలో ఆందోళన చేపడతామని హరినాథ్ రెడ్డి హెచ్చరించారు. క్వారీలను సీజ్ చేయాలని కలెక్టర్‌ను కోరారు. అంతకుముందు గిరిజనులను కలిసి అక్రమ మైనింగ్ క్వారీలను హరినాథ్ రెడ్డి పరిశీలించారు. నాయకులు జనార్దన్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాసులు, రమేష్, చంద్ర, మురళి, నాగార్జున, సుధాకర్, శ్రీను, ధనుంజయులు, ఓబుల్ రాజు, నరేష్ జై చంద్ర పాల్గొన్నారు.

జడ్పీటీసీ ఉపఎన్నికల్లో వైసీపీ అరాచకాలపై ఈసీకి టీడీపీ ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : వైఎస్ఆర్ కడప జిల్లా ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ ఉపఎన్నికల్లో వైసీపీ నేతలు అరాచకానికి పాల్పడ్డారని, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, మాజీ మంత్రి దేవినేని ఉమా, మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఏపీఈడబ్ల్యుఐడీసీ ఛైర్మన్ కుప్పం రాజశేఖర్ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు బుధవారం ఫిర్యాదు అందించారు. ఈ సందర్భంగా వర్ల మాట్లాడుతూ... సక్రమంగా విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులపై బెదిరింపులు, వ్యక్తిగత దూషణలకు దిగారన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిగితే జగన్ సహించలేకపోతున్నాడని విమర్శించారు. తన పాలనలో స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు వేయడానికి కూడా ప్రత్యర్థులకు అవకాశం ఇవ్వని సంఘటనలు జగన్ ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. నామినేషన్లు చించివేసిన సంఘటనను మర్చిపోవడం మంచిది కాదన్నారు. గత మూడు దశాబ్దాలుగా ఓటు హక్కు వినియోగించుకోని పులివెందుల, ఒంటిమిట్ట ఓటర్లు ఈ రోజు స్వేచ్ఛగా, ధైర్యంగా ఓటేయడం చంద్రబాబు ప్రజాస్వామ్య పాలనకు నిదర్శనమన్నారు. గతంలో మాదిరిగా రిగ్గింగ్‌లు, బూత్ స్వాధీనం, దొంగ ఓట్లు వేయడాలు లేవన్నారు. ఎమ్మెల్సీ పంచుమర్తి మాట్లాడుతూ అసలైన రాక్షస పాలనకు నిర్వచనం జగన్ పాలనేనని విమర్శించారు. చంద్రబాబుపై జగన్ దుర్భాషలాడడాన్ని తీవ్రంగా ఖండించారు. దేవినేని మాట్లాడుతూ శాసనసభకు రావడానికి జగన్‌కి ధైర్యం లేదన్నారు. జగన్ మానసిక స్థితి బాగోలేదని బోడె ప్రసాద్ విమర్శించారు. వైసీపీ గుర్తింపును శాశ్వతంగా రద్దు చేయాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేయకుండా శాశ్వతంగా బహిష్కరించాలని డిమాండ్ చేశారు. పాతర్ల రమేష్, కోడూరు అఖిల్ పాల్గొన్నారు.

రాహుల్‌పై జగన్ విమర్శలా: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏఐసీసీ నేత రాహుల్‌ను విమర్శించే అర్హత మాజీ సీఎం జగన్‌కు లేదని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. జగన్ వ్యాఖ్యల్ని ఖండిస్తూ బుధవారం ఒక ప్రకటన చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు రాహుల్ పాటుపడుతున్నారని, జగన్‌లా ఎవరికి లొంగలేదని అన్నారు. ఓట్ల చోరీపై రాహుల్ యుద్ధమే చేస్తున్నారని, ఈ అంశంపై జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే విజయవాడలో కాంగ్రెస్ నిర్వహించే కొవ్వొత్తుల ర్యాలీకి మద్దతు ఇవ్వాలన్నారు.

నారాయణ నాయక్ కుటుంబానికి కోటి చెక్కు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విధి నిర్వహణలో ఉండి... రోడ్డు ప్రమాదంలో మరణించిన అనంతపురానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ వి.నారాయణ నాయక్ కుటుంబానికి కోటి రూపాయల చెక్కును బుధవారం తన కార్యాలయంలో డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా అందజేశారు. అనంతపురం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఈనెల 17వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఫిబ్రవరి 7న నారాయణ నాయక్ మరణించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. చెక్ అందజేతలో ఐజీపీ ఎం.రవిప్రకాశ్, సీఏఓ రాజన్, అనంతపురం ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రమేశ్ కుమార్ పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానం రద్దు

దినేశ్ శ్రీరంగరాజ్, బందెల నాసర్‌జీ డిమాండ్

ఏఐఎస్ఎఫ్ వార్షికోత్సవం సందర్భంగా రక్తదానం

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి దినేశ్ శ్రీరంగరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాసర్‌జీ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ వార్షికోత్సవాల సందర్భంగా కర్నూలు నగరంలోని సీఆర్ భవన్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శ్రీరంగరాజ్, నాసర్ జీ విలేకరులతో మాట్లాడుతూ శాస్త్రీయ విద్యా విధానం అమలుతో అందరికీ సమాన హక్కులు, విద్య అవకాశాలు లభిస్తాయని, నూతన జాతీయ విద్యా విధానంతో విద్యా వ్యవస్థ నాశనమవుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో హిందీ ప్రథమ భాష కావాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. విద్యా విధానంలో సంస్కరణలు అవసరమని సూచించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు విద్య, వైద్యం అందకుండా చేస్తున్నారని, తక్షణమే జీఓ 107, జీఓ 108, జీఓ 77 రద్దు చేయాలని, పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శిథిలావస్థకు చేరుకున్న సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు నూతన భవనాలు నిర్మించాలని, ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులు, కామాటీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలకి ఆర్గనైజేషన్స్ వెళ్లకూడదన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే మంత్రి లోకేశ్ ఇంటిని ముట్టడిస్తామని శ్రీరంగరాజ్, నాసర్‌జీ హెచ్చరించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 30 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.సోమన్న, సాబీర్ బాషా, ఆఫీస్ బేరర్లు రంగస్వామి, వీరేష్, దస్తగిరి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి, శ్రీరాములు, శ్రీనివాసులు, అశోక్, నాయకులు భారతి, పండు, మేసి, అఖిల్, వరుణ్, మహీంద్రా పాల్గొన్నారు.

జిల్లాల పేర్లు...సరిహద్దుల మార్పుపై

సెప్టెంబరు 15 నాటికి జీవోఎం నివేదిక

29, 30 తేదీల్లో ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో బృందం పర్యటన

విశాలాంధ్ర - సచివాలయం: జిల్లా, మండల, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పులపై వచ్చే నెల 15 నాటికి నివేదికను సీఎం చంద్రబాబుకు సమర్పించాలని మంత్రుల బృందం నిర్ణయించింది. అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, వంగలపూడి అనిత, బి.సి. జనార్దన్ రెడ్డి, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్‌లతో ఏర్పాటైన జీవోఎం తొలిసారిగా బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో భేటీ అయింది. డిసెంబరు 31లోగా జిల్లాల పేర్లు, సరిహద్దుల మార్పుల ప్రక్రియ మొత్తం ముగించాల్సి ఉన్నందున జీవోఎం తన నివేదికను సెప్టెంబరు 15 నాటికి సీఎంకు అందజేస్తుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఈనెల 29, 30 తేదీల్లో మంత్రుల బృందం రెండు గ్రూపులుగా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో పర్యటిస్తుందని, ఆ సమయంలో ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వం వద్దకు వచ్చిన అనేక సూచనలపై చర్చించామని, రానున్న కాలంలోనూ వినతులు స్వీకరించి వాటన్నింటినీ క్రోడీకరించి నివేదికను సీఎంకు అందజేస్తామని చెప్పారు. ప్రజలు ఇప్పటి నుంచే కలెక్టర్లకు తమ వినతులను ఇవ్వొచ్చునని, వినతులకు సెప్టెంబరు రెండు ఆఖరు తేదీ అని పేర్కొన్నారు. పరిపాలనా సౌలభ్యం, ప్రజలకు అందుబాటులో ఉండటం, ప్రభుత్వానికి ఆదాయం పెరగడం లక్ష్యంగా తమ సూచనలు ఉంటాయని చెప్పారు. మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ రెండు గిరిజన ప్రాంతాలను కూడా మంత్రుల బృందం పర్యటించి వారి నుంచి అభిప్రాయాలు తీసుకుంటుందని చెప్పారు. జీవోఎం సమావేశం జరుగుతుండగానే దాదాపు 15 మంది జిల్లా, మండల, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పుపై మంత్రుల బృందానికి తమ వినతులను సమర్పించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ గుంటూరు లేదా పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలని వినతి పత్రం సమర్పించారు. అలాగే చీరాల నుంచి వచ్చిన కొందరు బాపట్ల జిల్లా కేంద్రాన్ని చీరాలకు మార్చాలని, బాపట్ల జిల్లాకు దుగ్గిరాల గోపాల కృష్ణయ్య పేరు పెట్టాలని కోరారు. శ్రీకాకుళం జిల్లా మురపాక నుంచి వచ్చిన బివిఎస్ నాయుడుతోపాటు ఆ గ్రామస్తులు తమ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. కృష్ణా జిల్లా మడిచర్ల సర్పంచ్, ఎంపీటీసీ ఆ గ్రామ ప్రజలు... తమ గ్రామాన్ని బాపులపాడు మండలం నుంచి తొలగించి నూజివీడు లేదా ముసునూరు మండలంలో కలపాలని కోరారు.

వీధి కుక్కలపై సుప్రీం తీర్పును పరిశీలిస్తా: సీజేఐ

న్యూఢిల్లీ: ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతం నుంచి వీధి కుక్కలన్నింటినీ తొలగించాలని సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై పెద్దఎత్తున అభ్యంతరాలు వ్యక్తం కావడంతో... ఈ తీర్పు ఉత్తర్వులను తాను పరిశీలిస్తానని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. వీధి కుక్కల దాడుల వల్ల ఢిల్లీ, ఎన్‌సీఆర్ పరిధిలో రేబిస్ మరణాల సంఖ్య పెరుగుతోందని వస్తున్న వార్తలను పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ పార్దివాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌తో కూడిన ధర్మాసనం... 8 వారాల్లోపు అన్ని వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఢిల్లీలో ఎక్కడా వీధి కుక్కలు ఉండటానికి వీల్లేదని స్పష్టంచేసింది. ఈ చర్యలను అడ్డుకోవడానికి ఏవైనా సంస్థలు ప్రయత్నిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. దీనిపై కేంద్ర ప్రభుత్వ వాదనలు మాత్రమే వింటామని, తమ ఆదేశాలకు వ్యతిరేకంగా జంతు ప్రేమికులు, ఇతర పార్టీలు, సంస్థలు వేసిన పిటిషన్లను విచారించబోమని స్పష్టం చేసింది. సుప్రీం తీర్పుపై జంతు హక్కుల సంస్థలు ఆక్షేపణ తెలిపాయి. కేంద్ర మాజీమంత్రి, జంతు హక్కుల కార్యకర్త మేనకా గాంధీ అభ్యంతరం తెలిపారు. తీర్పు ఆచరణ సాధ్యం కాదన్నారు. 'ఢిల్లీలో మూడు లక్షల వీధికుక్కలు ఉన్నాయి. వీటికోసం మూడు వేల షెల్టర్లు కావాలి. వీటి ఏర్పాటుకు రూ.15 వేల కోట్లు ఖర్చు చేసే పరిస్థితిలో ఢిల్లీ ప్రభుత్వం ఉందా' అని ప్రశ్నించారు. ఈ తీర్పు దశాబ్దాలుగా మనం అనుసరిస్తూ వచ్చిన మానవీయ, శాస్త్రీయ ఆధారిత విధానాల నుంచి వెనకడుగు వేసినట్లుగా ఉందని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. 'వీధి కుక్కలన్నింటినీ గంపగుత్తగా తొలగించాలన్న నిర్ణయం క్రూరమైనది' అని అన్నారు. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీ, ప్రముఖ సినీనటులు జాన్ అబ్రహాం, జాన్వీ కపూర్, వరుణ్ ధావన్, సిద్ధార్థ్ ఆనంద్, అడివి శేష్ తదితరులు వీధి కుక్కల సంరక్షణపై స్పందించారు.

16, 17 తేదీల్లో బేబి, జాన్ బ్రిట్టాస్ పర్యటన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఈనెల 16,17 తేదీలలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత, మునక ప్రాంతాల సమస్యలను పరిశీలించడానికి ఆయా ప్రాంతాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటన చేశారు. బేబీ 16వ తేదీ మధ్యాహ్నం రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకొంటారు. రంపచోడవరం దగ్గరనున్న దేవీపట్నం మండలంలోని పెనికెలపాడు, ఇందుకూరు, తాళ్లూరు ప్రాంతాల నిర్వాసిత కాలనీలలో పర్యటిస్తారు. జాన్ బ్రిట్టాస్ అదే రోజు విజయవాడ చేరుకొంటారు. ఏలూరు జిల్లాలో ఉన్న జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం మండలాల్లో పర్యటించారు. అక్కడి ప్రజల్ని కలిసి, వారి సమస్యలు తెలుసుకుంటారు. 17వ తేదీన చింతూరు, వీఆర్‌పురం, కూనవరం, ఎటపాక మండలాల్లో ఇద్దరు నాయకులు పర్యటిస్తారు. ఆరోజు మధ్యాహ్నం ఢిల్లీకి తిరిగి వెళతారు.

ఆక్వా రైతుల అభ్యున్నతికి కృషి

అమెరికా టారిఫ్‌ల ప్రభావం తగ్గించడానికి కొత్త మార్కెట్ల అన్వేషణ: మంత్రి అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర - సచివాలయం: ఆక్వా రంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసి, ప్రపంచ స్థాయిలో నిలుపుతామని మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం రాష్ట్ర ఆక్వాకల్చర్ అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం మంత్రి అధ్యక్షతన జరిగింది. రాష్ట్రంలో మత్స్య సంపద, ఉత్పత్తి నాణ్యత, ఎగుమతి అవకాశాలు, రైతుల ఆదాయాన్ని పెంచే విధానాలపై సమగ్రంగా అధికారులతో చర్చించారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ విధానాల వినియోగం ద్వారా రొయ్యల ఉత్పత్తి పెంపుతో పాటు, అంతర్జాతీయ మార్కెట్‌లో ఆంధ్రప్రదేశ్ స్థాయిని మరింత బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు ఇకపై ఏపీఎస్డీఏ చట్టం కింద తమ ఆక్వా చెరువులను ఆన్‌లైన్‌లో సులభంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ పథకాలు పొందడానికి ప్రతి రైతు తమ చెరువులను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. డి-పట్టా, అసైన్, సీజేఎఫ్ఎస్ భూములపై చేపల పెంపకం చేస్తున్న రైతులకు ఏపీఎస్డీఏ చట్టం ప్రకారం సాగు ధృవీకరణ పత్రం ఇవ్వబడుతుందని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో పౌల్ట్రీ వ్యర్థాలను చేపల ఆహారంగా వాడుతున్నట్లు గుర్తించామని, ఇది ప్రజారోగ్యానికి హానికరంతో పాటు నీటి కాలుష్యం కావడంతో ఈ ప్రక్రియను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. రైతులు ఈ విధానాన్ని నిలిపివేయాలని ఆదేశించారు. చెరువుల యజమానులు చికెన్ వ్యర్థాలను చేపల ఆహారంగా వేసినట్లు రుజువైతే వెంటనే వారి లైసెన్స్ లను రద్దు చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 27 నుంచి రొయ్య ఎగుమతులపై అమెరికా విధిస్తున్న 50 శాతం టారిఫ్‌ల ప్రభావాన్ని తగ్గించేందుకు... దక్షిణ కొరియా, యూరోప్, యూకే, మిడిల్ ఈస్ట్, రష్యా, ఆఫ్రికా వంటి కొత్త మార్కెట్లను అన్వేషించాలని సూచించారు. ఆక్వా రైతులకు మేలు జరిగేలా అధిక సుంకాల వ్యవహారంపై సీఎం చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు చేస్తున్నారని తెలిపారు.

సముద్ర జలాశయ ఫిష్ కల్చర్‌కు ఆమోదం

రాష్ట్రంలో మారికల్చర్, రిజర్వాయర్ కేజ్ కల్చర్ విధానాలకు కమిటీ ఆమోదం తెలిపింది. ప్రయోగాత్మకంగా సముద్ర తీరప్రాంతాలు , జలాశయాల్లో చేపల పెంపకాన్ని ప్రోత్సహించి, మహిళా మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపరచడమే దీని లక్ష్యం. అనువైన నాలుగైదు ప్రాంతాలను ఎంపిక చేసిన తీరప్రాంతాల్లో సముద్ర నాచు సాగును ప్రోత్సహించడం ద్వారా స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఏపీఎస్డీఏ కో-వైస్ చైర్మన్ ఆనం వెంకట రమణా రెడ్డి, మత్స్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, మత్స్య శాఖ కమిషనర్ రామ శంకర్ నాయిక్, ఇతర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.